ప్రభాత
వెలుగు
31.01.2019
www.v6velugu.com
గురువారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 345 పేజీలు: 12+12+12 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL



ఈ సంచికతోపాటు 12 పేజీల
లైఫ్ సప్లిమెంట్ అందుకోండి



నుమాయిష్లో మంటలు

కాలిపోయిన 200 స్టాళ్లు.. ఏడుగురికి గాయాలు

ప్రమాద సమయంలో గ్రౌండ్లో 30 వేల మంది

భయంతో పరుగులు పెట్టిన సందర్శకులు.. తొక్కిసలాట

వీకెండ్ కాకపోవడంతో తప్పిన పెను ప్రమాదం

20 ఫైరింజన్లతో మంటలార్పిన సిబ్బంది

02




జనరల్
ఉరితాళ్లే గతి
గల్ఫ్ ఆశల్లో ప్రాణాలు గల్లంతు.. ఉత్త చేతులతో తిరిగి రాలేక, అక్కడున్నా లాభం లేక ప్రాణాలు తీసుకుంటున్న కార్మికులు.

04



జనరల్
కొచ్చర్ దోషే
వీడియోకాన్ గ్రూప్కు రుణాల్లో రూల్స్ ఉల్లంఘించారు.. తేల్చిన శ్రీకృష్ణ కమిటీ.. ఐసీఐసీఐ బ్యాంకుకు నివేదిక.

02



ప్లే
గెలిస్తే.. చరిత్రే
న్యూజిలాండ్లో అతిపెద్ద విజయంపై కన్నేసిన టీమిండియా. నేడు నాలుగో వన్డే. రిజర్వ్ బెంచ్ను పరీక్షించే చాన్స్.

11



బిజినెస్
పసిడి 34 వేలు
అంతర్జాతీయ పరిణామాలతో 10 గ్రాముల బంగారం ధర ఒక్క రోజే రూ.320 పెరిగి రూ.34,070కి చేరింది.

10

అమెరికాలో తెలుగు విద్యార్థుల అరెస్టు!

ఫార్మింగ్టన్ వర్సిటీలో రెండో మాస్టర్స్ డిగ్రీ చేస్తున్న స్టూడెంట్స్

దీనిలో ప్రాక్టికల్ ట్రైనింగ్ పేరిట తాత్కాలిక ఉద్యోగాలు

అది నిబంధనలకు విరుద్ధమంటూ అధికారుల చర్యలు

15 మందిని తిప్పి పంపే అవకాశం

వర్సిటీ తీరుపై ఎన్నో అనుమానాలు

మిషిగన్: అమెరికాలోని మిషిగన్లో 15 మందికిపైగా తెలుగు విద్యార్థులను అరెస్టు చేసినట్టు సమాచారం. వీరంతా ఫార్మింగ్టన్ యూనివర్సిటీలో చదువుతూ నిబంధనలకు విరుద్ధంగా తాత్కాలిక ఉద్యోగాలు చేస్తున్నారన్న ఆరోపణపై ఇమిగ్రేషన్ అధికారులు, పోలీసులు దాడులు చేశారు. మంగళవారం ఉదయం

మిగతా 2లో

పల్లె పట్టం కారుకే

పంచాయతీ ఎలక్షన్లలో టీఆర్ఎస్ మద్దతుదారులదే ఆధిపత్యం

మూడు దశల్లో ఎన్నికలు జరిగిన పంచాయతీలు	టీఆర్ఎస్ గెలిచినవి	కాంగ్రెస్ గెలిచినవి	ఇతరులు గెలిచినవి
12,501	7,654	2,671	2,113

హైదరాబాద్, వెలుగు:

కారుకే ఊరు పట్టం కట్టింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార టీఆర్ఎస్ మద్దతుదారుల హవా కనిపించింది. రాష్ట్రవ్యాప్తంగా 12,731 పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించారు. మొత్తంగా 2,310 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా చోట్ల ఈ నెల 21,25,30 తేదీల్లో పోలింగ్ జరిగింది. అన్ని విడతల్లో కలిపి 60 శాతానికిపైగా టీఆర్ఎస్ మద్దతు దారులే గెలుపొందారు. మరో 15 శాతం పంచాయతీల్లో స్వతంత్రులు, 25 శాతం సీట్లలో కాంగ్రెస్, టీడీపీ, ఇతర పక్షాలు గెలుపొందాయి. విజయం సాధించిన స్వతంత్రుల్లోనూ చాలా మంది టీఆర్ఎస్కు సంబంధించినవారే కావడం గమనార్హం. మూడో విడతలో ఏకగ్రీవాలతో కలిపి టీఆర్ఎస్ మద్దతుదారులు 2,434 చోట్ల, కాంగ్రెస్ మద్దతుదారులు 911 చోట్ల, స్వతంత్రులు 490 పంచాయతీల్లో విజయం సాధించారు. మొత్తంగా 7,654 చోట్ల టీఆర్ఎస్ మద్దతుదారులు, 1,806 చోట్ల స్వతంత్రులు, మిగతా 3,041 పంచాయతీల్లో కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, వామపక్షాల మద్దతుదారులు గెలుపొందారు.

మిగతా 3లో



ఖమ్మం జిల్లా రఘునాథ పాలెంలో టీఆర్ఎస్ కార్యకర్తల సంబురాలు

మళ్లీ హజారే దీక్ష


32 లెటర్లు రాశా.. ఐదేళ్లు ఎదురుచూశా

అయినా లోక్పాల్ చట్టాన్ని అమలు చేయలేదు

మోడీ సర్కార్ ఒక్క హామీ నెరవేర్చలేదు

రైతు సమస్యలు పరిష్కరించాల్సిందే

రాలేగావ్సిద్ధిలో రైతులు, యువతతో భారీ ర్యాలీ



05



శికాగో నగరంపై మంచు దుప్పటి

మంచు దెబ్బకు అమెరికా గడ్డకడుతోంది. ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయిలో పడిపోయాయి. పోలార్ వర్టెక్స్ (ధ్రువ వాయుగుండం) కారణంగా ఆర్కిటిక్ నుంచి వీస్తున్న చలిగాలులతో ఉష్ణోగ్రతలు మైనస్ 50 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న మంచులో రోడ్లు, ఇళ్లు మునిగిపోతున్నాయి. పైపులలో నీళ్లు కూడా గడ్డకట్టేస్తున్నాయి. మరోవైపు పోలార్ వర్టెక్స్ కారణంగా ఆర్కిటిక్ నుంచి వీస్తున్న చలిగాలుల వల్ల ఉత్తర భారతదేశంలో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గిపోయాయి. రాజస్థాన్లోని చురులో మంగళవారం ఉష్ణోగ్రత మైనస్ 11 డిగ్రీలు నమోదయ్యింది. హిమాచల్ప్రదేశ్లోనూ మంచు తీవ్రత కొనసాగుతోంది.

గడ్డకట్టిన అమెరికా

ప్రమాదకర స్థాయిలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

ఉత్తర మిన్నెసోటా, డకోటాస్లో మైనస్ 50 డిగ్రీలు

పలు రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ

నిలిచిపోయిన వందలాది విమాన సర్వీసులు, రైళ్లు

ఇళ్లలోనే ప్రజలు

ఉత్తర భారతంపైనా పోలార్ వర్టెక్స్ దెబ్బ

05

రాష్ట్రంలోనూ గజగజ

ఆదిలాబాద్ జిల్లాలో 6.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత

మరో మూడు రోజులు చలి గాలుల ప్రభావం

02



అది మహారాష్ట్ర అసెంబ్లీ.. ఓ మహిళా ఎమ్మెల్యే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పర్యావరణవేత్త కూడా అయిన ఆమె మహారాష్ట్రలో అడ్డగోలుగా సాగుతున్న అడవుల నరికివేతపై అన్ని ప్రూఫ్లను సభ ముందు ఉంచారు. దీంతో సర్కారు కదిలింది. అడవుల నరికివేత వెనుకున్నవారిని పట్టుకోవాలని ఆదేశించింది. అటవీశాఖ ఉద్యోగులకు ఆయుధాలిచ్చింది. గోదావరి నదిలో పర్యవేక్షణ కోసం 5 బోట్లు కూడా కేటాయించింది! అక్కడ అడవుల నరికివేత వెనకున్నది ఎవరో కాదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన 'తెలంగాణ వీరప్పన్'! ఇది జరిగి పదేళ్లవుతున్నా అతడిని పట్టుకోలేదు.

తెలంగాణ వీరప్పన్
మహారాష్ట్రకూ వాంటెడ్
పట్టుకునేందుకు పదేళ్లుగా గాలింపు

స్మగ్లర్ ఆగడాలపై మహా అసెంబ్లీలో పవర్పాయింట్ ప్రజంటేషన్

అటవీ శాఖ సిబ్బందికి ఆయుధాల అందజేత

అయినా దొరక్కుండా యథేచ్ఛగా కలప అక్రమ వ్యాపారం

అడవుల్లో నిత్యం 500 వరకు ఎడ్లబండ్లు.. వంద లారీల్లో తరలింపు

చూసుకునేదంతా నెట్వర్కే.. తన పేరు ఎక్కడా రాకుండా జాగ్రత్తలు

సంచలనం సృష్టించిన 'వెలుగు' కథనం

పట్టుకోవాల్సిందిగా ఉన్నతాధికారుల ఆదేశాలు!

జయశంకర్ భూపాలపల్లి, వెలుగు:

రాష్ట్రంలోనే కాదు.. మహారాష్ట్రలోనూ తెలంగాణ వీరప్పన్ అక్రమాలు యథేచ్ఛగా సాగాయి. అధికారులకు డబ్బు ఆశ చూపించి మచ్చిక చేసుకోవడం, కలప వ్యాపారానికి అడ్డురాకుండా చూసుకోవడం ఇతడికి కొట్టిన పిండి. ఈ స్మగ్లర్ను పట్టుకునేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం చాలా ఏళ్లుగా ఎదురుచూస్తోంది. అయినా ఎవరికీ చిక్కకుండా తన అక్రమ కలప వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూ పోతున్నాడు.

మిగతా 2లో

వెన్కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్నగర్
85.00	83.00	85.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
84.00	83.00	84.00


వచ్చేది 'ఓటు' బడ్జెటే

రేపు పార్లమెంట్లో ప్రవేశపెట్టనున్న పీయూష్ గోయల్

ప్రజాకర్షక పథకాలతో సిద్ధమవుతున్న మోడీ బడ్జెట్ బండి

రైతులు, పేదలు, ఉద్యోగులే టార్గెట్.. నేటి నుంచే బడ్జెట్ సమావేశాలు

02



మహాకూటమి గెలిస్తే రోజుకో ప్రధాని!

కేంద్రంలో మహాకూటమి అధికారంలోకి వస్తే రోజుకొకరు ప్రధాని అవుతారు. సోమవారం మాయావతి, మంగళవారం అఖిలేశ్‌యాదవ్, బుధవారం మమతా బెనర్జీ, గురువారం శరద్ పవార్, శుక్రవారం దేవెగౌడ, శనివారం ఎం.కె.స్టాలిన్ ప్రధానులుగా పని చేస్తారు. ఆదివారం మాత్రం సెలవుదినం. బీజేపీ అంటే భయంతోనే వీళ్లంతా ఏకమవుతున్నారు. వీళ్లకు దమ్ముంటే ప్రధాని అభ్యర్థిని ముందే ప్రకటించాలి. అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి బీజేపీ కట్టుబడి ఉంది. కాంగ్రెస్‌తరఫు లాయర్ల వల్లే గుడి భూ వివాదంపై సుప్రీం కోర్టు తీర్పు ఆలస్యం అవుతోంది.


- లక్నోలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా

చలి మరీ ఎక్కువైంది

ఆదిలాబాద్ జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రత 6.6 డిగ్రీలు



హైదరాబాద్, వెలుగు: చలి మరింత పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం సాధారణం కంటే 6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్, కొమురం భీం, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో చలి గాలులు వీస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 6.6, రామగుండంలో 8.6, హన్మకొండలో 9.0, హైదరాబాద్‌లో 9.3, నిజామాబాద్‌లో 10.1, హకీంపేటలో 10.6, ఖమ్మం, మెదక్‌లో 12.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలూ మరింత తగ్గాయి. ఆదిలాబాద్‌లో 24 డిగ్రీలు, హకీంపేట, హన్మకొండ, రామగుండంలో 25 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం, రాత్రి సమయాల్లో పొగమంచు కురుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మరో మూడు రోజులపాటు పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. హిందూ మహాసముద్రాన్ని ఆనుకుని ఉన్న అండమాన్, ఆగ్నేయ బంగాళాఖాతం ప్రాంతాల్లో అల్పపీడన ద్రోణి బలహీనపడినట్లు తెలిపారు.




వారం పాటు రాష్ట్రంలో కరెంట్ కోతలు?

500 కేవీ లైన్ల మెయింటెనెన్స్ కోసం కరెంట్ కట్ చేస్తున్న పవర్ గ్రిడ్

హైదరాబా ద్, వెలుగు: వారం రోజుల పాటు రాష్ట్రంలో కరెంట్ కోతలు ఎదురయ్యే అవకాశం ఉంది. తాల్చేరు (ఒడిషా) నుంచి కోలార్ (దక్షిణాది) వరకు 500 కేవీ హెచ్‌వీడీసీ లైన్లకు గురువారం నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్టు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ప్రకటించింది. లైన్ల మెయింటెనెన్స్‌లో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. తాల్చేరు నుంచి దక్షిణాది రాష్ట్రాలకు ఎన్టీపీసీ సరఫరా చేసే 2 వేల మెగావాట్ల కరెంట్‌కు ఈ కారిడారే కీలకం. ఈ నేపథ్యంలోనే గ్రిడ్ రక్షణ కోసం కొత్త గ్రిడ్ (ఉత్తరం, తూర్పు, పశ్చిమం) కరెంట్ సరఫరాపైనా నేషనల్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ) ఆంక్షలు విధించింది. ఆ ప్రభావం వల్ల తెలంగాణలోనూ ఆరో తేదీ వరకు కరెంటు సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని, ప్రజలు సహకరించాలని ట్రాన్స్‌కో డైరెక్టర్ (గ్రిడ్ ఆపరేషన్) నర్సింగరావు కోరారు.


గోదావరి నదిలో కొట్టుకొచ్చిన టేకు కలప


అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న టేకు

తెలంగాణ వీరప్పన్

మహారాష్ట్రకూ వాంటెడ్

(మొదటి పేజీ తరువాయి)

'తెలంగాణ వీరప్పన్.. పట్టుకుంటే రాష్ట్రంలో సగం అడవులు సేఫ్' శీర్షికన బుధవారం 'వెలుగు'లో ప్రచురితమైన కథనం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అటవీ, పోలీస్ శాఖ వర్గాల్లో ప్రకంపనలు రేకెత్తించింది. హైదరాబాద్‌తోపాటు ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈ కథనంపై చర్చ జరిగింది. ప్రభుత్వాధికారుల్లోనూ తీవ్ర చర్చనీయాంశమైంది. దీంతో అతడిని వెంటనే పట్టుకోవాల్సిందిగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన అటవీ, పోలీస్ శాఖ బలగాలు అతడిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టాయి.

సంచలనం సృష్టించిన 'వెలుగు' కథనం

స్మగ్లింగ్ స్టైలే వేరు..

టేకు కలపను స్మగ్లింగ్ చేయడంలో 'తెలంగాణ వీరప్పన్' స్టైలే వేరు. రెండు దశాబ్దాల ఈ వ్యాపారంలో ఇతడిపై రెండంటే రెండు కేసులు మాత్రమే నమోదయ్యాయి. అడ్డొచ్చిన వారందరినీ ప్రలోభపెడుతూ తన వ్యాపార సామ్రాజ్యాన్ని మూడు రాష్ట్రాలకు విస్తరించాడు. వందల సంఖ్యలో అనుచరగణం ఉంది. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని అడవుల్లో పెద్దఎత్తున టేకు చెట్లను కొట్టి స్మగ్లింగ్ చేస్తున్నా ఎక్కడా ఇతడు నేరుగా పాలుపంచుకోడు. అంతా తెర వెనుక ఉండి నడిపిస్తాడు. చెట్లు కొట్టడం నుంచి వాటిని చేరవేయడం దాకా అతడి నెట్‌వర్క్ టీమ్ చూసుకుంటుంది. హైదరాబాద్ నుంచి వచ్చే స్పెషల్ టీంల దాడుల్లో ఒకవేళ వాహనాలు, కలప పట్టుబడితే అందులో ఉన్న వ్యక్తులపై మాత్రమే కేసులు నమోదవుతాయి తప్ప తన పేరు ఎక్కడా రాకుండా జాగ్రత్తలు తీసుకుంటాడు.

అడవిలో రోజూ 500 ఎడ్లబండ్లు

ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ అడవుల్లో టేకు చెట్లను కొట్టేందుకు, ఎడ్లబండ్లు వెళ్లడానికి 'వీరప్పన్' అంతర్గత రహదారులు వేయించాడు. అడవిలో ఈయనకు చెందిన ఎడ్లబండ్లు రోజూ 200 నుంచి 500 దాకా తిరుగుతాయి. ఇప్పుడు మన దగ్గర టేకు పల్చబడడంతో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలపై దృష్టి సారించాడు. గోదావరి నదీ తీరం నుంచి టేకు కలప కొట్టుకుంటూ 60 కి.మీ. దూరం దండకారణ్యంలోకి చొచ్చుకెళ్లాడు. ఛత్తీస్‌గఢ్‌లోని నిరుపేదలతో అడవులను నరికిస్తున్నాడు. మావోయిస్టుల కదలికల కారణంగా అటవీ శాఖ, పోలీస్ అధికారుల జాడ లేని చోట నరికివేత చేపడతారు. ఇలా నరికిన కలపను గోదావరి దాటిస్తారు.

అధికారులకు లక్షలకు లక్షలు

తాడ్వాయి ఏరియాలో పనిచేసే ఓ అటవీ శాఖ ఉద్యోగి తన సొంత గ్రామంలో రూ.50 లక్షల ఇల్లు కట్టుకున్నాడు. తాను పనిచేసే చోట కోటి రూపాయలతో మూడంతస్థుల భవనం నిర్మించాడు. ఇతడు కూడా అక్రమ కలప వ్యాపారం చేశాడు. నాన్ ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ఈ ఉద్యోగి తన కొడుకు, కూతురుకి ఏజెన్సీ సర్టిఫికెట్ ఇప్పించుకొని అటవీ శాఖ, పోలీస్ శాఖలో వారికి ఉద్యోగాలు ఇప్పించుకున్నాడు. ఇదంతా 'తెలంగాణ వీరప్పన్' చలువ వల్లే సాధ్యమైందని అతడి తోటి ఉద్యోగులు చెబుతారు. ఇలా అటవీ శాఖ ఉద్యోగులను మచ్చిక చేసుకోవడం 'వీరప్పన్' స్టైల్‌గా వివరిస్తున్నారు.

లారీలు.. వాటి ముందు టూ వీలర్లు..

'వీరప్పన్'కు సుమారు వంద లారీల వరకు ఉన్నాయి. కొట్టిన కలప అంతా ఒక దగ్గరికి చేర్చితే అక్కడికి లారీలు చేరుకుంటాయి. 15, 20 నిమిషాల్లో లారీల్లోకి వాటిని ఎక్కిస్తారు. పైకి కలప కన్పించకుండా ఉనుక సంచులు లేదా గడ్డి, ఇతర సరుకులతో నింపుతారు. ఒక్కో లారీకి ఎస్కార్ట్‌గా ఐదారు టూ వీలర్లు ముందు వెళ్తాయి. అటవీ ప్రాంతం నుంచి హైదరాబాద్ వెళ్లే సరికి లారీ నెంబర్‌ను ఐదారు సార్లు మార్చేస్తారు. ఒకవేళ ఎవరైనా గుర్తు తెలియని పోలీస్, అటవీ శాఖ వాహనాలు కన్పిస్తే వెంటనే లారీ డ్రైవర్‌ను అప్రమత్తం చేస్తారు. దీంతో డ్రైవర్ వెంటనే ప్రధాన రహదారికి పక్కనే ఉన్న గ్రామం వద్దకు తీసుకెళ్లి ఆపేసి టైర్లు విప్పి వాహనం పాడైనట్లుగా యాక్టింగ్ చేస్తాడు. తర్వాత రోడ్డు క్లియర్‌గా ఉందని సమాచారం రాగానే లారీని అనుకున్న ప్లేస్‌కు తీసుకెళ్తాడు.

పర్యావరణవేత్తల ఆందోళన

తెలంగాణ వీరప్పన్‌పై అధికారులు చర్యలు తీసుకోకపోతే 24 శాతం ఉన్న అడవులు ఇంకా తగ్గిపోతాయని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే 33 శాతం ఉండాల్సిన అడవులు 24 శాతానికి పడిపోయాయని, అందులోనూ పచ్చదనం లేదని సీఎం కేసీఆర్ చెబుతున్నారు. స్థానిక అటవీ, పోలీస్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటే రాబోయే రోజుల్లో రాష్ట్రంలో పచ్చదనం మరింత తగ్గుతుందని పర్యావరణవేత్తలు అంటున్నారు.

చందా కొచ్చర్ దోషే

వీడియోకాన్ గ్రూప్‌కు రుణాల్లో రూల్స్ ఉల్లంఘించారు



- తేల్చిన బీఎన్ శ్రీకృష్ణ కమిటీ
- ఐసీఐసీఐ బ్యాంకుకు నివేదిక
- ఆమె రాజీనామాను టెర్మినేషన్‌గా పరిగణిస్తామన్న బ్యాంకు

ముంబై: వీడియోకాన్ గ్రూప్‌కు రుణాల విషయంలో ఐసీఐసీఐ బ్యాంకు మాజీ ఎండీ, సీఈవో చందా కొచ్చర్ నిబంధనలు ఉల్లంఘించారని సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ నేతృత్వంలోని కమిటీ తేల్చింది. ఈ కమిటీ బుధవారం తన నివేదికను బ్యాంకుకు సమర్పించింది. దీంతో కొచ్చర్ రాజీనామాను టెర్మినేషన్(విధుల నుంచి తొలగింపు)గా పరిగణించాలని ఐసీఐసీఐ బ్యాంకు నిర్ణయించింది. వీడియోకాన్ గ్రూప్‌కు రుణాలు ఇచ్చే విషయంలో చందా కొచ్చర్ క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో కొచ్చర్ తన పదవి నుంచి వైదొలిగారు. అనంతరం నిజాలు నిగ్గు తేల్చేందుకు ఐసీఐసీఐ బ్యాంకు శ్రీకృష్ణ కమిటీని నియమించింది. అవకతవకలు నిజమేనని తేలడంతో కొచ్చర్‌కు ఇప్పుడు ఇస్తున్న, భవిష్యత్‌లో రాబోయే అన్ని రకాల బెనిఫిట్స్‌ను ఉపసంహరిస్తున్నట్లు బ్యాంకు వెల్లడించింది. ఏప్రిల్ 2009 నుంచి మార్చి 2018 దాకా ఆమెకు చెల్లించిన బోనస్ మొత్తాన్ని వెనక్కు తీసుకోవాలని నిర్ణయించింది. "కొచ్చర్ రాజీనామాను టెర్మినేషన్‌గా పరిగణిస్తున్నాం. అవసరమైతే మరిన్ని చర్యలు తీసుకుంటాం" అని బ్యాంకు తెలిపింది. 2016లో కొచ్చర్ కుటుంబం, వీడియోకాన్ గ్రూప్ మధ్య క్విడ్ ప్రోకో ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. 2018లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనంతో సంచలనమయ్యాయి. ఇది చినికిచినికి గాలివానగా మారి చివరకు కొచ్చర్ రాజీనామాకు, ఆ తర్వాత సీబీఐ దర్యాప్తునకు దారితీసింది.


బుధవారం హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోని నుమాయిష్‌లో తగలబడుతున్న స్టాళ్లు

నుమాయిష్‌లో

భారీ అగ్ని ప్రమాదం

- కాలిపోయిన 200 స్టాళ్లు.. ఏడుగురికి గాయాలు
- ప్రమాద సమయంలో గ్రౌండ్‌లో 30 వేల మంది

హైదరాబాద్, వెలుగు: హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. బుధవారం రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో సందర్శకులు భయంతో పరుగులు పెట్టారు. మంటలు వ్యాపించి 200పైచిలుకు స్టాళ్లు కాలిపోయాయి. అగ్నిమాపక దళాలు వెంటనే రంగంలోకి దిగి రెండు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పాయి. ప్రమాద సమయంలో వేల మంది గ్రౌండ్స్‌లో ఉన్నారు. మంటల భయంతో అందరూ పరుగులు పెట్టడంతో తొక్కిసలాట జరిగింది. ఇందులో ఏడుగురు గాయాలపాలయ్యారు. వారిని అంబులెన్స్‌లలో సమీపంలోని కేర్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాదం సంగతి తెలియగానే జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, కమిషనర్ దానకిశోర్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. సహాయ బృందాలను పంపాలని జీహెచ్ఎంసీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ విశ్వజిత్ కంపాటిని ఆదేశించారు. డీఆర్ఎఫ్ బలగాలు చేరుకుని సహాయ చర్యలు చేపట్టాయి. మంటలు, ఉరుకులు పరుగులతో సుమారు గంటన్నర పాటు ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భయానక వాతావరణం నెలకొంది. భారీ ఎత్తున మంటలు ఎగిసిపడటంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. వీకెండ్ కాకపోవడంతో జనం తక్కువగా రావడం, ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు స్పందించడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. మొత్తంగా 140 మంది సిబ్బంది 20 ఫైరింజన్లతో మంటలు ఆర్పారు. స్థానికులు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సహాయ చర్యల్ని హోంమంత్రి మహమూద్ అలీ, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రెసిడెంట్ ఈటల రాజేందర్ పర్యవేక్షించారు. ఆస్తి నష్టం వివరాలపై నివేదిక ఇవ్వాలని ఎగ్జిబిషన్ సెక్రెటరీని ఈటల ఆదేశించారు.

షార్ట్ సర్క్యూట్ వల్లే

ముందుగా ఓ స్టాల్‌లో మంటలు ఎగిసిపడ్డాయి. షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు వచ్చి ఉంటాయని భావిస్తున్నారు. ఇవి పక్కనే ఉన్న ఆంధ్రాబ్యాంక్ ఏటీఎంకు వ్యాపించి మెల్లగా 20 స్టాళ్లకు విస్తరించాయి. దీంతో అక్కడున్న పోలీసులు, నిర్వాహకులు ప్రజల్ని, స్టాళ్ల నిర్వాహకుల్ని వెంటవెంటనే బయటకు పంపించారు. ప్రమాద ఘటనపై ఎగ్జిబిషన్ సొసైటీ ప్రెసిడెంట్ ఈటల రాజేందర్ ఆరా తీశారు. ఆస్తి నష్టం వివరాలను అంచనా వేసి నివేదిక ఇవాలని ఎగ్జిబిషన్ సెక్రెటరీని ఆదేశించారు.

- ప్రమాదం సమయంలో గ్రౌండ్స్‌లో మొత్తం 30 వేల మంది ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు
- 2,600 స్టాళ్లలో 200పైచిలుకు స్టాళ్ల వరకు తగులబడిపోయాయి
- పాలిథీన్, టార్పాలిన్లు తడకలతో కూడిన స్టాళ్లు కావడంతో మంటలు వేగంగా విస్తరించాయి
- ఎక్కువగా ఫర్నీచర్, అలంకరణ సామగ్రి, ఆట వస్తువులు, దుస్తుల దుకాణాల్లే ఎక్కువగా కాలిపోయాయి
- కాలిన షాపుల్లో ఎక్కువగా ఉత్తరాది నుంచి వచ్చిన వ్యాపారులవే ఉన్నాయి. మంటల్లో బుగ్గిపాలైన సామగ్రిని చూస్తూ వారంతా బోరుమంటూ ఏడ్చారు.

ఆందోళన వద్దు.. ఆదుకుంటాం

ప్రమాదం జరిగిన వెంటనే అందరినీ బయటకు పంపించారు. పోలీసు, అగ్నిమాపక సిబ్బంది, జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ బలగాలు మంటలను సకాలంలో ఆర్పేశాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ప్రమాద కారణాల్ని తెలుసుకుంటాం. నష్టం వివరాలు సీఎంకు నివేదిస్తాం. స్టాళ్లు తగలబడిపోయిన వ్యాపారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తప్పకుండా ఆదుకుంటాం.

- మహమూద్ అలీ, హోంమంత్రి

సమగ్ర విచారణ జరుపుతాం

షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. సమగ్ర విచారణ జరిపిస్తాం. స్టాళ్లు తాత్కాలిక నిర్మాణాలు కావడంతో మంటలు వేగంగా విస్తరించాయి. ప్రతిసారి ఎగ్జిబిషన్ జరిగే 45 రోజుల పాటు 2 ఫైరింజన్లు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఈ సారీ ఉన్నారు. మంటలు ఆర్పడంలో జాప్యం జరిగిందా? అన్న కోణంలోనూ విచారణ జరిపిస్తాం.

- ఈటల రాజేందర్, నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ ప్రెసిడెంట్

అమెరికాలో తెలుగు విద్యార్థుల అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

ఆరు గంటల సమయంలో కొలంబస్, హూస్టన్, అట్లాంటా, సెయింట్ లూయిస్, న్యూయార్క్, డాలస్, న్యూజెర్సీ, డెట్రాయిట్, నార్త్ కరోలినా, కాలిఫోర్నియా ప్రాంతాల్లో వారిని అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. అమెరికా ఇమిగ్రేషన్ నిబంధనల ప్రకారం.. ఒక డిగ్రీ చేసిన తర్వాత అదే తరహా డిగ్రీ చేస్తూ ప్రాక్టికల్ ట్రెయినింగ్ పేరిట ఉద్యోగం (సీపీటీ) చేయడం నేరం. అయితే ఒక డిగ్రీ తర్వాత పీహెచ్‌డీ వంటి పై కోర్సులు చేసే వారికి మాత్రం మినహాయింపు ఉంటుంది. ఇలా నిబంధనలకు విరుద్ధంగా పనిచేసేవారు పట్టుబడితే వెంటనే స్వదేశానికి తిప్పి పంపేస్తారు. తాజాగా అరెస్టైన విద్యార్థులు కూడా ఇలాంటి నిబంధనలను ఉల్లంఘించినట్టు చెబుతున్నారు. వీరంతా అప్పటికే వేరే యూనివర్సిటీల్లో ఒక డిగ్రీ చేశారని, తర్వాత మిషిగన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ఫార్మింగ్టన్‌లో ఆ డిగ్రీలకు సమానమైన కోర్సుల్లో చేరారని గుర్తించారు. ఈ కోర్సు ఆధారంగా ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్) అనుమతితో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇలా ఉద్యోగాలు చేసుకునేవారికి ఫార్మింగ్టన్ వంటి యూనివర్సిటీలు విచ్చలవిడిగా ఓపీటీలు ఇస్తున్నాయని అధికారులు గుర్తించినట్టు తెలుస్తోంది. అరెస్టైన వారిలో 15 మంది తెలుగువారు ఉన్నట్టు చెబుతున్నా ఇంకా ఎక్కువ మంది ఉండవచ్చని సమాచారం.

వర్సిటీ సంగతేంటి?

మరోవైపు యూనివర్సిటీ ఆఫ్ ఫార్మింగ్టన్ పనిచేస్తున్న తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యూనివర్సిటీకి దశాబ్దాల చరిత్ర ఉన్నట్టు వెబ్‌సైట్లో చెబుతున్నా.. దీనిని బంగ్లాదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి 2012 నుంచే నిర్వహిస్తున్నట్టు విద్యార్థులు చెబుతున్నారు. భారత్ నుంచి నేరుగా వచ్చే వారి నుంచి 30 వేల డాలర్లు, ఇప్పటికే యూఎస్‌లో స్థిరపడ్డ వారి నుంచి 20 వేల డాలర్లకుపైగా వసూలు చేస్తున్నట్టు సమాచారం. అమెరికా ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ డేటాబేస్‌లో కూడా ఈ యూనివర్సిటీకి సంబంధించి ఎలాంటి వివరాలూ లేవు. తమకు అక్రెడిటింగ్ కమిషన్ ఆఫ్ కెరీర్ స్కూల్స్ అండ్ కాలేజెస్ (ఏసీసీఎస్‌సీ) గుర్తింపు ఉందని వర్సిటీ చెప్పుకున్నా ఆ కమిషన్ వెబ్‌సైట్‌లో ఈ వర్సిటీ వివరాలేవీ లేవు. గతంలోనూ కొన్ని అమెరికన్ యూనివర్సిటీల్లో చేరిన తెలుగు విద్యార్థులు ఇమిగ్రేషన్, ఓపీటీ సమస్యలతో నానా ఇబ్బందుల పాలయ్యారు. ఇటువంటి వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలంటూ మన దేశంతోపాటు అమెరికన్ అధికారులు గైడ్‌లైన్స్ కూడా విడుదల చేశారు.

'ఓటు' బడ్జెటే!

ప్రజాకర్షక పథకాలతో రాబోతున్న మోడీ బడ్జెట్ బండి

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు సరిగ్గా మూడు నెలల ముందు మోడీ సర్కార్ ప్రవేశపెట్టబోతున్న బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎన్నికలకు ముందు కావడం, ఇటీవల ఐదు రాష్ట్రాల్లో బీజేపీ ఓటమి నేపథ్యంలో సంస్కరణల జోలికి పోకుండా ప్రజాకర్షక బడ్జెట్‌కే పెద్దపీట వేస్తారని విశ్లేషకులు భావిస్తున్నారు. మధ్యతరగతి, వేతన జీవుల నుంచి రైతులు, నిరుద్యోగుల వరకు వరాలు ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు. వారిని ప్రసన్నం చేసుకునేందుకు బడ్జెట్‌లో పలు పథకాలు ప్రతిపాదిస్తారని అంటున్నారు.

- రైతులు, పేదలు, యువత, ఉద్యోగులే టార్గెట్
- రేపు లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న పీయూష్

రైతులకు..

తెలంగాణలో అమలు చేస్తున్న రైతుబంధు వంటి పథకాన్ని దేశమంతా అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. రైతులకు ఒక్కో ఏడాది వారి ఖాతాల్లో రూ.8 వేలు జమ చేయాలని యోచిస్తున్నట్టు సమాచారం.

పేదలకు..

కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఇటీవల పేదలకు కనీస ఆదాయ పథకాన్ని ప్రకటించారు. దీనికి దీటుగా కేంద్రం కూడా యూనివర్సల్ బేసిక్ ఇన్‌కం పేరుతో కొత్త స్కీం ప్రకటించవచ్చని వార్తలు వస్తున్నాయి.

వేతన జీవులకు..

పన్ను మినహాయింపులు, ట్యాక్స్ శ్లాబులు మార్చడంతో వీరిని ఆకట్టుకోవాలనుకుంటోంది. ఆదాయంపై పన్ను మినహాయింపు పరిమితిని రూ.2.50 లక్షల నుంచి రూ.3.5 లక్షలకు పెంచవచ్చని అంటున్నారు. కార్పొరేట్ పన్నును కూడా 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గిస్తారంటున్నారు.

నిరుద్యోగులకు..

ఉపాధి అవకాశాలు లేకపోవడంతో యువతలో అసంతృప్తి ఉన్నందున నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించడంపై బడ్జెట్‌లో ప్రత్యేక దృష్టి పెట్టవచ్చు.



మధ్యంతరమే..

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు గురువారం ప్రారంభం కానున్నాయి. శుక్రవారం ప్రవేశపెట్టబోయేది మధ్యంతర బడ్జెటేనని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం లోక్‌సభ వెబ్‌సైట్లో తెలిపింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరే వరకూ, నాలుగు నెలల ఖర్చులను ఉద్దేశించి మాత్రమే బడ్జెట్ ఉండనుందని తెలిపింది. కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. దేశ ఆర్థిక స్థితిని తెలియజేసే ఎకానమిక్‌సర్వే విడుదలను కూడా వాయిదా వేస్తున్నట్లు ఆర్థిక శాఖ తెలిపింది. ఎన్నికల తర్వాత జూలైలో ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్‌తో పాటు సర్వే విడుదల చేస్తామని పేర్కొంది.

సర్పంచుల ప్రమాణం 2న

ఆ రోజు నుంచే అధికారాలు ■ పదవీ కాలాన్ని ఖరారు చేస్తూ సర్కార్ గెజిట్

హైదరాబాద్, వెలుగు: కొత్త సర్పంచులు, ఉప సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లు వచ్చే నెల 2న బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఈమేరకు గురువారం పంచాయతీ రాజ్ కమిషనర్ నీతూ ప్రసాద్ గెజిట్ విడుదల చేశారు. 12,732 పంచాయతీలకు మూడు దశల్లో నిర్వహించిన పోలింగ్ బుధవారంతో ముగిసింది. అందరూ ఒకేసారి ప్రమాణ స్వీకారం చేస్తే ఎలాంటి వివాదాలూ తలెత్తవన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 2024 ఫిబ్రవరి 1 వరకు వాళ్లు పదవిలో కొనసాగుతారు. ప్రమాణ స్వీకరం చేసిన వారంలోపల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వనుంది. రాజేంద్రనగర్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్ మెంట్ (టీఎస్ఐఆర్‌డీ) వారికి శిక్షణ ఇవ్వనుంది. మూడు దశల్లో వారికి శిక్షణ ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. శిక్షణ ప్రారంభం రోజున సీఎం కేసీఆర్ హాజరై వారికి సలహాలు, సూచనలు ఇస్తారని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది ఆగస్టులో 4,383 కొత్త పంచాయతీలను సర్కార్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అందులో 500 జనాభా దాటిన తండాలే 1700 వరకున్నాయి. దీంతో కొత్త సర్పంచులే దాదాపు 75 శాతం మంది ఉన్నారు.

గైడ్‌లైన్స్ బుక్‌లెట్

శిక్షణ ఇవ్వాల్సిన అంశాలకు సంబంధించి గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఓ బుక్‌లెట్‌ను తయారు చేస్తున్నారు. మరో 2 రోజుల్లో అది పూర్తి కానుంది. తెలుగు, ఇంగ్లిష్‌లలో బుక్‌లెట్‌లు ముద్రిస్తున్నారు. పక్క రాష్ట్రాల పంచాయతీల్లో అమలు చేస్తున్న, ఉమ్మడి రాష్ట్రంలో అమలైన అంశాలను అందులో పొందుపరుస్తున్నారు. కొత్త పంచాయతీ రాజ్ చట్టం 2018, వీధి లైట్ల నిర్వహణ, హరిత హారం, విధులు, బాధ్యతలు, భవనాల అనుమతులు, రికార్డుల నిర్వహణ, తడి, పొడి చెత్త కేంద్రాలు, తదితర అంశాలను బుక్‌లెట్‌లో పేర్కొన్నట్టు చెబుతున్నారు. 12,732 మంది చొప్పున సర్పంచులు, ఉప సర్పంచులు, 1,13,380 మంది వార్డు మెంబర్లున్నందున వారికీ హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వడం కష్టమని అధికారులు భావిస్తున్నారు. సర్పంచ్, ఉప సర్పంచులకు టీఎస్ ఐపార్డ్‌లో, వార్డు మెంబర్లకు వారి జిల్లా కేంద్రాల్లో శిక్షణ ఇస్తే బాగుంటుందని ఆలోచిస్తున్నారు.

300 మంది ట్రైనర్లకు శిక్షణ

సర్పంచులకు శిక్షణ ఇచ్చే 300 మంది ట్రైనర్లకు ముందు శిక్షణనివ్వాల్సి ఉంది. ఏయే అంశాలపై శిక్షణ ఇవ్వాలో బుక్‌లెట్ తయారు చేస్తున్నాం. 2 రోజుల్లో పూర్తవుతుంది. శిక్షణ ఏ తేదీల్లో ఇవ్వాలి, ఎన్ని దశల్లో ఇవ్వాలన్నది పంచాయతీరాజ్ అధికారులు ఖరారు చేస్తారు.
నరేంద్ర నాథ్, డైరెక్టర్ , టీఎస్ ఐ పార్డ్



వర్క్‌షాప్ లో మాట్లాడుతున్న సీఈవో రజత్ కుమార్. పక్కన జాయింట్ సీఈవో కట్టా ఆమ్రపాలి

అర్బన్ ఓటింగ్ పెరగాలి

- పట్టణ ప్రజలు ఓటు వేయకపోవడం విచారకరం
- రేడియో జాకీల వర్క్‌షాప్‌లో సీఈవో రజత్‌కుమార్

హైదరాబాద్, వెలుగు: పట్టణ ప్రాంత ప్రజలు పోలింగ్ రోజున ఓటు వేయకపోవడం విచారకరమని సీఈవో రజత్‌కుమార్ అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అర్బన్ ఓటింగ్ శాతం పెంచాలన్న లక్ష్యంతో అన్ని రకాల చర్యలు, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, ఎన్నికల నిర్వహణ అంశాలపై రేడియో జాకీలకు బుధవారం టూరిజం ప్లాజా హోటల్‌లో సీఈవో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేడియో జాకీలకు అవగాహన కల్పించడం ద్వారా ప్రజల్లో మరింత చైతన్యాన్ని తీసుకురావడమే ఈసీ లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగిందని, అర్బన్‌లోనే చాలా తక్కువగా ఉండటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని చెప్పారు. ఓటరు జాబితా నుంచి ఓట్ల తొలగింపు ప్రక్రియ అంతా ఈసీ గైడ్‌లైన్స్‌కు లోబడి జరుగుతుందని, అందుకు అనుసరించాల్సిన పద్దతుల విషయంలో ఏమాత్రం రాజీపడడం లేదని సీఈవో స్పష్టం చేశారు.

చెక్ చేసుకోండి

ఓటరుగా నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరూ ఓటుందా లేదా మరోసారి చెక్ చేసుకోవాలని రజత్ సూచించారు. ఉద్దేశపూర్వకంగా ఫోర్జరీ డాక్యుమెంట్లతో ఓటరు నమోదు చేసుకుంటున్న నేపథ్యంలో ఈసారి గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటు హక్కుకు సంబంధించిన ప్రతిదీ హెల్ప్ లైన్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. ఫేక్ ఐడీ ప్రూఫ్‌లతో ఓట్లు నమోదు సంఘటనలపై విచారణ జరుగుతుందని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. అడ్రస్ మారితే జాబితాలో మార్పు చేసుకునే బాధ్యత వారిదేనని జాయింట్ సీఈవో ఆమ్రపాలి అన్నారు.

రైతును నాశనం చేసింది ఆ పార్టీలే

కాంగ్రెస్, బీజేపీలపై గుత్తా ధ్వజం

హైదరాబాద్, వెలుగు: దేశంలో రైతును నాశనం చేసింది కాంగ్రెస్, బీజేపీలేనని, ఎన్నికలప్పుడే ఆ పార్టీలకు రైతులు గుర్తొస్తారని రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి విమర్శించారు. ఇప్పటికీ మహారాష్ట్రలో రైతులు పాదయాత్రలు, తమిళనాడులో రైతులు అర్ధనగ్న ప్రదర్శనలు, హర్యానాలో కూరగాయలు, పాలు రోడ్లపై పోసి నిరసనలు తెలుపుతున్నారన్నారు. దేశ రైతాంగానికి తెలంగాణను సీఎంకేసీఆర్ దిక్సూచి చేశారని, రాష్ట్రంలో వ్యవసాయానికి ఇస్తున్న ప్రోత్సాహం దేశాన్ని ఆకర్షిస్తోందన్నారు. రైతు బంధు, రైతు బీమా పథకాలను అమలు చేయాలని చాలా రాష్ట్రాలు భావిస్తున్నాయని చెప్పారు. బుధవారం వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ దక్షిణాది రాష్ట్రాల కిసాన్ సమావేశంలో మాట్లాడిన నేతలు వారి హయాంలో రైతులకేం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులపై ప్రేమ ఉంటే ఉపాధిహామీని వ్యవసాయానికి అనుసంధానించే అంశాన్ని మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానించాలని తాను చిదంబరంను కోరానని గుర్తు చేశారు. నాగలి, అరకకు తేడా తెలియనని జైరాం రమేశ్‌తో కమిటీ వేస్తే వద్దని నివేదికిచ్చారని విమర్శించారు. ఈ విషయమై ప్రధానికి కేసీఆర్ లేఖలు రాసినా, అసెంబ్లీలో తీర్మానించి పంపినా ఎన్డీఏ ప్రభుత్వం స్పందించలేదన్నారు. కేసీఆర్ పాలనలో ఎరువుల కొరత లేదని చెప్పారు. 24 గంటల కరెంటు, సాగునీరు, గిట్టుబాటు ధరే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. పండిన ప్రతి గింజను మద్దతు ధరకు కొన్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని చెప్పారు.

కేంద్రంలో హంగే

- టైమ్స్ నౌ–వీఎంఆర్ సర్వే
- ఎన్డీయేకు 252, యూపీఏకు 147, ఇతరులకు 144 సీట్లు
- టీఆర్ఎస్‌కు 10, ఏపీలో వైఎస్ఆర్‌సీపీకి 23 సీట్లు

న్యూఢిల్లీ: వచ్చే సాధారణ ఎన్నికల్లో కేంద్రంలో హంగ్ ఏర్పడొచ్చని టైమ్స్ నౌ-వీఎంఆర్ సర్వే పేర్కొంది. ఎన్డీయే కూటమికి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన దానికన్నా తక్కువగా 252 సీట్లు వస్తాయని చెప్పింది. యూపీఏకు 147, ఇతరులకు 144 స్థానాలిచ్చింది. ఈ మేరకు బుధవారం ఒపీనియన్ పోల్ సర్వే విడుదల చేసింది. ఈ నెల 14 నుంచి 25 వరకు దేశవ్యాప్తంగా 15,731 మందిని ప్రశ్నించి శాంపిల్ సర్వే నిర్వహించినట్టు వెల్లడించింది.

మొత్తం 543 లోక్‌సభ సీట్లకుగాను గత ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి 336 సీట్లు వచ్చాయి. అందులో ఒక్క బీజేపీయే 282 సీట్లు సాధించింది. అయితే తాజా సర్వే ప్రకారం ఎన్డీయే కూటమికి 252 సీట్లకు పరిమితమవుతుందని టైమ్స్ నౌ పేర్కొంది. రాష్ట్రాల విషయానికి వస్తే తెలంగాణలో టీఆర్ఎస్ పట్టు నిలుపుకొంటుందని సర్వే పేర్కొంది. 17 సీట్లలో 10 సీట్లు సాధిస్తుందని, కాంగ్రెస్ కూటమికి 5, బీజేపీకి ఒకటి, ఎంఐఎంకు ఒక సీటు రావొచ్చని అంచనా వేసింది. ఆంధ్రప్రదేశ్‌లో ఈసారి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హవా కనిపిస్తుందని 25 సీట్లకు 23 గెలుస్తుందని, అధికార టీడీపీ 2 సీట్లకు పరిమితమవుతుందని పేర్కొంది. "గత ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో ఎన్డీయే ఎన్డీఏ 80కి ఏకంగా 73 సీట్లు గెలవగా, ఈసారి 27కే పరిమితం అవుతుంది. ఎస్పీ, బీఎస్పీ కూటమికి 51 సీట్లు రావచ్చు. కాంగ్రెస్ రెండు సీట్లకు పరిమితమవుతుంది. మహారాష్ట్రలో ఎన్డీఏ 43 స్థానాలు సాధిస్తుంది. కాంగ్రెస్ కూటమి 5కు పరిమితమవుతుంది. పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ 32 సీట్లు గెలుస్తారు. బీజేపీ సంఖ్య ఇప్పుడున్న రెండు నుంచి 9 సీట్లకు పెరుగుతుంది. వామపక్షాలకు ఒక్క సీటూ రాదు. బిహార్‌లో బీజేపీ కూటమి 25 సీట్లకు పరిమితమవుతుందని, యూపీఏకు 15 వస్తాయి. తమిళనాడులో గత ఎన్నికల్లో 37 సీట్లు గెలుచుకున్న అన్నాడీఎంకే ఈసారి నాలుగుకు పరిమితమవుతుంది. అప్పుడు ఒక్క సీటూ రాని డీఎంకే, కాంగ్రెస్ ఏకంగా 35 గెలుస్తాయి. ఒడిశాలో బీజేపీ 13 సీట్లు గెలుస్తుంది. అధికార బిజూ జనతాదళ్ 20 సీట్ల నుంచి 8కి పడిపోతుంది. కేరళలోనూ ఈసారి బీజేపీ ఖాతా తెరవొచ్చు. హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్, అస్సాంతోపాటు ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ బలం చాటుకుంటుంది'' అని సర్వే అంచనా వేసింది.

పల్లె పట్టం కారుకే

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలతో జనం ఆ పార్టీకి ఘన విజయాలు సాధించి పెడుతున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ భారీ మెజారిటీ వచ్చింది. అసెంబ్లీ ఫలితాలు వచ్చిన నెలన్నర రోజుల్లోనే పంచాయతీ ఎన్నికలు జరిగాయి. దీంతో టీఆర్ఎస్‌కు అనుకూలంగా పెద్ద సంఖ్యలో గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు, రైతు బీమా, ఆసరా పెన్షన్లు వంటి పథకాలు అసెంబ్లీ, పంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలుపునకు పనిచేశాయని పార్టీ నేతలు అంటున్నారు.

కొత్త పంచాయతీలన్నీ కారు వైపే

రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టులో 4,383 కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. 500 జనాభా దాటిన 1,700కుపైగా తండాలను, చిన్న గ్రామాలను కూడా పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. అలాంటి చిన్న పంచాయతీలను ఏకగ్రీవం చేసి, ప్రోత్సాహక నిధులు అందుకునేల చూడాలని సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులను ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే ఏకగ్రీవ పంచాయతీల సంఖ్య పెరిగింది. ఇలాంటి వాటిల్లో అత్యధికం టీఆర్ఎస్ మద్దతుదారులే గెలుచుకోవడం గమనార్హం.

గ్రామాల అభివృద్ధికి నిధులు: కవిత

రాష్ట్రంలోని గ్రామాల్లో ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేయడమే సీఎం కేసీఆర్ కల అని టీఆర్ఎస్ ఎంపీ కవిత అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం పోతంగల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. కొత్తగా విజయం సాధించిన వారు గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని, ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని చెప్పారు. కాంగ్రెస్ కేవలం నినాదాలకే పరిమితమని, బీజేపీ చేసిందేమీ లేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి ప్రజలు పట్టం కడుతున్నారని పేర్కొన్నారు.



కరీంనగర్ జిల్లా తంగళ్లపల్లి సర్పంచ్‌గా గెలిచాక అంకారపు అనిత ఆనందం

గ్రామ పంచాయతీల ఫలితాలు (ఏకగ్రీవాలతో కలిపి)

	మొదటి దశ	రెండో దశ	మూడో దశ	మొత్తం
టీఆర్ ఎస్	2612	2608	2434	7,654
కాంగ్రెస్	911	833	927	2,671
టీడీపీ	30	39	12	81
బీజేపీ	67	37	59	163
సీపీఐ	19	12	19	50
సీపీఎం	32	24	20	76
స్వతంత్రులు	756	560	490	1,806
మొత్తం	**4427**	**4113**	**3961**	**12,501**

(నామినేషన్లు దాఖలు కాకపోవడం, కోర్టు స్టే వంటి కారణాలతో మూడు దశల్లోనూ పలు పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదు. కొన్నింటి ఫలితాలు వాయిదా వేశారు)

ఏకగ్రీవమైన పంచాయతీలు, వార్డులు

ఎన్నికలు	తొలి విడత	రెండో విడత	మూడో విడత
పంచాయతీలు	4,479	4,135	4,116
ఏకగ్రీవం	769	788	573
వార్డులు	39,832	36,508	36,718
ఏకగ్రీవం	10,654	10,317	8,959

ముగిసిన పోరు

గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ బుధవారంతో ముగిసింది. రాష్ట్రంలోని 30 జిల్లాల పరిధిలో 12,751 గ్రామ పంచాయతీలకుగాను 12,731 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. మూడు విడతలుగా ఈ నెల 21, 25, 30 తేదీల్లో పోలింగ్ జరిగింది. బుధవారం జరిగిన మూడో విడత ఎన్నికల్లో 88 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా యాదాద్రి జిల్లాలో 94.99, ఖమ్మం జిల్లాలో 94.5 శాతంగా, అత్యల్పంగా జగిత్యాల జిల్లాలో 77.7 శాతం ఓటింగ్ నమోదైంది. ఇక మూడు దశల్లోనూ పలు పంచాయతీలకు ఎన్నికలు జరగలేదు. పాలకవర్గం గడువు పూర్తికాని గ్రామాలు 17 ఉండగా, హైకోర్టు స్టే కారణంగా 25 పంచాయతీల్లో, నామినేషన్లు దాఖలుకాకపోవడంతో మిగతా పంచాయతీల్లో పోలింగ్ నిర్వహించలేదు. వీటికి త్వరలోనే ఎన్నికలు చేపట్టే అవకాశముంది.

వీవీప్యాట్ స్లిప్పులు లెక్కించాలి: అద్దంకి

హైదరాబాద్, వెలుగు: వీవీప్యాట్ స్లిప్పులు లెక్కించాలని 40 రోజులుగా డిమాండ్ చేస్తున్నా, ఎన్నికల సంఘం స్పందించడం లేదని టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ అన్నారు. ఇంకొన్ని రోజులు గడిస్తే స్లిప్పులనూ తారుమారు చేసే అవకాశముందని ఆరోపించారు. ఓటింగ్ ముగిసిన వెంటనే స్ట్రాంగ్ రూములకు తరలించాల్సిన ఈవీఎంలను దారి మళ్లించారని, 12 గంటల తర్వాత స్ట్రాంగ్ రూములకు తరలించారన్నారు. అందుకే తాము వీవీ ప్యాట్‌స్లిప్పులు లెక్కించాలంటున్నామన్నారు. పార్టీ నిర్ణయించిన నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేస్తానని అద్దంకి వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికలపై చర్చించేందుకు వచ్చే నెల 1, 2 తేదీల్లో మండల, జిల్లాస్థాయి నేతలతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు.



బాపూఘాట్‌లో గాంధీజీకి హోంమంత్రి నివాళి

హైదరాబాద్ , వెలుగు: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని లంగర్ హౌజ్ లోని బాపూఘాట్ ను అధికార పార్టీ నాయకులు, అధికారులు సందర్శించారు. గాంధీజీ సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, హోంశాఖామాత్యులు మహమూద్ అలీ, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, నగర మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కే.జోషి, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ అదర్ సిన్హా, జాయింట్ సెక్రటరీ అరవింద్ సింగ్, ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్, ఇంచార్జ్ కలెక్టర్ జి.రవి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎకరం రూ.5 కోట్లకిస్తే ఎవరొస్తరు?

పెట్టుబడులపై ఏపీ మంత్రి లోకేశ్

అమరావతి, వెలుగు: 'ఎకరం రూ. 5 కోట్లకిస్తే పెట్టుబడి పెట్టేందుకు ఎవరొస్తారు. అందుకే పాలసీ ప్రకారం భూములు కేటాయిస్తున్నాం' అని ఏపీ మంత్రి నారా లోకేశ్ బుధవారం అన్నారు. హైటెక్‌సిటీకి భూమిచ్చినప్పుడూ ఇలానే విమర్శించారని, కానీ ఇప్పుడు 6 లక్షల మంది ఐటీ ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేవాళ్లంతా తన స్నేహితులేనన్నారు. తప్పుడు సర్వేలు నమ్మమని, వైఎస్సార్ సీపీకి 23 ఎంపీ స్థానాలొస్తాయన్న సర్వే ఫలితాలు ఎన్నికల నాటికి తారుమారవుతాయని చెప్పారు. '2014లోనూ టీడీపీ ఓడిపోతుందని చాలా సర్వేలు చెప్పాయి. కానీ మేమే అధికారంలోకి వచ్చాం' అని గుర్తు చేశారు.

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలు షురూ

5న ఓటాన్ అకౌంట్ బడ్జెట్

అమరావతి, వెలుగు: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగించారు. నాలుగున్నరేళ్లలో విభజన సమస్యలు పరిష్కారం కాలేదని, ఇస్తామన్న హోదా ఇవ్వలేదని అన్నారు. విభజన అసంబద్ధంగా జరగడంతో ఏపీ ఎంతో నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగం తర్వాత సభ వాయిదా పడింది. ఉదయం 9 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో కేబినెట్ భేటీ అయింది. గవర్నర్ ప్రసంగాన్ని ఆమోదించింది. అసెంబ్లీ వాయిదా పడ్డాక స్పీకర్ కోడెల శివప్రసాదరావు అధ్యక్షతన బీఏసీ సమావేశం జరిగింది. ఫిబ్రవరి 8 వరకు సమావేశాలు నిర్వహించాలని భేటీలో నిర్ణయించారు. ఫిబ్రవరి 1న విభజన సమస్యలు, కేంద్రం వైఖరిపై అసెంబ్లీలో చర్చ జరగనుంది. 2, 3, 4 తేదీల్లో అసెంబ్లీకి సెలవులిచ్చారు. ఐదున ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. 6న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. 8న విజన్ డాక్యుమెంట్‌పై అసెంబ్లీలో చర్చిస్తారు.

రూ.1,01,378 కోట్లు

నాబార్డు వార్షిక ప్రణాళిక విడుదల • గతేడాది కంటే 22 శాతం వృద్ధి

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తూ నాబార్డు 2019-20 వార్షిక ప్రణాళికను విడుదల చేసింది. ప్రాధాన్యతా రంగాలకు రూ.1,01,378 కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. గతేడాది కంటే రూ.17,989.73 కోట్లు (22శాతం) అధికంగా కేటాయింపులు జరిపింది. బుధవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన నాబార్డు రాష్ట్ర ప్రణాళిక సదస్సుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి ముఖ్య అతిథిగా హాజరై వార్షిక ప్రణాళికను ఆవిష్కరించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.70,965.17 కోట్లు కేటాయించింది. ఇందులో పంట నిల్వ, భూమి అభివృద్ధి, మౌలిక సదుపాయాలకు రూ.2,318 కోట్లు, వ్యవసాయ కార్యకలాపాలు, ఫుడ్, ఆగ్రో ప్రాసెసింగ్ కు రూ.7,189 కోట్లు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు రూ.21,065.98 కోట్లు కేటాయించింది. విద్యకు రూ.2009.41 కోట్లు, హౌసింగ్ రంగానికి రూ.5,834.94కోట్లు, పునరుత్పాదక ఇంధన వనరులకు రూ.317.38 కోట్లు కేటాయించింది.



- వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.70,965 కోట్లు
- 2019–20 ప్రణాళికను ఆవిష్కరించిన సీఎస్

సహజ వనరుల సద్వినియోగం: సీఎస్

నాబార్డు ప్రణాళిక విడుదల తర్వాత సీఎస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో వినూత్న పథకాలకు రూపకల్పన చేశారని పేర్కొన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు కోసం అన్ని స్థాయిల్లో కృషి జరగాలన్నారు. తరిగిపోతున్న సహజ వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని అధికారులను ఆదేశించారు. బ్యాంకులు రైతులకు సకాలంలో రుణాలు అందజేయాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సి.పార్థసారథి, నాబార్డు తెలంగాణ సీజీఎం విజయ్‌కుమార్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణసారథి, టీకాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాబార్డు వార్షిక ప్రణాళిక

కేటాయింపులు	2018–19	2019–20
వ్యవసాయ, అనుబంధ రంగాలు	రూ.62,352.60 కోట్లు	రూ.70,965.17 కోట్లు
ఎంఎస్‌ఎంఈలు	రూ.11,528.77 కోట్లు	రూ.21,065.98 కోట్లు
విద్య	రూ.1,206.6 కోట్లు	రూ.2,009.41 కోట్లు
హౌసింగ్	రూ.3,759.07 కోట్లు	రూ.5,834.94 కోట్లు
పునరుత్పాదక ఇంధనం	రూ.263.58 కోట్లు	రూ.317.38 కోట్లు
ఇతరాలు	రూ.3,662.12 కోట్లు	రూ.176.8 కోట్లు
సామాజిక మౌలిక సదుపాయాలు	రూ.616.67 కోట్లు	రూ.1,008.92 కోట్లు
మొత్తం	రూ.83,388.87 కోట్లు	రూ.1,01,378.60 కోట్లు

ఉరితాళ్లే గతి

గల్ఫ్ ఆశల్లో గల్లంతవుతున్న ప్రాణాలు

వెలుగు, నెట్‌వర్క్: ఊర్లో పనిలేదు.. నాలుగు పైసలు సంపాదించుకుందామని గల్ఫ్‌కు పోతే అక్కడా సరిగా లేదు.. ఎన్నేండ్లున్నా రూపాయి మిగిలేటట్టు లేదు. పెళ్లాం పిల్లలను ఎట్లా సాదుకోవాలన్న బాధ. ఊర్లో అప్పులిచ్చినోళ్ల లొల్లి. ఉత్త చేతులతో తిరిగి ఇంటికి రాలేని పరిస్థితి, గల్ఫ్‌లో ఉన్నా లాభం లేక.. చివరికి ఉరితాడును ఆశ్రయిస్తున్నారు. ఎంత కష్టపడైనా ఇన్ని పైసలు తీసుకుని ఇంటికి పోదామనుకున్న మరికొందరు ప్రమాదకరమైన చోట్ల పనులకు వెళుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. వారిపైనే ఆధారపడి బతుకుతున్న కుటుంబాలు అనాథలవుతున్నాయి.

పైసలేమో.. ప్రాణాలు పోతున్నయ్

బతుకు మీదఆశతో బండెడు అప్పులు చేసి గల్ఫ్ వెళ్తున్న వారి జీవితాలు తలకిందులు అవుతున్నాయి. ఏజెంట్ల మోసాలు, అప్పులు, సరైన పని దొరక్క ఉత్త చేతులతో ఇంటికి వెళ్లలేక బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. దీంతో వారి కుటుంబాలు కూలిపోతున్నాయి. మరిన్ని కష్టాల్లో కూరుకుపోతున్నాయి. ఇలా ఒకరిద్దరు కాదు.. రాష్ట్రం నుంచి గల్ఫ్‌కు వలస వెళుతున్న వందలాది కుటుంబాల వారి పరిస్థితి ఇదే. 2017 గణాంకాల ప్రకారం గల్ఫ్ దేశాల్లో 22.53 లక్షల మంది భారతీయులు కార్మికులుగా పనిచేస్తున్నారు. అందులో ఒక్క తెలంగాణ నుంచే రెండు లక్షల మంది వరకు ఉంటారు. అయితే కొన్నేళ్లుగా గల్ఫ్‌లో నెలకొన్న పరిస్థితులతో అక్కడ పనులు సరిగా ఉండటం లేదు. జీతాలు తక్కువగా ఉంటున్నాయి. దానికితోడు ఏజెంట్ల మోసాలతో ఏదో ఉద్యోగం కోసం వెళ్లినవారు భవన నిర్మాణ కార్మికులుగా, ఎడార్లలో ఒంటెలు, మేకలు కాసే పనిలో పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆవేదనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. భవన నిర్మాణ పనుల్లో ఉన్నవారు ఎత్తుపై నుంచి కిందపడి ప్రాణాలు వదులుతున్నారు. కాళ్లుచేతులు విరిగి జీవచ్ఛవాలుగా మారిపోతున్నారు. గత నాలుగేళ్లలోనే ఆరు గల్ఫ్ దేశాల్లో 28,523 మంది భారతీయులు మృతిచెందినట్టు లెక్కలు చెబుతున్నాయి.

ఉరితాడే మిగిలింది

రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన చెన్నవేని సతీశ్ (26) ఊళ్లో ఉపాధి లేక గల్ఫ్‌కు వెళ్లాలని భావించాడు. లక్షన్నర అప్పు చేసి సౌదీకి వెళ్లాడు. ఏజెంట్ మోసంతో తక్కువ జీతానికి ఉద్యోగంలో చేరిన సతీశ్.. ఎనిమిది నెలలకే తిరిగొచ్చాడు. తర్వాత మలేషియాకు వెళ్లినా చాలీచాలని జీతం, పనిభారంతో తిరిగి రావాల్సి వచ్చింది. దాంతో పొలం అమ్మాల్సి వచ్చింది. చివరికి మరోసారి అప్పులు చేసి బహ్రెయిన్ వెళ్లాడు. అక్కడ ఓ కంపెనీలో నెలకు రూ. 8,000 జీతానికి కుదిరాడు. కానీ ఊర్లో అప్పుల వాళ్లు డబ్బు ఇవ్వాలంటూ సతీశ్ కుటుంబంపై ఒత్తిళ్లు మొదలుపెట్టారు. దీంతో సతీశ్ ఆవేదనలో మునిగిపోయాడు. తన జీతం అప్పులపై మిత్తికే సరిపోదంటూ తల్లికి ఫోన్ చేసి బాధపడ్డాడు. ఫోన్‌లో వీడియో కాల్ మాట్లాడుతూనే ఉరి వేసుకున్నాడు. దీంతో ఆ కుటుంబం మొత్తం శోకంలో మునిగిపోయింది. సతీశ్‌కు తల్లితోపాటు భార్య, ఇద్దరు పిల్లలు, పెళ్లీడుకొచ్చిన చెల్లెలు ఉన్నారు. తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు తమ వద్దకు వచ్చి పోయారని, ఇంకా ఎవరూ సాయం చేయడం లేదని అంటున్నారు.



- నాలుగు పైసలు మిగులుతాయన్న ఆశతో అప్పులు చేసి వలసలు
- ఏజెంట్ల మోసాలు, అరబ్ యజమానుల దాష్టీకాలతో ఆవేదన
- ఊర్లో కుటుంబాలకు అప్పులోళ్ల ఒత్తిళ్లు

గల్ఫ్‌లో మరణించిన సతీశ్ ఫోటోతో తల్లి, భార్య పిల్లలు

ఎందరో బాధితులు

మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రానికి చెందిన జాల మల్లేశం(38) రెండున్నరేళ్ల కింద దుబాయి వెళ్లాడు. ఉద్యోగం దొరికినా జీతం తక్కువ కావడంతో ఆందోళన చెంది అక్కడే ఆత్మహత్య చేసుకున్నాడు. నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి మండలం గన్నారం గ్రామానికి చెందిన చెందిన బొద్దుల సాగర్ (27) 30 నవంబర్ 2018న మస్కట్‌లో ఉరివేసుకొన్నాడు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామానికి చెందిన మెండె సాయన్న (40) కూడా అప్పుల బాధతో సౌదీ అరేబియాలో ఉరేసుకున్నాడు. ఏర్గట్ల మండలం బట్టాపూర్‌కు చెందిన తారత ముత్తన్న (48) దీనమైన స్థితిలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. పని కోసం సౌదీ వెళ్లిన ఆయనను యజమానులు ఎడారిలో మేకలు కాసే పని అప్పజెప్పారు. మూడేళ్ల తర్వాత ఎలాగోలా తప్పించుకుని ఓ అరబ్ షేక్ వద్ద పనికి కుదిరాడు. అక్కడ ప్రమాదంలో కాలు విరిగింది. ఇండియాకు వెళతానంటే యజమాని పాస్‌పోర్టు తిరిగి ఇవ్వలేదు. మానసికంగా కుంగిపోయి ఉరేసుకున్నాడు. భీమ్‌గల్ మండలం పురానిపేట్‌కు చెందిన తోట గోపి అలియాస్ భూమేష్ (32), ఇదే ఊరికి చెందిన కుర్మ హన్మాండ్లు (38), కామారెడ్డి పట్టణానికి చెందిన సాయిలు (33), మెట్‌పల్లి మండలం చౌలమద్దికి చెందిన అందె లక్ష్మణ్ (45) గల్ఫ్ దేశాల్లోనే ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మెట్‌పల్లి మండలం జగ్గసాగర్‌కు చెందిన దండుగుల రామస్వామి (28) ఈ నెల 23న మస్కట్ దేశంలో రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఆయనకు తల్లి దండ్రులతోపాటు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రామస్వామి భార్య కూలిపనికి వెళుతూ వృద్ధులైన అత్తామామలు, ఇద్దరు పిల్లలను పోషిస్తోంది.

గాల్లో కలిసిన ప్రాణాలు

- 2017 గణాంకాల ప్రకారం గల్ఫ్ దేశాల్లో 22.53 లక్షల మంది ఇండియన్స్ పనిచేస్తున్నారు. గత నాలుగేళ్లలో ఆరు గల్ఫ్ దేశాల్లో 28,523 మంది ఇండియన్స్ మృతిచెందారు. ఇందులో సౌదీలో 2014 నుంచి 2018 మధ్య 12,828 మంది, యూఏఈలో 7,877 మంది, కువైట్‌లో 2,932, ఒమన్‌లో 2,564, ఖతర్‌లో 1,301, బహ్రెయిన్‌లో 1,021 మంది చనిపోయారు.
- ఒక్క 2018లోనే సౌదీలో 2,277 మంది, యూఏఈలో 1,614, బహ్రెయిన్‌లో 200, కువైట్‌లో 595, ఒమన్‌లో 483, ఖతార్‌లో 261 మంది కార్మికులు మరణించారు.
- గల్ఫ్ దేశాల్లో మన దేశ కార్మికుల సంఖ్య 2015తో పోల్చితే 2017లో చాలా పెరిగింది. కానీ దుర్భర పరిస్థితుల చాలా మంది అవస్థలు పడుతున్నారు.
- 2014 నుంచి 2018 వరకు నాలుగేళ్లలో వివిధ దేశాల నుంచి 16,281 మంది భారతీయులను విదేశీ వ్యవహారాల శాఖ స్వదేశానికి తీసుకొచ్చింది.
- ఉద్యోగాల కోసం వెళ్తున్న భారతీయుల కు విదేశీ వ్యవహారాల శాఖ 'సురక్షిత్ జావో... ప్రశిక్షిత్ జావో' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. దీని నుంచి కార్మికులెవరికీ ప్రయోజనం కలగలేదు.



హైదరాబాద్‌కు గల్ఫ్ బాధితులు

హైదరాబాద్, వెలుగు: ఇరాక్‌లో చిక్కుకొని ఇన్నాళ్లూ నరకయాతన అనుభవించిన 15 మంది కార్మికులు బుధవారం హైదరాబాద్ చేరుకున్నారు. ఇరాక్ నుంచి మంగళవారం ఢిల్లీకి చేరుకున్న వారు.. సంపర్క్ క్రాంతి ట్రెయిన్‌లో హైదరాబాద్ వచ్చారు. వారిని స్వస్థలాలకు పంపేందుకు తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఏర్పాట్లు చేశారు. ఏజెంట్ల చేతిలో మోసపోయిన ఈ కార్మికులను భారత్ తీసుకు వచ్చేందుకు ఎంపీ కవిత కృషి చేశారు.

మూడు రోజుల్లో 4 కోట్ల ఆదాయం

సంక్రాంతికి దక్షిణ మధ్య రైల్వే జోష్

హైదరాబాద్, వెలుగు: సంక్రాంతి పండుగ దక్షిణ మధ్య రైల్వే(ఎస్సీఆర్)కు మస్తు ఆదాయం తెచ్చిపెట్టింది. ఈ నెల 11, 12, 13 తేదీల్లో ఎస్సీఆర్‌కు 3.99 కోట్ల రూపాయల ఆదాయం సమకూరినట్లు సీపీఆర్వో రాకేశ్ బుధవారంవెల్లడించారు.
గత ఏడాదితో పోలిస్తే ఇది 29 శాతం ఎక్కువని చెప్పారు. పండుగ సందర్భంగా ఈ మూడు రోజుల్లో వివిధ ప్రాంతాలకు 60 జన్‌సాధారణ్ రైళ్లు, 203 ప్రత్యేక రైళ్లు నడిపినట్లు వివరించారు. ప్రత్యేక రైళ్లు 80 శాతం, జన్ సాధరణ్ రైళ్లు 90 శాతం సమయపాలన పాటించినట్లు తెలిపారు. జన్‌సాధారణ్ రైళ్లలో 4.49 లక్షల మంది ప్రయాణించినట్లు చెప్పారు. ఇది గతేడాదితో పోలిస్తే 18 శాతం అధికమన్నారు. టికెట్ లేకుండా ప్రయాణించిన వారి సంఖ్య కూడా గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు. ఈ నెలలో టికెట్ చెకింగ్స్‌ద్వారా 20.38 లక్షల రూపాయలు జరిమానాల రూపంలో వసూలైనట్లు వివరించారు.

ఎస్‌జీఎస్టీ ఆర్డినెన్స్‌కు ఆమోదం

రేపటి నుంచి అమల్లోకి

హైదరాబాద్, వెలుగు: 'తెలంగాణ వస్తు సేవల పన్ను చట్టం-2019'కు సవరణలు చేస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఆమోద ముద్ర వేశారు. దీంతో శుక్రవారం నుంచి ఆర్డినెన్స్ అమల్లోకి రానుంది. గతేడాది జీఎస్టీ కౌన్సిల్ జీఎస్టీ చట్టానికి సవరణలు చేసింది. అప్పుడు రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో సవరణలకు శాసనసభ ఆమోదం లభించలేదు. కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణం, స్పీకర్ ఎన్నిక కోసం ఈ నెల 17న ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు 20న ముగిశాయి. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేందుకు శాసనమండలి 19, 20 తేదీల్లో సమావేశమైంది. సభ నడుస్తున్నపుడు ఎస్‌జీఎస్టీ చట్ట సవరణకు అసెంబ్లీ, మండలి ఆమోదం తప్పనిసరి. ఫిబ్రవరి ఒకటి నుంచి సవరించిన చట్టం అమలు చేయాల్సి ఉండటంతో అందుకు అనుగుణంగా 29న అసెంబ్లీ, మండలి సమావేశాలను ప్రోరోగ్ చేస్తూ గవర్నర్ నోటిఫికేషన్ ఇచ్చారు. మరుసటి రోజే ఆర్డినెన్స్‌ను ఆమోదించారు.



చట్ట సవరణలోని ముఖ్యాంశాలు

- చట్టంలోని సెక్షన్ 7 పరిధిని విస్తరించేందుకు సవరణలు ప్రతిపాదించారు.
- కాంపోజిషన్ స్కీం పరిమితిని రూ. కోటి నుంచి రూ.1.50 కోట్లకు పెంచారు.
- సేవలు అందించే సంస్థలు గతేడాది టర్నోవర్‌లో 10 శాతం లేదా రూ.5 లక్షలు, ఈ రెండింటిలో ఏది ఎక్కువైతే ఆ మొత్తం పన్నుగా చెల్లించాలి. రెస్టారెంట్లు మినహా మిగతా అన్ని సేవలందించే సంస్థలకు ఇది వర్తిస్తుంది.
- ఒకే రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో లావాదేవీలు నిర్వహించే సంస్థలు వేర్వేరు రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి వీలు కల్పిస్తారు. సెజ్‌లలోని యూనిట్లు, డెవలపర్లు ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు అనుమతిచ్చారు.
- అప్పీలు దాఖలు చేసేప్పుడు జమ చేయాల్సిన గరిష్ఠ మొత్తం రూ.25 కోట్లకు మించకుండా పరిమితి విధించారు.
- సీజ్ చేసిన వస్తువులను సంబంధిత శాఖ వద్ద గతంలో 7 రోజులు పెట్టుకునే అవకాశం ఉండగా 14 రోజులకు పెంచారు.

పండిట్లకూ ప్రమోషన్లు

హైదరాబాద్, వెలుగు : లాంగ్వేజ్ పండిట్లను త్వరలోనే స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోట్ చేస్తామని శాసన మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి తెలిపారు. సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్‌తో కలిసి బుధవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌తో ఈ విషయమై చర్చించారు. ప్రపంచ తెలుగు మహాసభ సందర్భంగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు పదోన్నతులకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

హైకోర్టు సీజేతో బీసీ కమిషన్ చైర్మన్ భేటీ

హైదరాబాద్, వెలుగు : హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీ.రాధాకృష్ణన్‌తో బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు బుధవారం సమావేశమయ్యారు. రాష్ట్రంలో రిజర్వేషన్ల తీరును వివరించి, బీసీ కమిషన్ ప్రచురించిన 'బీసీ నోట్‌బుక్', ఎస్‌కే మురళీధర్‌రావు, జస్టిస్ చిన్నపరెడ్డిల నివేదికలను అందజేశారు. చైర్మన్ వెంట డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, డాక్టర్ ఆంజనేయగౌడ్ ఉన్నారు.

అది జగన్‌పై హత్యాయత్నమే

ఏపీ హైకోర్టుకు వెల్లడించిన ఎన్ఐఏ

అమరావతి: ఏపీ ప్రతిపక్ష నాయకుడు, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విశాఖ విమానాశ్రయంలో హత్యాయత్నం కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కీలక విషయాల్ని హైకోర్టుకు తెలియజేసింది. వైఎస్ జగన్‌ను లక్ష్యంగా చేసుకునే ఉద్దేశపూర్వకంగా హత్యాయత్నానికి ప్రయత్నించారని విన్నవించింది. కోర్టు ఆదేశాల మేరకు బుధవారం ఎన్ఐఏ తన వాదనలతో కౌంటర్ వ్యాజ్యం దాఖలు చేసింది. దీనిపై తమ వాదనల్ని తెలిపేందుకు సమయం కావాలని ఏపీ ప్రభుత్వం కోరడంతో విచారణను ఫిబ్రవరి 12కు న్యాయమూర్తి జస్టిస్ జి.శ్యాంప్రసాద్ వాయిదా వేశారు. ఈ కేసులో ప్రతివాదిగా ఇంప్లీడ్ అయ్యేందుకు తనను అనుమతించాలని మంగళగిరి వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తరఫు లాయర్ కోరారు. అందుకు ఏపీ ప్రభుత్వ న్యాయవాది అభ్యంతరం చెప్పారు. దీనిపై కూడా తమ కౌంటర్‌లో వివరిస్తామని తెలిపారు.
జగన్‌ను లక్ష్యంగా చేసుకునే విమానాశ్రయంలో హత్యాయత్నం జరిగిందని నిర్ధారణకు వచ్చినట్లు కోర్టుకు ఎన్ఐఏ వివరించింది. కేంద్ర పారిశ్రామిక భద్రత దళం, ఇంటెలిజెన్స్ బ్యూరో, ఎన్ఐఏ, ఏపీ ప్రభుత్వ సమాచారాలన్నింటినీ క్రోడీకరించాకే ఈ నిర్ణయానికి వచ్చినట్టు తెలిపింది. విమానాశ్రయ ఆవరణలో హత్యాయత్నం జరిగినందున ఈ కేసు దర్యాప్తు పరిధి తమదేనని కూడా స్పష్టం చేసింది. విమానాశ్రయంలో ఆయుధాలతో లేదా ప్రాణం తీసే విధమైన వస్తువులతో దాడి చేస్తే ఆ కేసులను ఎన్ఐఏనే విచారించాలని విమానయాన సంస్థ చట్టం స్పష్టం చేస్తోందని తెలిపింది. జగన్‌పై హత్యాయత్నం జరిగినట్లు ఏపీ పోలీసులు కూడా ఐపీసీ 307 సెక్షన్ కింద కేసు పెట్టారంటే తీవ్రత స్పష్టమవుతోందని, ఈ కోణంలో చూసినా దర్యాప్తు పరిధి ఎన్ఐఏకే వస్తుందని వివరించింది. ఎన్ఐఏ చట్టంలోని సెక్షన్ 6(5) ప్రకారం ఈ కేసును దర్యాప్తు చేసే అధికారం తమకుందని స్పష్టం చేసింది. కేసు రికార్డులివ్వాలని ఎన్ఐఏ కేసుల విచారణ ప్రత్యేక కోర్టు ఆదేశించినా ఏపీ ప్రభుత్వం ఇవ్వలేదని తెలిపింది.

అమృతకు మగబిడ్డ

పెళ్లి రోజు నాడే ప్రసవం

నారాయణగూడ , వెలుగు : ప్రణయ్ భార్య అమృత మగబిడ్డకు జన్మనిచ్చింది. కులాంతర వివాహం చేసుకున్నారనే కారణంతో అమృత తండ్రి మారుతీరావు గత ఏడాది మిర్యాలగూడలో ప్రణయ్‌ని హత్య చేయించిన విషయం తెలిసిందే. ప్రణయ్ చనిపోయే నాటికి అమృత ఐదు నెలల గర్భిణి. హైదరాబాద్ హైదర్‌గూడలోని ఫెర్నాండెజ్ ఆస్పత్రిలో బుధవారం అమృత మగ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రణయ్, అమృతల పెళ్లి రోజు కూడా బుధవారమే కావడం విశేషం. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నట్లు డాక్టర్లు చెప్పారు. ప్రణయ్ హత్యకు గురైన నాటి నుంచి అమృత, ఆమె కుటుంబ సభ్యులకు పోలీసులు సెక్యూరిటీ ఇస్తున్నారు. మరోవైపు ఈ కేసులో అమృత తండ్రి మారుతి రావు ప్రస్తుతం జైలులో ఉన్నారు.



మాజీ మంత్రి కేవీ కేశవులు కన్నుమూత

సీఎం కేసీఆర్ సంతాపం

హైదరాబాద్, వెలుగు: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి కేవీ కేశవులు (95) అనారోగ్యంతో బుధవారం సాయంత్రం నిమ్స్ లో తుదిశ్వాస విడిచారు. 1924 జనవరి 14న కరీంనగర్ జిల్లాలోని ధర్మపురిలో జన్మించిన ఆయన, ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గం నుంచి 1972, 1978లో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 1974లో జలగం వెంగళరావు కేబినెట్‌లో మంత్రిగా చేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. స్వస్థలం ధర్మపురిలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆయన పెద్ద కుమారుడు మురళీధర్ తెలిపారు.

నిస్వార్థ సేవ చేశారు: సీఎం

కేవీ కేశవులు మృతికి సీఎం కేసీఆర్ సంతాపం తెలిపారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కేశవులు ప్రజలకు నిస్వార్థంగా సేవ చేశారని, తొలితరం తెలంగాణ ఉద్యమకారుడని కొనియాడారు. బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి సంతాపం తెలిపారు.

తెలుగు వర్సిటీలో డీ-లిట్

వచ్చే విద్యాసంవత్సరం నుంచే అమలు

హైదరాబాద్, వెలుగు: పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ కొత్త కోర్సును తీసుకొస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి డాక్టర్ ఆఫ్ లిటరేచర్ (డీలిట్) కోర్సును ప్రారంభించాలని నిర్ణయించింది. పరిశోధనలకు మరింత పదును పెంచాలన్న ఉద్దేశంతో తెలుగు యూనివర్సిటీ పాలక మండలి ప్రాథమికంగా ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఈ వర్సిటీలో ఈ కోర్సు లేదు. రాష్ట్రంలో ఈ కోర్సు చేసినోళ్లను వేళ్ల మీద లెక్కపెట్టుకోవచ్చు. తెలుగు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎస్వీ సత్యనారాయణ (మద్రాస్‌లో చేశారు), పరుచూరి గోపాలకృష్ణ (బరంపుర), రమణచారి (బరంపుర) తదితరులు ఆ కోర్సు చేశారు. వారికి డిగ్రీలు రావాల్సి ఉంది.

నిబంధనల కోసం కమిటీ

డీలిట్ కోర్సు విధివిధానాల రూపకల్పనకు కమిటీ వేయాలని వర్సిటీ పాలకమండలి నిర్ణయించింది. ఏడాదిలో ఒక్కో సబ్జెక్టులో ఒక్కొక్కరికి మాత్రమే ప్రవేశం కల్పించాలని భావిస్తున్నారు. అది కూడా పీహెచ్‌డీ పూర్తై పదేళ్లు దాటిన వారు, ఆ పదేళ్ల పాటు ఆ సబ్జెక్టులోనే పరిశోధనలు చేస్తున్న వారినే అర్హులుగా నిర్ణయించారు. కోర్సు కాలపరిమితి మూడేళ్లు. కమిటీ రూపొందించిన విధివిధానాలను పాలక మండలికి సమర్పించనున్నారు. ఆ తర్వాతే ప్రవేశాల ప్రకటనను విడుదల చేసే అవకాశముంది.

పరిశోధనలకు మరింత పదును

పరిశోధనలకు మరింత పదును పెంచేందుకే పీహెచ్‌డీ తర్వాత ఈ కొత్త కోర్సును తీసుకురావాలనుకుంటున్నాం. పాలకమండలిలో దీనిపై నిర్ణయం తీసుకున్నాం. ఇప్పటిదాకా డీలిట్ కోర్సు చేయాలనుకుంటే మద్రాస్ లేదా బరంపుర వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆ అవసరం లేకుండా ఆ కోర్సును అందుబాటులోకి తేబోతున్నాం. విధివిధానాల తయారీకి త్వరలోనే కమిటీ వేస్తాం.
- ఎస్వీ సత్యనారాయణ, తెలుగు యూనివర్సిటీ వీసీ

తేలుతూ కరెంటు పుట్టిస్తది

నీటిలో విద్యుదుత్పత్తి చేసే కొత్త పరికరం

రూర్కీ/న్యూయార్క్: సాధారణ జల విద్యుత్ ప్లాంట్ల కోసం పెద్ద పెద్ద డ్యాంలు నిర్మించాలి. మరి కట్టాలంటే ఊరికే అవుద్దా. రూ. కోట్లల్లో డబ్బు ఖర్చు చేయాలి. దీనికితోడు పర్యావరణ అడ్డంకులు. స్థానికుల నిరసనలు. ఇన్ని సమస్యలు ఎందుకనే ఐఐటీ రూర్కీ బృందం కొత్త టెక్నాలజీ రూపొందించే పనిలో పడింది. నీటిపై తేలాడుతూనే విద్యుత్‌ను ఉత్పత్తి చేసే నమూనాను రూపొందించింది. సాధారణ డ్యాముల్లో నీరు పైనుంచి పడి కింద టర్బైన్లను తిప్పుతుంది. కానీ రూర్కీ టెక్నాలజీలో నీటి ప్రవాహ వేగాన్నే శక్తిగా మారుస్తారు. ఢిల్లీకి చెందిన మాక్‌లెక్ టెక్నికల్ ప్రాజెక్ట్ లేబొరేటరీ సాయంతో రూపొందించిన ఈ 'హైడ్రో కైనెటిక్ టెక్నాలజీ' నమూనాను రూర్కీలోని అప్పర్ గంగా కెనాల్‌లో ఏర్పాటు చేశారు. ఈ కాలువలో ఏడాదిపాటు నీరు ప్రవహిస్తుండటంతో ప్రయోగానికి ఎంచుకున్నారు. దీంట్లో లోపాలు, లాభాలు పరిశీలించి ఇంకేమైనా మార్పులుంటే చేయనున్నారు.

- రూపొందించిన ఐఐటీ రూర్కీ బృందం
- గాలిమరల కన్నా 100 రెట్లు ఎక్కువ సామర్థ్యం

భవిష్యత్ టెక్నాలజీ

'కొన్నేళ్లుగా ప్రభుత్వం సోలార్ విద్యుత్‌పై దృష్టి పెడుతోంది. ఎందుకంటే సూర్యకాంతి ఎక్కడైనా ఉంటుంది. 4 నెలల్లో విద్యుత్ ఉత్పత్తికి కావాల్సిన పనంతా పూర్తయిపోద్ది కాబట్టి. కానీ మేఘాలున్నపుడు, రాత్రిళ్లు సూర్యకాంతి ఉండదు. ప్రస్తుతం విద్యుత్ స్టోరేజీ వ్యవస్థ కూడా అంత సమర్థంగా లేదు. కాబట్టి మరో ప్రత్యామ్నాయం అవసరం. పునరుత్పాదక శక్తి రంగంలో హైడ్రో కైనెటిక్ టెక్నాలజీకి మంచి భవిష్యత్ ఉంది' అంటోంది రూర్కీ బృందం. గాలి ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్ కన్నా 100 రెట్లు ఎక్కువగా ప్రవహిస్తున్న నీటితో ఉత్పత్తి చేయొచ్చంటోంది. ప్రస్తుతం రకరకాల టర్బైన్లను తయారు చేస్తున్నారని, కానీ వాటిని ప్రవహిస్తున్న నీటిలో, నదుల్లో ఏర్పాటు చేయడం కష్టమైన పనని చెబుతోంది. అందుకే ఈ కొత్త 'తేలాడే' ప్రయోగానికి సిద్ధమయ్యామంటోంది. ఇందుకోసం సుమారు రెండేళ్లు శ్రమించామంది. సంప్రదాయ హైడ్రోపవర్ స్టేషన్లలో ఉత్పత్తి అయ్యే విద్యుత్ సామర్థ్యానికి, దీనికి పోలిక లేనప్పటికీ పర్యావరణ సమస్యలకు మాత్రం చెక్ పెట్టగలదని చెబుతోంది.

మార్పులు చేస్తే కరెంటే కరెంటు

టర్బైన్లు, గాలి మరల్లో మార్పులు చేస్తే జల, వాయు విద్యుదుత్పత్తిలో భారీ పెరుగుదల ఉంటుందని న్యూయార్క్ వర్సిటీ సైంటిస్టులంటున్నారు. ఇందుకోసం రెక్కల్లో అనేక రకాల మార్పులు చేసి ల్యాబ్‌లో ప్రయత్నించామని, మంచి ఫలితాలొచ్చాయని చెప్పారు. 3డీ ప్రింటింగ్ టెక్నాలజీతో రకరాల ఆకృతులు, సైజుల్లో రెక్కలు రూపొందించి ప్రయోగాలు చేసి మంచి ఫలితాలిచ్చే కచ్చితమైన పరిమాణం, సైజును అల్గారిథం సాయంతో కనుగొన్నామన్నారు.

గురువారం | హైదరాబాద్
31.01.2019
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu

32 లెటర్లు రాశా, ఐదేళ్లు ఎదురుచూశా..

మళ్లీ హజారే దీక్ష



రాలేగావ్‌సిద్ధి (మహారాష్ట్ర): ‘32 రెండు లెటర్లు రాసినా లాభం లేదు.. ఐదేళ్ల పాటు ఎదురుచూసినా ప్రయోజనంలేదు’ ఇది 81 ఏళ్ల గాంధేయవాది, సామాజిక కార్యకర్త అన్నా హజారే ఆవేదన. లోక్‌పాల్, లోకాయుక్తల్ని నియమించడంలో ప్రభుత్వ వైఫల్యాలపై ప్రధాని, రాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్‌లకు 32 రెండుసార్లు

- ప్రభుత్వ తీరుపై ఆగ్రహం
- డిమాండ్లు నేరవేరే దాకా దీక్ష విరమించేది లేదని ప్రకటన

ఉత్తరాలు రాసినా ఎలాంటి ఫలితంలేదన్న లేకపోవడంతోనే మరోసారి దీక్ష చేస్తున్నట్లు ఆయన చెప్పారు. మహారాష్ట్రలోని అహ్మద్ నగర్ జిల్లాలోని సొంతగ్రామం రాలేగావ్‌సిద్ధిలో బుధవారం చేపట్టిన దీక్షకు పెద్ద సంఖ్యలో అభిమానులు హాజరయ్యారు. దీక్షను ప్రారంభించడానికి ముందు సొంతూరులోని పద్మావతి ఆలయంలో హజారే ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత స్టూడెంట్స్, రైతులు, యువత వెంటరాగా భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక యాదవ్‌బాబా గుడి దగ్గర దీక్షలో కూచున్నారు. లోక్‌పాల్, లోకాయుక్తకు సంబంధించి ఇచ్చిన హామీలతోపాటు రైతుల ప్రధాన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు దీక్షను విరమించేది లేదని ఆయన ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ స్పష్టంచేశారు. 2013లో పార్లమెంట్ లోక్‌పాల్ ను ఆమోదించినా ఇంత వరకు లోక్ పాల్, లోకాయుక్తలను నియమించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ పార్టీ దీన్ని సీరియస్‌గా తీసుకోవడంలేదని హజారే అన్నారు. “లోక్‌పాల్‌చట్టం ఆమోదం పొంది ఇప్పటికి ఐదేళ్లు అవుతోంది. అయినా మోడీ ప్రభుత్వం లోక్‌పాల్‌ను నియమించలేదు. మహారాష్ట్ర ప్రభుత్వం గత నాలుగుళ్లుగా లోకాయుక్త చట్టాన్ని ఆమోదించడంలేదు.” అని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు హజారే సోమవారం లేఖ రాశారు.



బుధవారం రాలేగావ్ సిద్ధిలో దీక్షకు సిద్ధమవుతున్న అన్నా హజారే

మరోవైపు, దీక్ష విరమించుకోవాలని రాష్ట్ర మంత్రి గిరీశ్ మహాజన్ హజారేను కోరారు. హజారే డిమాండ్లను ఇప్పటికే ప్రభుత్వం అమలుచేసిందని ఆయన అన్నారు. “హజారే మొదటి డిమాండ్ అయిన స్వామినాథన్ కమిటీ సిఫార్సుల్ని అమలు చేస్తున్నాం. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు రైతులు తమ పంటలకు ఎంఎస్పీ కన్నా ఒకటిన్నర రెట్లు ధరలు పొందుతారు.” అని మహాజన్ మీడియాకు చెప్పారు. మహారాష్ట్ర ప్రభుత్వానికి, అన్నా హజారేకు మంత్రి మహాజన్ గతంలో మధ్యవర్తిగా వ్యవహరించారు.

గత ఏడాది మార్చిలో ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో దీక్ష చేసినప్పుడు ముఖ్యమంత్రి ఫడ్నవీస్ మధ్యవర్తిగా వ్యవహరించిన విషయాన్ని హజారే ఈ సందర్భంగా గుర్తుచేశారు. తన డిమాండ్లను నెరవేరుస్తామని కేంద్ర ప్రభుత్వం లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించానని చెప్పారు. అయినప్పటికీ ఇంతవరకు ఒక్క హామీ కూడా నెరవేరలేదని ఆయన అన్నారు. వీటి సాధన కోసం బుధవారం నుంచి దీక్ష చేస్తున్నట్టు సీఎంకు రాసిన లేఖలో హజారే స్పష్టంచేశారు. హజారే లేఖకు స్పందించిన మహారాష్ట్ర సర్కార్ మంగళవారం రోజునే.. లోకాయుక్త పరిధిలోకి ముఖ్యమంత్రిని తీసుకురావాలని నిర్ణయించింది. ఈ పరిణామాన్ని హజారే స్వాగతించారు.

లోక్‌పాల్ నేపథ్యం ఇదీ

- 1971 నుంచి 2008 దాకా ఏకంగా 8 సార్లు లోక్‌పాల్ బిల్లుల్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినా అది ఆమోదం పొందలేదు.
- లోక్‌పాల్ అన్న పదాన్ని మొదటిసారిగా డాక్టర్ ఎల్.ఎం. సింఘ్వి వాడారు.

జన్ లోక్‌పాల్ బిల్లు ఉద్యమం

- అవినీతిని అంతమొందించే లక్ష్యంగా ఈ బిల్లును సంతోష్ హెగ్డే (సుప్రీంకోర్ట్ మాజీ జడ్జి, కర్నాటక మాజీ లోకాయుక్త), ప్రశాంత్ భూషణ్(సుప్రీంకోర్ట్ లాయర్), అరవింద్ కేజ్రీవాల్ (ఆర్టీఐ కార్యకర్త)డ్రాఫ్ట్ చేశారు
- కిరణ్‌బేడీ, అన్నాహజారే,స్వామి అగ్నివేశ్, శ్రీశ్రీ రవిశంకర్ లాంటి వారు ఈ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు
- లోక్‌పాల్ బిల్లు ఆమోదించాలంటూ అన్నా హజారే 2011,ఏప్రిల్ 9న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర 98 గంటలపాటు నిరాహార దీక్ష చేశారు. దీంతో లోక్‌పాల్ ఉద్యమం దేశప్రజల దృష్టికి ఆకర్షించింది.

లోక్‌పాల్, లోకాయుక్త చట్టం2013

- 2013 డిసెంబర్‌లో లోక్‌పాల్, లోకాయుక్త బిల్లును పార్లమెంట్ ఆమెదించింది
- జనవరి 1, 2014న కేంద్రం ఈమేరకు నోటిఫికేషన్ జారీచేసింది.
- లోక్‌పాల్‌కు చైర్మన్, గరిష్ఠంగా 8 మంది సభ్యులుంటారు. సభ్యుల్లో సగం మంది న్యాయ రంగానికి చెందినవారు, సగం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలు, మహిళలు ఉండాలి.
- లోక్‌పాల్ చైర్‌పర్సన్, సభ్యుల ఎంపికకు సెలక్షన్ కమిటీ ఉంటుంది. సెలక్షన్ కమిటీలో ప్రధాని, లోక్‌సభ స్పీకర్, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి గాని లేదా సీజేఐ సిఫార్సు చేసిన సుప్రీంకోర్ట్ సిట్టింగ్ జడ్జి సభ్యులుగా ఉంటారు.
- సెలక్షన్ కమిటీలోని మొదటి నలుగురు సభ్యుల ఏకాభిప్రాయంతో కూడిన సిఫార్సుమేరకు ఒక న్యాయ నిపుణుడిని రాష్ట్రపతి సభ్యునిగా నియమిస్తారు.
- పబ్లిక్ సర్వెంట్లందరూ లోక్‌పాల్ పరిధిలోకి వస్తారు. ప్రధాని, కేంద్రమంత్రుల నుంచి ఏ, బీ,సీ,డీ కేటగిరీలకు చెందిన కేంద్రప్రభుత్వోద్యోగులందరూ దీని పరిధిలోకి వస్తారు. వీరిపై వచ్చే ఏ అవినీతి ఆరోపణల్ని అయినా లోక్‌పాల్ విచారిస్తుంది.
- కేంద్రం లోక్‌పాల్ బిల్లును మోడల్ బిల్లుగా అన్ని రాష్ట్రాలకు పంపుతుంది.
- సొంత చట్టాల ద్వారా లోకాయుక్తలను రాష్ట్రాలు ఏడాదిలోగా ఏర్పాటు చేయాలి.

సెర్చ్ కమిటీ

బిల్లు ఆమోదం పొందడంతో లోక్‌పాల్ చైర్‌పర్సన్, ఎనిమిది మంది సభ్యుల భర్తీ కోసం జనవరి 17, 2014 న దరఖాస్తుల్ని ఆహ్వానించారు. అదే రోజు సెర్చ్ కమిటీ రూల్స్‌కు సంబంధించిన విధివిధానాలను కూడా నోటిపై చేశారు. అయితే కమిటీ నియామకాలు మాత్రం జరగలేదు. ఈ లోగా లోక్‌సభ ఎన్నికలు రావడం, యూపీఏ2 స్థానంలో ఎన్డీయే కేంద్రంలో 2014లో అధికారంలోకి రావడం జరిగిపోయింది. అయితే కమిటీ నియామకంలో జరుగుతున్న జాప్యంపై కామన్ కాజ్ అనే ఎన్జీవో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

సెప్టెంబర్ 27, 2018లో సెర్చ్ కమిటీని ఏర్పాటుచేశారు. సెర్చ్ కమిటీ చైర్మన్‌గా సుప్రీంకోర్ట్ రిటైర్డ్ జడ్జి జస్టిస్ రంజనా దేశాయ్ నియమితులయ్యారు. అలహాబాద్ హైకోర్ట్ మాజీ జస్టిస్ రామ్‌సింగ్ యాదవ్, మాజీ సొలిసిటర్ జనరల్ రంజిత్‌కుమార్, ఎస్‌బీఐ మాజీ చైర్మన్ అరుంధతి భట్టాచార్య, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ లలిత్ కె పన్వర్, గుజరాత్ మాజీ డీజేపీ ఎస్.ఖండ్వావాలా, ప్రసార భారతి చైర్‌పర్సన్ ఎ.సూర్యప్రకాశ్, ఇస్రో మాజీ చైర్మన్ ఎ.ఎస్.కిరణ్‌కుమార్ కమిటీలో ఇతర సభ్యులుగా నియమితులయ్యారు. వచ్చే నెలాఖరులోగా పానెల్‌ను సిద్ధం చేయాల్సిందిగా సెర్చ్ కమిటీని సుప్రీంకోర్ట్ ఈనెల 17న కోరింది. కమిటీ నియామకానికి సంబంధించిన కేసు విచారణ మార్చి 7న చేపట్టనున్నట్టు సుప్రీంకోర్ట్ ప్రకటించింది.


మహాత్మాగాంధీ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ

బాపూ, నువ్వే స్ఫూర్తి!

71వ వర్ధంతి సందర్భంగా రాజ్‌ఘాట్ వద్ద ప్రముఖుల నివాళులు

న్యూఢిల్లీ: జాతిపిత మహాత్మా గాంధీ 71వ వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రజలు ఆయనను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం పలువురు ప్రముఖులు ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద గాంధీకి నివాళులర్పించారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గుజరాత్‌లోని దండిలో ఏర్పాటు చేసిన ఉప్పు సత్యాగ్రహ మెమోరియల్, మ్యూజియంను ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించి జాతికి అంకితమిచ్చారు. గాంధీతో పాటు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న మరో 80 మంది విగ్రహాలను మెమోరియల్‌లో ఏర్పాటు చేశారు. అంతకు ముందు బుధవారం ఉదయం రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని మోడీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ, పలువురు కేంద్ర మంత్రులు రాజ్‌ఘాట్‌ను సందర్శించి పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీకి ఎంతో ఇష్టమైన ‘రఘుపతి రాఘవ రాజారాం’ పాటను ఆలపించారు. “గాంధీ చూపిన మార్గాన్ని అనుసరించడానికి, ఆయన చెప్పిన విలువలను పాటించడానికి కట్టుబడి ఉన్నాం” అని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు. గాంధీజీతో పాటు దేశం కోసం పోరాడిన వారికి కూడా మోడీ నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలు వదిలిన వారికి సెల్యూట్ చేస్తున్నానని, వారు చేసిన సేవను, త్యాగాన్ని దేశం ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటుంది అని అన్నారు.

మా బాధలు పట్టవా!

మద్య నిషేధం కోరుతూ కర్నాటకలో మహిళల పాదయాత్ర



బెంగళూరు: కర్ణాటకలో మహిళా లోకం మద్యానికి వ్యతిరేకంగా గళమెత్తింది. మద్యాన్ని నిషేధించాలని కోరుతూ రాష్ట్రం నలుమూలల నుంచి మహిళలు పాదయాత్ర చేశారు. సుమారు నాలుగు వేల మంది మహిళలు పాల్గొన్న పాద్రయాత్ర బెంగళూరులో బుధవారం ముగిసింది. రాష్ట్రంలోని వివిధ ప్రదేశాల నుంచి బెంగళూరు వరకు పాదయాత్ర చేశారు. ఈ నెల 19న ప్రారంభమైన పాదయాత్ర సుమారు 400 కి.మీ వరకు సాగింది. భర్తలు రోజు మద్యం తాగి తమను చిత్ర హింసలు పెడుతున్నారని, మద్యం నిషేధించాలని వారంతా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధాన సౌధాకు వెళ్లేందుకు ప్రయత్నించిన మహిళలను పోలీసులు అడ్డుకున్నారు. అక్కడ నుంచి మల్లేశ్వరం గ్రౌండ్స్‌కు చేరుకొని అక్కడ సభను నిర్వహించారు. ‘మద్య నిషేధ ఆందోళన్’ పేరుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మద్య నిషేధాన్ని కోరిన గాంధీ వర్ధంతి రోజునే ఈ పాదయాత్రను ముగించాలని నిర్ణయించుకున్నామని మహిళలు చెప్పారు. ప్రభుత్వం లిక్కర్ ను ఆదాయ వనరుగా చూస్తోందే తప్ప దాని వల్ల కలిగే నష్టాల గురించి పట్టించుకోవటం లేదని పాపమ్మ అనే మహిళ ఆరోపించింది. తమకు కనీసం ఏ రాజకీయ నాయకుడు మద్దతు ఇవ్వక పోవడం దురదృష్టకరమని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. “ మద్యం వల్ల కలిగే అనర్థాల గురించి చదువుకోని వారికి తెలిసినంత.. ఉన్నత చదువులు చదువుకున్న నాయకులకు తెలియకపోవటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది” అని మహిళ కార్యకర్త ఒకరు విమర్శించారు. మద్యం తాగొచ్చిన తన భర్త రోజు హింసిస్తున్నాడని, అందుకే తను చచ్చేంత వరకు లిక్కర్‌బ్యాన్ కోసం పోరాడతానని బాధితురాలు చెప్పింది.

చిల్లర రాజకీయాలొద్దు

రాహుల్‌గాంధీపై మండిపడ్డ గోవా సీఎం పారికర్

పనాజీ: కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీపై గోవా సీఎం పారికర్ మండిపడ్డారు. తనను పరామర్శించేందుకు వచ్చిన రాహుల్‌గాంధీ.. దాన్ని చిల్లర రాజకీయాల కోసం ఉపయోగించుకోవటం బాధ కలిగించిందని చెప్పా రు . తమ మధ్య రాఫెల్‌కు సంబంధించిన చర్చ అసలు జరగలేదని స్పష్టం చేశారు. ఈ మేరకు మనోహర్‌పారికర్ ఒక లేఖను రాశారు. “మీరు నా ఆఫీసుకు రావడంపై మీడియాలో వచ్చిన వార్తలు నాకు బాధ కలిగించాయి. నన్ను కలవడాన్ని చిల్లర రాజకీయాలకు ఉపయోగించుకోవడం బాధించింది. మీరు నాతో గడిపిన ఐదు నిమిషాల్లో రాఫెల్ గురించి చర్చ జరగలేదు. దానికి సంబంధించి ఏ విషయం మాట్లాడుకోలేదు. ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతున్న ఒక వ్యక్తి విషయంలో ఇలా వ్యవహరించడం బాధ కలిగించింది” అని పారికర్‌లేఖలో రాశారు. రాఫెల్ ఒప్పందంపై తాను గతంలో చెప్పిన విషయాలకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. దేశ భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ యుద్ధ విమానాలను కొన్నామని ఆయన అన్నారు. తీవ్ర వ్యాధితో బాధపడుతున్న పారికర్‌ను రాహుల్ గాంధీ మంగళవారం కలిసి పరామర్శించారు. ఆ తర్వాత కొచ్చిలో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న రాహుల్‌గాంధీ రాఫెల్ అంశంపై పారికర్‌తో మాట్లాడానని.. కొత్త ఒప్పందంలో తన ప్రమేయం లేదని, మోడీనే అంతా చూసుకున్నారని పారికర్ చెప్పినట్లు ఆరోపించారు.

రాహుల్‌అబద్ధాల కోరు

రా హుల్‌గాంధీపై పారికర్ ఓఎస్‌డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్‌డ్యూటీ) ప్రసన్న కార్తిక్‌మండిపడ్డారు. ఆయన అబద్ధాలు ఆడుతున్నారని చెప్పారు. సీఎం త్వరగా కోలు కోవాలని తను, తన తల్లి ఆశిస్తున్నామని చెప్పారని, మర్యాద పూర్వకంగా ఆయన్ను కలవాలని అను కుంటున్నానని చెప్పటంతోనే కలిసేందుకు ఒప్పుకున్నామని కార్తిక్‌చెప్పారు. రాఫెల్‌విషయంపై రాహుల్‌చెప్తున్నది అబద్ధమని ఆయన స్పష్టం చేశారు. ప్రజల కోసం అంకిత భావంతో పనిచేస్తున్న వ్యక్తిపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని ట్వీట్ చేశారు.

అనారోగ్యంతోనే అసెంబ్లీలో బడ్జెట్



గోవా సీఎం మనోహర్ పారికర్ బుధవారం రాష్ట్ర అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. కొద్ది రోజులుగా అనారో గ్యంతో బాధపడుతున్న ఆయన కుర్చీలో కూర్చొని, ముక్కులో ట్యూబ్‌తోనే బడ్జెట్ ప్రవేశపెట్టారు. దీంతో ఆ సమయంలో ఆయన గొంతు చాలా బలహీనంగా వినిపించింది. పారికర్‌బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో ఆయన అసిస్టెంట్లు ఆయనకు తోడుగా నిలబడ్డారు. “నేను ఈ రోజు ఫుల్‌జోష్‌తో బడ్జెట్ ప్రవేశపెడుతున్నాను” అని పారికర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన వ్యాఖ్యలకు సమాధానంగా ఆయన ఈ మాటలు అన్నారు. తన చివరి శ్వాస వరకు గోవాకు సేవలు అందిస్తానని స్పష్టం చేశారు. అ నారోగ్యంతో ఉన్న ఆయన్ను సీఎంగా కొనసాగించడంపై కాంగ్రెస్‌తీవ్ర విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే.


షికాగోలో గడ్డకట్టే పరిస్థితిలో నది


ఇంగ్లండ్‌లోని మాంచెస్టర్ ఎయిర్‌పోర్టులో మంచుమయంగా మారిన విమానం

గడ్డకట్టిన అమెరికా

పలుచోట్ల ఏకంగా మైనస్ 50 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు

మాడిసన్ (విస్కాన్సిన్)/న్యూఢిల్లీ: అమెరికా మధ్య పశ్చి మ ప్రాంతాలు గజగజమంటున్నాయి. తీవ్ర చలి గుప్పిట్లో చిక్కుకున్నాయి. ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయిలో పడిపోయాయి. పోలార్ వర్టెక్స్ (ధ్రువ వాయుగుండం) కారణంగా ఆర్కిటిక్ నుంచి వీస్తున్న చలిగాలుల వల్ల ఏకంగా మైనస్ 50 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. స్కూళ్లు మూతబడ్డాయి. వందలాది విమాన సర్వీసులు, పదుల సంఖ్యలో రైళ్లు రద్దయ్యాయి. నిర్విరామంగా కురుస్తున్న మంచులో రోడ్లు కనిపించకుండాపోయాయి. చలి దెబ్బకు విస్కాన్సిన్, ఇల్లినాయిస్, మిచిగన్ తదితర రాష్ట్రాల్లో ఏకంగా స్టేట్ ఎమర్జెన్సీ ప్రకటించారు.

- విస్కాన్సిన్, ఇల్లినాయిస్, మిచిగన్ రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ
- వందలాది విమాన సర్వీసులు బంద్
- స్కూళ్లు మూసివేత, ఇళ్లలోనే ప్రజలు

మైనస్ డిగ్రీల్లోనే జనజీవనం

అమెరికా మధ్య పశ్చిమ ప్రాంతాలు, న్యూజిలాండ్‌లో దాదాపు 9 కోట్ల మంది ప్రజలు సున్నా కంటే తక్కువ డిగ్రీల మధ్య జీవనం సాగిస్తున్నారని నేషనల్ వెదర్ సర్వీస్ (ఎన్‌డబ్ల్యూఎస్) తెలిపింది. ఇందులో 2.5 కోట్ల మంది మైనస్ 20 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతల మధ్య బతుకుతున్నారని చెప్పింది. ఆర్కిటిక్ నుంచి వీస్తున్న చలిగాలులు, హిమపాతం వల్ల నిమిషాల వ్యవధిలోనే ఉష్ణోగ్రతలు మరింత దిగజారిపోయే ప్రమాదం ఉందని వెల్లడించింది. పోస్టల్ సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ఇల్లినాయిస్, లోవా, మిన్నెసోటా, నార్త్ డకోటా, సౌత్ డకోటా, విస్కాన్సిన్ రాష్ట్రాల్లో సర్వీసులు పూర్తిగా నిలిచిపోయాయి. కన్సాస్, మిస్సోరి, మొంటానా, నెబ్రాస్కా రాష్ట్రాల్లో పాక్షికంగా ఆగిపోయాయి. గతంలో ఎన్నడూ లేనట్లుగా ఉత్తర మిన్నెసోటా, డకోటాస్‌లో మైనస్ 50 డిగ్రీలు నమోదవుతున్నాయి. మిన్నెపోలిస్, మిల్‌వాకీ, డెట్రాయిట్ తదితర ప్రాంతాల్లోనూ ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. ఇక ఇల్లినాయిస్‌లో మైనస్ 30 నుంచి మైనస్ 40 డిగ్రీలు, ఉత్తర్ గ్రేట్ లేక్స్ రీజియన్‌లో ఏకంగా మైనస్ 65 డిగ్రీలు నమోదవుతున్నాయి. షికాగోలో మైనస్ 27 డిగ్రీలు రికార్డయ్యాయి. 1985 జనవరి 20వ తేదీన నమోదైన మైనస్ 27 డిగ్రీల రికార్డు బద్దలైంది. పరిస్థితి ఇలానే ఉంటే అక్కడ 29 డిగ్రీల వరకు చలి నమోదయ్యే అవకాశం ఉంది.

మిన్నెసోటాలో మైనస్ 70?

- అమెరికా ఎయిర్‌పోర్టులకు రాకపోకలు సాగించే 2,700 విమాన సర్వీసులను మంగళ, బుధవారాల్లో రద్దు చేశారు. ఇందులో షికాగో మీదుగా వెళ్లే విమానాలు 1,550 పైనే ఉన్నాయి.
- వచ్చే ఐదు రోజుల్లో అమెరికా జనాభాలో 21 కోట్ల మంది (మొత్తం జనాభాలో 72 శాతం) నీరు గడ్డకట్టే చలి పరిస్థితులను ఎదుర్కోనున్నారు. దాదాపు 8.3 కోట్ల మంది మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలను ఎదుర్కోనున్నారు.
- మిన్నెసోటాలో వీస్తున్న చలిగాలులు మైనస్ 70 డిగ్రీలకు చేరుకునే ప్రమాదం ఉంది. పోన్స్ పోర్ట్ లో మైనస్ 66 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉంది.
- సెంట్రల్ లోవాలో పరిస్థితి తీవ్రంగా ఉంది. డెస్ మోయిన్స్ లో వీస్తున్న చలిగాలులు రాత్రిళ్లు మైనస్ 45 డిగ్రీలకు, వాటర్‌లూలో మైనస్ 57 డిగ్రీలకు, మాన్సన్ సిటీలో 60 డిగ్రీలకు పడిపోయే ప్రమాదం ఉంది. రాత్రిళ్లు ఇంటి నుంచి బయటకి రాకుడదని ఎన్‌డబ్ల్యూఎస్ ట్వీట్ చేసింది.
- నార్త్ డకోటాలో ఎవరూ రోడ్లపై తిరగొద్దని హెచ్చరికలు జారీ చేశారు. హిమపాతం వల్ల ఎదురుగా ఏమీ కనిపించడం లేదని, ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువని హెచ్చరిస్తున్నారు.
- మిషిగన్‌లో అన్ని ప్రభుత్వ ఆఫీసులు బుధవారం మూసేశారు. చలిగాలుల ఉష్ణోగ్రతలు మైనస్ 20 నుంచి మైనస్ 40 వరకు నమోదవుతున్నాయి. మిచిగన్ గవర్నర్ గ్రెట్చెన్ వైట్‌మెర్.. స్టేట్ ఎమర్జెన్సీ ప్రకటించారు.
- తీవ్ర చలి మూలంగా ముగ్గురు మరణించారు.
- హిమపాతానికి బ్రిటన్‌లో జనజీవనం స్తంభించిపోయింది. స్నో ఫాల్ నిరంతరాయంగా కొనసాగుతోంది. మాంచెస్టర్ ఎయిర్‌పోర్టు మూతబడింది. లివర్‌పూల్ ఎయిర్‌పోర్టులో కూడా విమానాలు తాత్కాలికంగా నిలిపివేశారు.

ఉత్తరభారతంపై అట్లాంటిక్ దెబ్బ

పోలార్ వర్టెక్స్ (ధ్రువ వాయుగుండం) కారణంగా అట్లాంటిక్‌లో నెలకొన్న పరిస్థితులు ఉత్తర భారతంపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఆర్కిటిక్ నుంచి వీస్తున్న చలిగాలుల వల్ల నార్త్ ఇండియాలో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గిపోయాయి. మైనస్ డిగ్రీలను దాటి నమోదవుతున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లోనూ మంచు తీవ్రత కొనసాగుతోంది. నార్త్ లో ప్రస్తుత పరిస్థితికి, అమెరికా మధ్య పశ్చిమ ప్రాంతాల్లో మైనస్ 50 డిగ్రీలు నమోదవుతుండటానికి పోలార్ వర్టిక్సే కారణమని కేంద్ర వాతావరణ శాఖ తెలిపింది.

బయటికెళ్లొద్దు

అమెరికా మిడ్ ఈస్టులోని చాలా ప్రాంతాల్లో మైనస్ 50 డిగ్రీలకు పైనే నమోదవుతోంది. అలాంటి వాతావారణంలో ఐదు నిమిషాలు బయట ఉన్నా ప్రాణానికి ప్రమాదమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన చలికి శరీరం వేడిని కోల్పోతుందని అమెరికా నేషనల్ వెదర్ సర్వీస్ చెప్పింది. చలిగాలులు ఎంత తీవ్రంగా వీస్తే అంత వేగంగా శరీరం వేడి కోల్పోతుందని చెబుతోంది. తద్వారా చర్మం ఉష్ణోగ్రత, శరీర అంతర్గత ఉష్ణోగ్రత తగ్గిపోతుందని అంటోంది. చర్మం, దాని లోపల ఉండే కణజాలాలు ఫ్రీజ్ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తోంది.

నేడు వెలుగు క్రికెట్ సెలక్షన్స్



వెలుగు నెట్‌వర్క్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల క్రికెట్ ప్లేయర్‌లను వెలికితీసి వారు పైస్థాయికి ఎదిగేలా ప్రోత్సహించేందుకు 'వెలుగు' దినపత్రిక, వీ6 ఛానల్ సంయుక్తంగా రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తోంది. ఈ మేరకు జిల్లాల వారీగా క్రికెట్ టీం సెలక్షన్‌లు జరుగుతున్నాయి. 28 ఏళ్లలోపు వయసున్న క్రీడాకారులు ఈ సెలక్షన్‌కు అర్హులు. అర్హత, ఆసక్తిగల క్రీడాకారులు సెలక్షన్ జరిగే చోటుకు తమ ఆధార్ కార్డు జిరాక్స్‌ను వెంట తీసుకురావాల్సి ఉంటుంది. జిల్లా స్థాయిలో టీ20 ఫార్మాట్‌లో మ్యాచ్‌లు జరుగుతాయి. ఫిబ్రవరి 23 నుంచి 27 వరకు రాష్ట్రస్థాయిలో క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్ ఉంటాయి. జిల్లా వ్యాప్తంగా జరిగే పోటీలో విన్నర్ టీంకు రూ.50 వేలు, రన్నరప్ టీంకు రూ.25 వేల ప్రైజ్ మనీ ఉంటుంది. రాష్ట్రస్థాయిలో విన్నర్ టీంకు రూ.లక్ష, రన్నరప్ టీంకు రూ.50 వేలు ప్రైజ్ మనీ ఉంటుంది. ఔత్సాహిక క్రికెట్ ప్లేయర్‌లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వహకులు కోరారు.

నేడు సెలక్షన్స్ జరిగే ప్రాంతాలు

- మెదక్ జిల్లాకు సంబంధించి మెదక్, నర్సాపూర్ సెగ్మెంట్ టీం సెలక్షన్స్ 31వ తేదీ గురువారం జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ స్టేడియంలో జరుగుతాయి. సెలక్షన్స్‌కు హాజరయ్యే ప్లేయర్‌లు ఉదయం 10 గంటల లోపు గ్రౌండ్‌లో అందుబాటులో ఉండాలి. మెదక్ జిల్లాకు సంబంధించిన సెలక్షన్స్ సమాచారం కోసం ఫోన్.నెం.8374519180లో సంప్రదించాలి.
- యాదాద్రి జిల్లాలో నేడు భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆలేరు భువనగిరి మునగోడు నియోజక వర్గాల టీంలకు క్రీడాకారుల ఎంపిక ఉంటుంది. వివరాలకు నాయిని శ్రీనివాస్ 9490999316, పసుపులేటి కిరణ్ 9010448054, ఖమ్మంపాటి శేఖర్ 8790999426 సంప్రదించగలరు.
- మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎండీసీఏ గ్రౌండ్స్‌లో నేడు వెలుగు క్రికెట్ టోర్నమెంట్‌కు క్రీడాకారుల సెలక్షన్స్ జరుగుతున్నాయి. మహబూబ్‌నగర్, షాద్‌నగర్, దేవరకద్ర, జడ్చర్ల టీమ్‌లకు ఈ రోజు ఉదయం 10 గంటల నుంచి సెలక్షన్స్ ఉంటాయి. వివరాలకు రాజశేఖర్ 94400 57849, వెంకటేశ్వర్‌రావు 90599 93671 నెంబర్లను సంప్రదించండి.

ఆ ఊళ్లకు వెళ్లలేం

ఆ గ్రామాలు కలప అక్రమ రవాణా కేంద్రాలు. అటవీ సిబ్బంది పొరపాటున డ్యూటీలో భాగంగా అటువైపు వెళ్లారంటే ఇక అంతే సంగతులు. గ్రామస్తులంతా ఏకమై దాడులకు పాల్పడతారు. పోలీసుల సాయం లేకుండా వెళ్తే అటవీ సిబ్బంది పరిస్థితి దయనీయంగా ఉంటుంది. ప్రస్తుతం కలప అక్రమ రవాణాపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపి అడవులను సంరక్షించాలనే ఆదేశాల నేపథ్యంలో ఆర్మ్‌డ్ ఫోర్స్‌తో వారిపై దాడులకు దిగాలని అటవీ శాఖ భావిస్తోంది.

భద్రాద్రికొత్తగూడెం, వెలుగు: రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో అడవులు రోజురోజుకు మాయమవుతున్నాయి. జిల్లాలో గత ఐదేళ్ల కాలంలో 30 వేల హెక్టార్ల మేర అడవులు మాయమైనట్టు సమాచారం. జిల్లాలో 4.16 లక్షల హెక్టార్లలో అడవులున్నాయి. అడవుల రక్షణపై సీఎం చూపిస్తున్న చొరవతో అటవీ అధికారులు, సిబ్బంది ముందుకు కదులుతున్నారు. టేకు చెట్లకు ప్రఖ్యాతి గాంచిన ఈ జిల్లాలో ఇప్పుడు టేకుచెట్లు కేవలం ప్లాంటేషన్లకే పరిమితమయ్యాయి. జిట్రేగి జాడ లేకుండా పోయింది. ప్రస్తుతం అక్కడక్కడ నార వేప కనిపిస్తోంది. ఆఫీసర్ల నిర్లక్ష్యం, కొందరు సిబ్బంది కలప స్మగ్లర్లతో కుమ్మక్కవడంతో ఆ కొద్ది నారవేప చెట్లు మరికొన్ని రోజుల్లో కనుమరుగయ్యే పరిస్థితి. దీంతో అడవుల రక్షణ విషయంలో అటవీ శాఖ కొత్త ప్రణాళికలను రూపొందిస్తోంది. కొన్నిచోట్ల అటవీ సిబ్బంది కలప స్మగ్లర్లతో కుమ్మక్కయ్యారనే ప్రచారం ఉన్న క్రమంలో సిబ్బందికి కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నారు. అవసరమైతే ఒకరిద్దరిపై వేటు వేసేందుకు రెడీ అవుతున్నారు.

గోదావరి పరివాహక ప్రాంతంపై దృష్టి

రాష్ట్రంలోని గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఎక్కువగా కలప స్మగ్లింగ్ జరుగుతున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, నిర్మల్, మందమర్రి, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల తదితర జిల్లాలతో పాటు జగిత్యాల జిల్లాల్లో కలప స్మగ్లింగ్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జగిత్యాలలో వందకు పైగా సామిల్లులు ఉండడంతో ఈ జిల్లాను కలప స్మగ్లర్ల ప్రాంతంగా అధికారులు భావిస్తున్నారు. జిల్లాలోని పాండురంగాపురం, బొంబాయితండా, బంగారు చెలక వంటి దాదాపు 25 గ్రామాలు కలప స్మగ్లింగ్ కేంద్రాలుగా ఉన్నట్టు అటవీశాఖాధికారులు గుర్తించారు. ఈ ఊళ్లలో దాడులు చేయాలంటూ పెద్దఎత్తున అటవీ సిబ్బందితో పాటు తప్పనిసరిగా పోలీసుల సాయం అవసరం. పోలీసులు లేకుండా కేవలం అటవీశాఖ ఆఫీసర్లు, సిబ్బంది భారీ సంఖ్యలో వెళ్లినా గ్రామస్తులంతా అడ్డుకుంటున్నారు. ఆ ఊళ్లలోకి వెళ్లాలంటే కనీసం వంద మంది సిబ్బంది ఉండాల్సిందే. కలప స్మగ్లింగ్‌పై సీఎం ఉక్కు పాదం మోపుతున్న క్రమంలో ఆయా ఊళ్లలో ఆర్మ్‌డ్ ఫోర్స్, పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడులు చేసేందుకు ఆఫీసర్లు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ప్రభుత్వం నుంచి సరైన ఆదేశాలు వచ్చిన మరుక్షణం ఎప్పుడైనా దాడులు చేసేలా వ్యూహాలు పన్నుతున్నారు. కొందరు సిబ్బంది కలప స్మగ్లర్లతో కుమ్మక్కవుతున్నారనే ప్రచారంతో దాడులు చేసే ప్రాంతం చెప్పకుండా తమను ఫాలో కావాలనే ఆదేశాలతో ఆఫీసర్లు ముందుకు కదలనున్నారు. ఇదే క్రమంలో సామిల్లులపై ఎప్పటికప్పుడు దాడులు చేసేలా ప్లాన్ చేస్తున్నారు. కలప అక్రమ రవాణాలో ఆరితేరిన వారిని గుర్తించి వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయనున్నారు. అక్రమ కలపతో పాటు అడవుల ఆక్రమణలపై ఆఫీసర్లు దృష్టి సారించనున్నారు. పోడు వ్యవసాయంతో ఇప్పటికే భారీగా అడవుల ఆక్రమణ జరిగిన క్రమంలో ఉన్నవాటిని రక్షించుకోవడంతో పాటు హరితహారంలో భాగంగా అడవుల్లో నాటుతున్న మొక్కల రక్షణకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించే పనిలో ఆఫీసర్లు పడ్డారు.



- అన్నీ కలప స్మగ్లింగ్‌కు అడ్డాలే
- సీఎం ఆదేశాలతో అటవీ శాఖ అలర్ట్
- ఆర్మ్‌డ్ ఫోర్స్‌తో దాడులకు రంగం సిద్ధం

అక్రమ రవాణాపై ఉక్కుపాదం

"ప్రభుత్వ ఆదేశాలతో కలప అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతాం. ఏఏ ప్రాంతాల్లో కలప స్మగ్లింగ్ అవుతోంది, ఏ రూట్లలో రవాణా చేస్తున్నారనే వివరాలు సేకరిస్తున్నాం. ఆర్మ్‌డ్ ఫోర్స్, పోలీసుల సాయంతో ముమ్మరంగా దాడులు చేస్తాం. కలప అక్రమ రవాణాను అడ్డుకోవడంతో పాటు అడవులను ఆక్రమించుకునే వారిపై అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తాం.

- రాంబాబు, డీఎఫ్‌వో



'కూర' సోదరుల తల్లి మృతి

వేములవాడ, వెలుగు: జనశక్తి పార్టీ అగ్రనేతలు కూరరాజన్న, కూర దేవేందర్ ల తల్లి మల్లవ్వ (90) బుధవారం అనారోగ్యంతో వేములవాడలో చనిపోయారు. మల్లవ్వ కొడుకులు కూర రాజన్న జనశక్తి కేంద్ర కమిటి కార్యదర్శిగా, కూర దేవేందర్ అలియాస్ అమర్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. మల్లవ్వ మరణించిన విషయం తెలియగానే దేవేందర్ భార్య, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క వేములవాడకు చేరుకున్నారు. అత్త శవం మీద పడి ఆమె బోరుమన్నారు. రాజన్న ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. దేవేందర్ చంచల్‌గూడ జైల్లో ఉన్నారు. గురువారం జరిగే అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఆయన జైలు అధికారుల అనుమతితో వేములవాడకు వచ్చారు.

జనం కోసం బతుకుమన్నది... కూర దేవేందర్

తన కొడుకులు ప్రజల కోసం జీవించాలని తల్లి మల్లవ్వ కోరుకుందని కూర దేవేందర్ అన్నారు. తన తల్లి మృతి చెందిన వార్త తెలియగానే ఆయన వేములవాడకు చేరుకున్నారు. తమ కోసం ఆమె కష్టాలు పడ్డదని, అరెస్టు కూడా అయ్యిందని, అయినా ఎప్పుడూ ప్రజల కోసమే అలోచించిందన్నారు. అమ్మ కోసం ఇప్పటికి 15 పాటలు రాసానని, ఆమె చెరిగిపోని జ్ఞాపకమని అన్నారు.

టీచర్ కొట్టిందని..

భద్రాద్రికొత్తగూడెం : కొత్తగూడెం పట్టణం పోస్టాఫీస్ ప్రాంతంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో యూకేజీ చిన్నారి ఉమర్ ఫారూఖ్‌ను ఓ టీచర్ చితకబాదారు. శరీరంపై వాతలు రావడంతో ఆగ్రహంతో చిన్నారి ఉమర్ తల్లిదండ్రులు ఆ టీచర్‌పై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



పోతంగల్‌లో ఓటేసిన ఎంపీ కవిత

నిజామాబాద్, వెలుగు: నిజామాబాద్ ఎంపీ కవిత పంచాయతీ ఎన్నికల్లో ఓటేశారు. నిజామాబాద్ జిల్లాలోని తన అత్తారి ఊరు రెంజల్ మండలం పోతంగల్ గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొదటి రెండు విడతల్లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో గెలిచినట్లుగానే ఈసారి కూడా గెలుస్తారని ఆమె అన్నారు.

ఏసీబీ వలలో ఆర్టీఏ ఎంవీఐ

సంగారెడ్డి, వెలుగు: ట్రాక్టర్ అనుమతి కోసం రూ.5 వేలు లంచం తీసుకుంటూ ఆర్టీఏ ఎంవీఐ, మరో ఇద్దరు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ రవికుమార్ వివరాల ప్రకారం.. ట్రాక్టర్ తయారీదారుడు ప్రదీప్ నుంచి టెంపరరీ నెంబర్ రెన్యువల్ కోసం ఎంవీఐ అనిల్ చౌహాన్ రూ.5 వేలు లంచం అడిగాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేక ప్రదీప్ ఏసీబీ అధికారులను సంప్రదించాడు. వారి సూచన మేరకు ఎంవీఐ అనిల్ చౌహాన్‌ను సంప్రదించగా డబ్బును హోంగార్డు సాయిరాంకు ఇవ్వమని పురమాయించాడు. సాయిరాం డబ్బు తీసుకోవడానికి నిరాకరించి ఏజెంట్ సాయికుమార్‌కు ఇప్పించాడు. తిరిగి ఆ సొమ్ము హోంగార్డు నుంచి ఎంవీఐ అనిల్‌చౌహాన్‌కు చేరగానే ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు.


మిక్సర్‌ను తగులబెట్టిన నక్సల్స్


మన్యంలో పోలీసుల తనిఖీలు

రాకపోకలు 'బంద్'!

భద్రాచలం, వెలుగు : మావోయిస్టుల భారత్‌బంద్ కారణంగా భద్రాచలం ఏజెన్సీలో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. వాహనాలకు నిప్పు పెట్టడం, రాళ్లు రువ్వడం, బాణాలతో దాడులు చేస్తుండడంతో భద్రాచలం నుంచి వెంకటాపురం, వాజేడు(భూపాల్‌పల్లి జిల్లా), కూనవరం, నెల్లిపాక, చింతూరు, వరరామచంద్రాపురం(ఆంధ్రాలోని ముంపు మండలాలు), విశాఖ, సీలేరు, జగదల్‌పూర్, జైపూర్, మల్కన్‌గిరి(ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలు)కి వాహనాలు నిలిచిపోయాయి. నిత్యం వేల సంఖ్యలో లారీలు విజయవాడజగదల్‌పూర్ నేషనల్ హైవేలో భద్రాచలం మీదుగా వెళ్తుంటాయి. సమాధాన్‌కు వ్యతిరేకంగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా మావోయిస్టులు నేడు భారత్ బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో పోలీసుల ఆంక్షలతో తెలంగాణ, ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలు తమ బస్సు సర్వీసులను రద్దు చేశాయి. దండకారణ్యం, ఏవోబీలకు వెళ్లే మార్గాల్లో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. మంగళవారం రాత్రి చింతూరు మండలం సరివెల వద్ద తెలంగాణ ఆర్టీసీ బస్సు, లారీని దహనం చేయడంతో పాటు ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రయాణిస్తున్న వాహనంపై విల్లంబులతో మావోయిస్టులు దాడికి తెగపడ్డారు. గతంలో భూపాల్‌పల్లి జిల్లా వెంకటాపురానికి వెళ్లే టాటా ఏస్ వాహన యజమానులను కూడా మావోయిస్టులు హెచ్చరించారు. దీంతో ప్రైవేట్ వాహనాలు కూడా ఈ ప్రాంతంలో తిరిగేందుకు జంకుతున్నాయి. ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. భద్రాచలంలో ఆర్టీసీ తన సర్వీసులను క్రమబద్ధీకరించింది. ముంపు మండలాలతో పాటు, వాజేడు, వెంకటాపురం, పేరూరుకు రాత్రి పూట బస్సు సర్వీసులను రద్దు చేస్తున్నట్లుగా ముందుగానే ప్రకటించింది. కాగా మావోయిస్టుల హింసాత్మక చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. దండకారణ్యంలోని సుక్మా జిల్లా ఫుల్పగ్‌డీ పోలీస్ స్టేషన్ పరిధిలోని నీలావారం గ్రామం వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను నిలిపివేయాలని హెచ్చరిస్తూ వాల్‌పోస్టర్లు చెట్లకు అంటించారు. అంతేకాకుండా కాంట్రాక్టర్లను హెచ్చరిస్తూ రోడ్డు నిర్మాణానికి వినియోగించే మిక్సర్‌ను తగులబెట్టారు.

పోలీసుల తనిఖీలు

భారత్ బంద్ నేపథ్యంలో భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఎస్పీ సునీల్‌దత్ ఆదేశాల మేరకు పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ప్రధానంగా గోదావరి పరివాహక ప్రాంతాన్ని ఆనుకుని, దండకారణ్యం సమీపంలో ఉన్న భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో రహదారులను దిగ్బంధించారు. గ్రేహౌండ్స్, స్పెషల్‌పార్టీ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు ముమ్మరంగా కూంబింగ్‌ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. మావోయిస్టుల ప్రతిఘటనను ఎదుర్కొనేందుకు సన్నద్ధం అయ్యారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో వలయాకారంలో బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. మెరుపు తనిఖీలు, మండల కేంద్రాలు, పట్టణాల్లోని లాడ్జీలు సోదాలు చేస్తున్నారు. ఇప్పటికే ప్రజాప్రతినిధులను పట్టణ ప్రాంతాలకు పంపించేశారు. అధికార పార్టీ నేతలకు రక్షణ కల్పిస్తున్నారు. తమ అనుమతి లేకుండా గ్రామాలకు వెళ్లొద్దంటూ ప్రజాప్రతినిధులకు పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. మావోయిస్టు యాక్షన్ టీంల కదలికలపై నిఘా పెట్టారు. లొంగిన, మాజీ దళ సభ్యులతో అనుమానితులను గుర్తిస్తున్నారు. క్షణక్షణం భయంభయంగా మన్యం వణికిపోతోంది.

చర్ల నుంచి బస్సులు బంద్

ఏటూరునాగారం, వెలుగు: మావోయిస్టులు జనవరి 31న భారత్ బంద్‌కు పిలుపునివ్వదంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆర్టీసీ ఆఫీసర్లు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. రెండు రోజుల నుంచి రాత్రి సమయాల్లో చర్ల నుంచి వెంకటాపురం, వాజేడు వచ్చే బస్సు సర్వీసులను నిలిపివేశారు. బుధవారం నుంచి పగలు కూడా బస్సు సర్వీసులను నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బంద్‌ను విజయవంతం చేయాలంటూ ఈ నెల 24 రాత్రి వెంకటాపురం (నూగూరు) మండలం సూరవీడు సమీపంలో మావోయిస్టులు పొక్లెయిన్ దహనం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వెంకటాపురం సర్కిల్‌లో పోలీసులు రోడ్లపై వాహనాల తనిఖీలు చేపట్టారు. బంద్ నేపథ్యంలో వెంకటాపురం ఏజెన్సీలో ఉద్రిక్తత నెలకొంది.

పంచాయతీ ముగిసింది

పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. బుధవారం వెల్లడైన మూడో విడత ఫలితాలు పలుచోట్ల ఆసక్తిని కలిగించాయి. కొన్నిచోట్ల ఒక్క ఓటుతో గెలుపొందగా మరోచోట టాస్ వేసి విజేతను ఎంపిక చేశారు.



భారీ ఆధిక్యం

గద్వాల, వెలుగు : గద్వాల జిల్లాలో మూడో విడతలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పుల్లూరు గ్రామ సర్పంచ్ భారీ ఆధిక్యతను సొంతం చేసుకున్నారు. మానవపాడు మండలంలోని పుల్లూరు గ్రామ పంచాయతీలో 1,854 ఓట్లు పోలవగా, నారాయణమ్మకు 1,754 ఓట్లు వచ్చాయి. ప్రత్యర్థికి 104 ఓట్లు మాత్రమే రావడంతో 1650 ఓట్ల భారీ మెజార్టీతో ఆమె గెలుపొందారు. గ్రామ పంచాయతీలో ఉన్న ఆరు వార్డుల్లో ఏ అభ్యర్థికీ డిపాజిట్ కూడా దక్కలేదు.



టాస్ వేసి సర్పంచ్‌ఎంపిక

మెదక్, వెలుగు: బరిలో ఉన్న ఇద్దరు అభ్యర్థులకు సమానంగా ఓట్లు రావడంతో టాస్ వేసి సర్పంచ్‌ను ఎన్నుకున్నారు. ఈ సంఘటన బుధవారం మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కోనాయిపల్లిలో చోటుచేసుకుంది. కొత్తగా ఏర్పడిన కోనాయిపల్లి పంచాయతీకి నలుగురు పోటీ చేశారు. బుధవారం జరిగిన పోలింగ్‌లో టీఆర్ఎస్ బలపరచిన విఠల్‌కు, ఇండిపెండెట్‌గా పోటీ చేసిన కంకనాల పాండుకు 143 చొప్పున ఓట్లు వచ్చాయి. దీంతో అధికారులు విజేతను ఖరారు చేసేందుకు చిత్తుబొత్తు వేయగా పాండును విజయం వరించింది.

రెండు ఓట్లతో ఓడాడు.. టవరెక్కాడు

సిద్దిపేట, వెలుగు: పంచాయతీ ఎన్నికల్లో ఉపసర్పంచ్ కావాలని ఆశపడ్డ అభ్యర్థి రెండు ఓట్ల తేడాతో ఓడిపోవడంతో తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సెల్ టవరెక్కాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం చీలాపూర్‌లో బుధవారం జరిగింది. చీలాపూర్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 5వ వార్డు అభ్యర్థిగా సంపంగి రాజ్‌కుమార్ పోటీ చేశారు. ఈ వార్డులో మొత్తం 50 ఓట్లుండగా మొత్తం పోలయ్యాయి. ఓట్ల లెక్కింపు తరువాత రాజ్‌కుమార్‌కు 24 ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థి డి.సురేష్‌కు 26 వచ్చాయి.

ఉప సర్పంచ్ పదవి దక్కుతుందని ఆశతో బరిలో దిగి గెలుపు పక్కా అనుకున్న తరుణంలో ఇలాంటి ఫలితం రావడంతో తన ఓటమికి చివరగా ఓటు వేసిన ఇద్దరే కారణమని ఆరోపిస్తూ వారి ఓట్లు తొలగించాలని డిమాండ్ చేస్తూ సెల్ టవర్ ఎక్కాడు. ఈ ఎన్నికల్లో గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మొదటి విడతలో చిన్నకోడూరు మండలం మైలారంలో ఓటు హక్కును వినియోగించుకున్నారని, మూడో విడతలో చీలాపూర్‌లో ఓట్లు వేయడం వల్లే తాను ఓడిపోయానని ఆరోపించారు. విషయం తెలుసుకున్న అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి గ్రామానికి చేరుకుని రికార్డులు పరిశీలించి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో రాజ్‌కుమార్ సెల్ టవర్ దిగాడు. సురేష్ ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.

ఒక్క ఓటుతో విజయం

కామారెడ్డి, వెలుగు : ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమే. బుధవారం జరిగిన మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో ఒకే ఒక్క ఓటు అభ్యర్థుల తలరాతల్ని మార్చేసింది. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం బస్వాయిపల్లిలో ఫాతిమాబేగం(టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి) ఒక్క ఓటుతో ప్రత్యర్థిపై విజయం సాధించారు. ఇక్కడ మొత్తం 360 ఓట్లు ఉండగా 167 ఓట్లు ఫాతిమాబేగంకు, ప్రత్యర్థి సుల్తానాబేగంకు 166 ఓట్లు వచ్చాయి. పెద్దకొడప్‌గల్ మండలం పోచారంలో మనేవ్వ (టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి) ప్రత్యర్థులపై ఒక్క ఓటుతో గెలుపొందారు. ఇక్కడ 350 ఓట్లకు గాను మనేవ్వకు 164, ప్రత్యర్థి లక్ష్మీబాయికి 163 ఓట్లు వచ్చాయి.

గద్వాల జిల్లా ఉండవెల్లి మండలంలోని చిన్న ఆముదాలపాడులో దేవన్నకు 351 ఓట్లు రాగా, నగేశ్‌కు 352 ఓట్లు వచ్చాయి. దీంతో ఒక్క ఓటు తేడాతో నగేశ్ సర్పంచిగా విజయం సాధించినట్లు అధికారులు ప్రకటించారు.

అక్కడ ఎన్నికలు జరగలే

కామారెడ్డి, వెలుగు: కామారెడ్డి జిల్లా పెద్ద కొడప్‌గల్ మండలం కాటిపల్లి తండాలో పూర్తిగా మధుర లంబాడీలు ఉంటారు. వీరు బీసీ వర్గానికి చెందినవారు. అయితే అధికారులు అక్కడ ఎస్టీ రిజర్వేషన్ చేశారు. ఎస్టీలు ఎవరూ లేకపోవడంతో పోటీ చేయలేదు. దీంతో ఇక్కడ ఎన్నికలు జరగలేదు.

బీటెక్ చదివి సర్పంచ్

యాదాద్రి, వెలుగు : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం వడాయిగూడెం సర్పంచ్‌గా గుండు మనీష్‌కుమార్‌గౌడ్(22) గెలుపొందారు. ఈయన ఇటీవలే బీటెక్ పూర్తి చేశారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున మనీష్‌కుమార్‌గౌడ్, టీఆర్ఎస్ పార్టీ తరపున నీల ఓంప్రకాష్‌గౌడ్‌పోటీ చేశారు. మనీష్‌కుమార్ గౌడ్ 7ఓట్ల మెజారిటీతో గెలిచారు. మనీష్‌కుమార్‌గౌడ్‌కు 357ఓట్లురాగా, ఓంప్రకాష్‌గౌడ్‌కు 350ఓట్లు వచ్చాయి.



ట్రేడ్ కోర్సులకు వక్ఫ్‌బోర్డు ఆహ్వానం

హైదరాబాద్, వెలుగు: ఒడిశాలోని సెంచూరియన్ యూనివర్సిటీలో వివిధ ట్రేడ్‌కోర్సుల్లో శిక్షణ కోసం ముస్లిం అభ్యర్థుల నుంచి రాష్ట్ర వక్ఫ్ బోర్డు అప్లికేషన్లు ఆహ్వానించింది. ఇండస్ట్రీయల్ ఎలక్ట్రీషియన్, సీఎన్‌సీ మెషిన్ ఆపరేటర్, పైప్ వెల్డర్, ఎక్స్ రే టెక్నీషియన్, అండ్రాయిడ్ డెవలపర్, యానిమేషన్, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్, టాలీ ఆపరేటర్ తదితర 20 ట్రేడ్‌ల్లో శిక్షణ ఉంటుందని చెప్పింది. అడ్మిషన్ల కోసం ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీలోగా సర్టిఫికెట్లతో హైదరాబాద్‌లోని వక్ఫ్ బోర్డు ఆఫీసులో అప్లికేషన్లు పెట్టుకోవాలని పేర్కొంది. శిక్షణకు ఎంపికయ్యే 100 మంది అభ్యర్థులకు బోర్డు ఉచితంగా భోజనం, వసతి సదుపాయం కల్పిస్తుంది.

ఖాళీగానే ఉందిగా, మాకిప్పించండి

ఏపీపీఎస్సీ ఆఫీస్‌ను తమకు ఇవ్వాలని టీఎస్ పీఎస్సీ ఉద్యోగులు డిమాండ్

హైదరాబాద్, వెలుగు: ఖాళీగా ఉన్న ఏపీపీఎస్సీ కార్యాలయాన్ని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ)కి కేటాయించాలని టీఎస్‌పీఎస్సీ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. రోజూ వచ్చి పోయే ఉద్యోగులు, ఆఫీసర్లు, నిరుద్యోగులతో టీఎస్ పీఎస్సీ ఆఫీస్‌కిటకిటలాడుతోంది. ఆఫీస్ చిన్నగా ఉండటంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కూర్చొని పని చేయడానికి కూడా వీలు లేకుండా ఆఫీస్ తయారైందని ఎంప్లాయిస్ అసోసియేషన్ పేర్కొంది. అసోసియేషన్ అధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న టీఎస్ పీఎస్సీ ఆఫీస్ పై రెండు అంతస్తులు ఏపీపీఎస్సీకి కేటాయించడం జరిగిందని చెప్పారు. వాళ్ల ఆఫీస్ ఆంధ్రకు వెళ్లిపోయిందని, ప్రస్తుతం ఆ రెండు అంతస్తులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. సరైన నిర్వహణ లేకపోవడంతో పిల్లులకు, పక్షులకు నిలయమైందన్నారు. ఆ రెండు ఫ్లోర్లను తమకు కేటాయించాలని ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినట్లు వెల్లడించారు. కానీ అవి ఆంధ్ర సర్కారు ఆధ్వర్యంలో ఉన్నందున ప్రభుత్వం నిస్సహాయతను వ్యక్తం చేసిందని తెలిపారు. ఈ విషయమై గవర్నర్‌ను కలవనున్నట్లు చెప్పారు.

బాచుపల్లిలో తెలుగు వర్సిటీ పనులు వేగవంతం

హైదరాబాద్,వెలుగు: పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి చెందిన బాచుపల్లి క్యాంపస్‌ను వేగంగా డెవలప్ చేయాలని వర్సిటీ పాలకమండలి(ఈసీ) నిర్ణయించింది. వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్ భవనాలతో పాటు పరిపాలనా భవనాన్ని నిర్మించాలని కూడా అక్కడే కట్టాలని వర్సిటీ ఆఫీసర్లకు సూచించింది. తెలుగు యూనివర్సిటీ పాలక మండలి సమావేశం వర్సిటీ వీసీ ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈసీ మెంబర్స్ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్ మిశ్రా, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఆర్థిక శాఖ ఆఫీసర్‌చంద్రకళ, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, తెలుగు యూనివర్సిటీ రిజిస్ట్రార్ అలేఖ్య పాల్గొన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి అక్కడ కొన్ని కోర్సులను ప్రారంభించాలని, వర్సిటీ హెడ్ ఆఫీస్‌ను బాచుపల్లిలోనే కొనసాగించాలని సమావేశంలో తీర్మానించింది.

ఎలైట్ బార్లపై పిల్ కొట్టివేత

హైదరాబాద్: ఎలైట్ బార్ల ఏర్పాటుకు వీలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను సవాల్ చేసిన పిల్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. ఈ వ్యవహారంలో ప్రభుత్వ విధాన నిర్ణయంలో జోక్యం చేసుకోబోమని, ఇందులో ప్రజా ప్రయోజనం ఏమీ లేదని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన డివిజన్ బుధవారం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. వరంగల్‌కు చెందిన రాజనాల శ్రీహరి దాఖలు చేసిన పిల్ బెంచ్ ముందుకు విచారణకు వచ్చింది. ఇది పిల్ ఎలా అవుతుందో స్పష్టం చేయాలని పిటిషనర్‌ను బెంచ్ ప్రశ్నించింది. జీవో 223 ద్వారా ఎలైట్ బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, హైదరాబాద్‌లో మూడు ఎలైట్ బార్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిందని, ఇది బార్ అండ్ రెస్టారెంట్లకు అదనమని పిటిషనర్ వివరించారు. ఎలైట్ బార్లలకు ఏటా లైసెన్సుల కోసం బిడ్డింగ్‌లు ఉండవని, ఒకసారి అనుమతి ఇస్తే అది ఏళ్లకొద్దీ ఉంటుందని, వార్షిక ఫీ పెంపు మాత్రమే ఉంటుందని చెప్పారు. జీవోను కొట్టేయాలన్న అభ్యర్థనను ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ పిల్ వెనుక ఇతర బార్ల యజమానులు ఉండొచ్చని ఆరోపించింది. అన్ని వసతులతో ఎలైట్ బార్లుంటే నష్టమేమీ లేదని చెప్పింది.

పల్లె పల్లెకో నర్సరీ

వనపర్తి, వెలుగు:

తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లాలోని 255 గ్రామపంచాయతీల్లో నర్సరీల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల నాలుగు కోట్ల మొక్కలను పెంచుతోంది. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఉపాధి అవకాశాలను పెంచేందుకు నర్సరీల పెంపకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అటవీశాఖ ఆధ్వర్యంలో నర్సరీల పెంపకానికి జిల్లా అధికారులు రైతులను ఎంపిక చేశారు. వీటి పెంపకానికి అనువైన భూమితోపాటు సాగునీటి సౌకర్యం ఉన్న రైతులకు నర్సరీల బాధ్యతలను అప్పగించారు. గతంలో జిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాలలోనే నర్సరీలను పెంచేవారు దీంతో రవాణా ఖర్చులతోపాటు మొక్కలను తరలించే సమయంలో అవి దెబ్బతినేవి. ఈ అనుభవాల దృష్ట్యా జిల్లా యంత్రాంగం గ్రామాలలో నర్సరీలను ప్రోత్సహిస్తోంది. జనవరి మొదటి వారంలోనే నర్సరీల ఏర్పాటుకు చర్యలు తీసుకోగా, ఇప్పుడు అందుకు సంబంధించిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. జులై, ఆగస్టులో కురిసే వర్షాలకు పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు గ్రామాలలో మొక్కలు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ భూములు బంజేరు భూములు, చెరువుకట్టపై మొక్కలు నాటడం ద్వారా హరిత తెలంగాణగా మార్చాలనే సంకల్పంతో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఒక నర్సరీలో 30 వేల నుంచి 1.5 లక్షలవరకు మొక్కల పెంచుతున్నారు. ఒక మొక్క పెంపకంపై ప్రభుత్వం రూ.12 ఖర్చు చేస్తోంది. నర్సరీల నిర్వాహకులు ప్రభుత్వం ఎంపిక చేసిన మొక్కలను మాత్రమే పెంచాల్సి ఉంటుంది. మొక్కల పెంపకంతోపాటు నర్సరీ నుంచి క్షేత్రస్థాయికి వెళ్లేంతవరకు దానికి సంబంధించిన అన్ని జాగ్రత్తలు నర్సరీ నిర్వాహకులు తీసుకోవాల్సి ఉంటుంది.



- అటవీ శాఖ, ఉపాధి హామీ ద్వారా ఏర్పాటు
- హరిత వనాలు కానున్న గ్రామాలు

బూడిదపాడులో ఏర్పాటు చేసిన నర్సరీ

మహిళా సంఘాలకు బాధ్యతలు అప్పగింత

వనపర్తి జిల్లాలో మొక్కల పెంపకం బాధ్యతను మహిళా సంఘాలకు అప్పజెప్పారు. మహిళా సంఘాల సభ్యులు రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలతోపాటు వివిధ ప్రాంతాల్లో నాటిన వాటిని చనిపోకుండా జాగ్రత్తగా చూసుకుంటున్నారు. వాటికి అవసరమైన నీరు అందించడంతోపాటు జంతువుల నుంచి మొక్కలను కాపాడుతున్నారు. ఈ సంవత్సరం కూడా మహిళా సంఘాలను హరితహారంలో భాగస్వాములను చేసేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. జిల్లాలోని వేలాది మంది మహిళా సంఘాలను ఈసారి హరితహారంలో భాగస్వాములను చేసేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. తూతూ మంత్రంగా కాకుండా మొక్కల పెంపకాన్ని సీరియస్‌గా తీసుకునేందుకు కలెక్టర్ జిల్లా యంత్రాంగాన్ని సంసిద్ధం చేస్తున్నారు. జిల్లాలో ఎప్పటికప్పుడు నర్సరీల ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇప్పటి నుంచే నర్సరీల పెంపకంపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. గత ఏడాది నాటిన మొక్కలు ఎండిపోయిన సందర్భంలో పలువురు కిందిస్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు. ఎక్కడ నిర్లక్ష్యానికి తావులేకుండా కలెక్టర్ వ్యవహరిస్తుండటంతో హరితహారం కార్యక్రమం ఈ సారి మరింత విజయవంతంగా సాగుతుందని చెబుతున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఆదిలాబాద్ క్రైం, మంచిర్యాల, వెలుగు: ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. బైక్ అదుపు తప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన ప్రమాదంలో ఇద్దరు చనిపోగా, ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు చనిపోగా 12 మందికి గాయాలయ్యాయి.

అదుపు తప్పిన బైక్

బేల మండల కేంద్రానికి చెందిన జిల్‌పెల్లివార్ శివమ్(25), అదే మండలం మనియార్‌పూర్‌కు చెందిన మునేశ్వర్ దినేష్ (27) మంగళవారం మిషన్ భగీరథ పనుల్లో ఒకరు లైన్‌మన్‌గా మరొకరు సూపర్‌వైజర్‌గా చేస్తున్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మీటింగ్‌కు ఇద్దరూ హాజరయ్యారు. మీటింగ్ పూర్తయిన తర్వాత సాయంత్రం బైక్‌పై స్వగ్రామం మనియార్‌పూర్ బయలుదేరారు. చాందా (టి) సమీపంలో జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి బ్రిడ్జి పక్కన ఉన్న ముళ్లపొదల్లోకి దూసుకుపోయింది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరూ అక్కడికక్కడే చనిపోయారు. బుధవారం ఉదయం బ్రిడ్జి కింద ఎవరో పడి ఉన్నారని సమాచారం అందడంతో రూరల్ పోలీసులు సంఘటన స్థలికి వెళ్లి పరిశీలించారు. తలకు బలంగా గాయమవడం వల్లే ఇద్దరూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై హరిదాస్ వెల్లడించారు. సంఘటన స్థలిని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, మాజీ మంత్రి సి. రాంచంద్రారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి గంద్రత్ సుజాత పరిశీలించారు. ప్రమాదం గురించి పోలీసులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారన్న విషయం తెలియడంతో వారి కుటుంబాల్లో విషాదం అలముకుంది. ఇరు కుటుంబాలకు ఒక్కరే మగసంతానం. మృతుడు శుభమ్ తండ్రి కిరాణా కొట్టుతో జీవితం వెళ్లదీస్తుండగా, దినేష్ తండ్రి మహేందర్ వ్యవసాయం చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

టాటా ఏస్‌ఆటోలో బుధవారం ఉదయం 14 మంది చెన్నూరు నుంచి మంచిర్యాలకు బయలుదేరారు. చెన్నూరు మండలం కిష్టంపేట సమీపంలోని పెట్రోల్‌బంకు వద్ద ఆటోను ఇసుక లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో చత్తీస్‌గడ్ సిరోంచకు చెందిన మద్రి రాజు(35), చెన్నూరుకు చెందిన కడవండి రాజపోచం(40) అక్కడికక్కడే మృతిచెందారు. చెన్నూరుకు చెందిన సంధ్య, వెంకటస్వామి, రాజబాబు, జనగామ, సిర్సా గ్రామాలకు చెందిన లచ్చయ్య, పోషవ్వ, సంకీర్తన, రాజగౌడ్, వేమనపల్లికి చెందిన పోచన్న, మందమర్రికి చెందిన పీర్‌సాహెబ్, సిరోంచకు చెందిన ప్రభు, మృతుడు రాజు భార్య స్వప్న, మేడిగడ్డ ప్రాజెక్టులో పనిచేసే కార్మికుడు తన్మయి తదితరులు 12 మంది గాయపడ్డారు. సంఘటన స్థలంలో క్షతగాత్రుల రోదనలు మిన్నంటాయి. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే జైపూర్ ఏసీపీ వెంకటరెడ్డి, చెన్నూరు ఎస్సై విక్టర్ ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ముందు చెన్నూరు హాస్పిటల్‌కు అక్కడినుంచి మంచిర్యాల జిల్లా దవాఖానాకు పంపించారు.

సలహా కేంద్రం పనితీరు భేష్

ఎన్‌సీడీఆర్సీ చైర్మన్ ఆర్‌కే.అగర్వాల్

హైదరాబాద్, వెలుగు: వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్, సలహా కేంద్రాల పనితీరు బాగుందని నేషనల్ కన్జూమర్ డిస్పూట్స్ రిడ్రెసల్ కమిషన్ (ఎన్‌సీడీఆర్సీ) చైర్మన్ జస్టిస్ ఆర్‌కే. అగర్వాల్ అన్నారు. పౌరసరఫరాల భవన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను కమిషన్ సభ్యురాలు శిరీషతో కలిసి ఆయన బుధవారం సందర్శించారు. ఈ పాస్, ఐరిస్ ద్వారా రేషన్ ఇస్తున్న విధానాన్ని పరిశీలించారు. సలహా కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న ఉద్యోగులను అభినందించారు. 2018లో కాల్ సెంటర్‌కు 18 వేల కాల్స్ రాగా, వాటిని పరిశీలించి 444 నమోదు చేసి 396 కేసులను పరిష్కరించినట్లు తెలంగాణ వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి అకున్ సబర్వాల్ వివరించారు. కొందరు బాధితులకు రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు పరిహారం ఇప్పించినట్లు చెప్పారు. ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 180042500333, ఫేస్‌బుక్ : ConsumerInformation RedressalCentre, ట్విట్టర్: Telangana Consumer Info and Redressal Center, వెబ్‌సైట్ www.consumeradvice.in లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఎన్నికల సిబ్బందికి ఇంత తక్కువిస్తరా?

హైదరాబాద్, వెలుగు: గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి ప్రస్తుత పారితోషికం తక్కువగా ఉందని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆరోపించింది. పైగా ఒక్కో జిల్లాలో ఒక్కోలా ఇస్తున్నారని విమర్శించింది. ఎన్నికల సిబ్బందికి గౌరవప్రదమైన పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేసింది. బుధవారం సీఎస్ ఎస్‌కే జోషిని కలసిన యూఎస్‌పీసీ నాయకులు రవి, రాములు (టీఎస్‌యూటీఎఫ్), శ్రీనివాస్(టీపీటీఎఫ్) వినతిపత్రం అందించారు.

వీవీప్యాట్లపై ఈసీకి నోటీసులు

హైదరాబాద్:

వీవీప్యాట్ల లెక్కింపుకు ఆదేశాలివ్వాలనే రిట్ పిటిషన్లపై కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ల అభ్యర్థనలపై వివరణ ఇవ్వాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి టీఆర్ఎస్ చేతిలో ఓడిపోయిన ఎన్.పద్మావతి రెడ్డి, అద్దంకి దయాకర్, బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిన మల్‌రెడ్డి రంగారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాలను హైకోర్టు విచారించింది. కోదాడ నుంచి అభ్యర్థి పద్మావతికి తెలియకుండానే యూనిట్లను మార్చేశారని న్యాయవాది వాదించారు. వీవీ ప్యాట్ స్లిప్‌లు 45 రోజుల్లోనే అవి చెరిగిపోయే ప్రమాదముంది గనక కోర్టు వెంటనే స్పందించకపోతే తమ గోడుకు ఫలితం ఉండదన్నారు. అద్దంకి పోటీ చేసిన తుంగతుర్తిలో 18 ఈవీఎంలు సరిగా పని చేయలేదని, అలాంటప్పుడు వీవీ ప్యాట్‌లను లెక్కించాలని, కానీ తమ అభ్యర్థనను ఎన్నికల అధికారులు పట్టించుకోలేదని ఆయన లాయర్ వాదించారు. వీవీ ప్యాట్ ముద్రణలు చెరిగిపోవని, ఐదేళ్లుంటాయని ఈసీ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదించారు. ఫలితాలపై అభ్యంతరాలను ఎలక్షన్ పిటిషన్లుగా వేసుకోవాలేగానీ రిట్ వేయడానికి వీల్లేదన్నారు. ఈసీ ఫిబ్రవరి 7లోగా కౌంటర్లు వేయాలని, వాటికి పిటిషనర్లు 14కల్లా బదులివ్వాలని హైకోర్టు ఆదేశించింది. విచారణ ఫిబ్రవరి 14కి వాయిదా పడింది.

‘మతోన్మాదంతో అసమానతలు’

హైదరాబాద్, వెలుగు: పెరుగుతున్న మతోన్మాదంతో ప్రజల్లో అసమానతలు పెరిగాయని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, దాన్ని కాపాడుకుంటేనే దేశానికి, ప్రజలకు మేలు కలుగుతుందని అన్నారు. బుధవారం మఖ్దూం భవన్‌లో సీపీఐ నిర్వహించిన ‘లౌకికవాదాన్ని పరిరక్షిద్దాం, రాజ్యాంగాన్ని రక్షించుకుందాం’ అనే సదస్సులో ఆయన పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చే అవకాశముందన్నారు. సొంత మతాన్ని గౌరవిస్తూనే, ఇతర మతాలను గౌరవించాలని గాంధీ భావ జాలం చెబుతుందన్నారు. గాంధీ చెప్పిన అహింసా మార్గం, శాంతియుత ఉద్యమాలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. గాంధీ నుంచి గౌరీలంకేశ్ హత్య వరకు సంఘ్ పరివార్ శక్తులు దాడులు చేస్తూనే ఉన్నాయన్నారు. గాంధీ భావజాలంతో విభేదాలున్నా ఎన్నడూ ఆయన్ను శత్రువుగా చూడలేదని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన నేత గాంధీ అన్నారు. గాంధీని చంపిన గాడ్సేకి విగ్రహాలు, గుళ్లు కట్టాలని బీజేపీ నేతలు ప్రకటించినా మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు.

ఉన్నత విద్యాసంస్థల్లో ఏడో పే కమిషన్ వేతనాలు

హైదరాబాద్, వెలుగు: ఉన్నత విద్యాసంస్థల్లో సెవెన్త్ పే కమిషన్(ఎస్పీసీ) వేతనాలు త్వరలోనే అమలు కానున్నాయి. మార్చిలోగా సీపీసీని అమలు చేయకపోతే, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన శాలరీ గ్రాంట్స్ ఆగిపోతాయి. దీంతో ఎట్టి పరిస్థితుల్లో ఎస్పీసీసూచనలు అమలయ్యేలా సర్కారు ప్రయత్నాలు మొదలుపెట్టింది. బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్ మిశ్రను కలిసిన ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి, కార్యదర్శి శ్రీనివాస రావు నివేదికను అందజేశారు. ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలతో పాటు యూనివర్సిటీ ఉద్యోగులు,రిటైర్డ్ ఉద్యోగులకూ హెల్త్ స్కీమ్ పొడగింపు తదితర అంశాలను నివేదికలో పొందుపర్చారు. వాస్తవానికి 2016 నుంచే ఎస్పీసీ అమలు కావాల్సివుంది. రకరకాల కారణాలతో సర్కారు దాన్ని వాయిదా వేస్తూ వచ్చింది. ఎస్పీసీ అమలు వల్ల రాష్ట్ర ఖజానాపై దాదాపు 264 కోట్ల రూపాయల అదనపు భారం పడనుంది. మరో 130 కోట్ల రూపాయలను కేంద్రం గ్రాంట్‌గా ఇవ్వనుంది. ఏడో పే కమిషన్‌అమలు వల్ల సుమారు 4 వేల మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు.



మేడిగడ్డ రోడ్డుకు బ్రేక్

- పరిహారం చెల్లించకపోవడంతో పనులు అడ్డుకున్న రైతు
- అందరికి ఇచ్చినట్టే పరిహారం ఇవ్వాలని డిమాండ్
- కోర్టు ఆర్డర్‌ను కూడా పట్టించుకుంటలేరని ఆరోపణ

కాటారం ,వెలుగు :

తనకు పరిహారం చెల్లించకుండానే తన భూమిలోంచి రోడ్డు వేయడాన్ని మహాదేవపూర్ మండలం సూరారం గ్రామ రైతు బొక్కల సమ్మయ్య అడ్డుకున్నాడు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా మేడిగడ్డ బ్యారేజీకు అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభించారు. దీంతో సమ్మయ్య కోర్టును ఆశ్రయించారు. తాను పంట వేసుకున్న పొలం నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టారని, తనకు పరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలని కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చినట్టు సమ్మయ్య తెలిపారు. అయినా, పనులు కొనసాగిస్తుండడంతో బుధవారం స్పాట్‌కు వెళ్లి పనులు ఆపినట్టు చెప్పారు. బ్యారేజీ పనులను వేగంగా పూర్తి చేయాలని ఒక దిక్కు సీఎం కేసీఆర్ నిరంతరం అధికారులతో సమీక్షిస్తుంటే కిందిస్థాయిలో అధికారులు భూ సేకరణ దగ్గరే ఆగిపోతున్నారు. రైతులకు నష్ట పరిహారం ఇవ్వకుండానే పట్టా భూముల నుండి బలవంతంగా రోడ్డు వేస్తున్నారు. 2013 చట్టం ప్రకారం పరిహారం ఇస్తామని ఒకసారి, కొత్త చట్టం ప్రకారం ఇస్తామని మరోసారి రైతులకు వివరించారు. తమకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని మాత్రమే రైతులు కోరుతూవచ్చారు. అధికారులు మాత్రం కొందరికి కన్సర్న్ అవార్డు ప్రకారం, మరికొందరికి జనరల్ అవార్డ్ కింద పరిహారం ఇస్తున్నారు. దీంతో కొందరికి ఎక్కువ, కొందరికి తక్కువ పరిహారం అందుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. కిందిస్థాయి అధికారులు చేతివాటం చూపుతూ పరిహారాన్ని నిర్ణయిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. పరిహారం ఇచ్చే క్రమంలో కొందరు అధికారులు రైతులను ఇబ్బంది పెడుతుండడంతో పలుచోట్ల రైతులు పనులను అడ్డుకుంటున్నారు. రైతులెవరూ భూములు ఇవ్వమని చెప్పడంలేదు. పరిహారం ఇచ్చి పనులు చేయండని మాత్రమే అంటున్నారు. పరిహారం నిర్ణయించిన తర్వాత కూడా కొందు అధికారులు మాముళ్ల కోసం సతాయిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

ఈ వివాదం ఏమిటీ..

బొక్కల సమ్మయ్యకు సూరారం శివారులోని 270 సర్వేనంబరులో 20 గుంటల భూమి ఉంది. దీన్ని అప్రోచ్ రోడ్డు కోసం సేకరించనున్నారు. నాగుల బాపు , ములకల వెంకటయ్యకు సంబంధించిన పట్టా భూములు కూడి రోడ్డ కింద పోతున్నాయి. పరిహారం చెల్లించకుండానే కాంట్రాక్టర్ గతం లో పనులు చేసేందుకు సిద్ధపడ్డాడు. దీనితో ముగ్గురు బాధితులు ఈనెల 11న కోర్టుకు వెళ్లారు. పరిహారం చెల్లించిన తరువాతే పనులు చేయాలని కోర్టు ఇచ్చిన కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అధికారులకు సమర్పించారు. అయినా బుధవారం కాంట్రాక్టర్ రోడ్డు పనులు చేసేందుకు సమ్మయ్య పొలంలో మట్టి పోసి, ప్రోక్లైనర్లతో పనులు మొదలుపెట్టారు. దీనితో సమ్మయ్య అక్కడికి వెళ్లి పనిని ఆపించాడు .

పిల్లల్ని మంచిగా చూసుకుంటున్నరు

- రాష్ట్ర సర్కారుపై మణిపూర్ అసెంబ్లీ కమిటీ ప్రశంసలు
- స్టేట్‌హోమ్‌లో వీణా వాణిలను కలిసిన బృందం

హైదరాబాద్, వెలుగు:

తెలంగాణలోని ప్రభుత్వ హోమ్‌లో పిల్లల్ని చక్కగా చూసుకుంటున్నారని మణిపూర్ అసెంబ్లీ కమిటీ ప్రశంసించింది. నగరంలోని స్టేట్‌హోం, శిశు విహార్, బాలసదన్, సర్వీస్ హోమ్‌లలో మంగళవారం పర్యటించింది. చిన్నారుల ఆలనాపాలనకు మహిళా శిశు సంక్షేమ శాఖ చేస్తున్న కృషిని కొనియాడింది. మణిపూర్ ప్రభుత్వ కార్యదర్శి రమణిదేవి, ఎండీ రహీం, ఎండీ రఫీక్‌ఖాన్, మెగా చంద్ర సింగ్, ఫజూర్ రహీం, రోహిత్, దాన బస్తి దేవిలతో కూడిన బృందం చిన్నారులతో ముచ్చటించింది. కమిటీ పలు అంగన్‌వాడీ సెంటర్లకు కూడా వెళ్లింది.

వీణా-వాణిలతో ముచ్చట్లు

యూసూఫ్ గూడలోని స్టేట్ హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న అవిభక్త కవలలు వీణావాణిలను మణిపూర్‌నేతలు ప్రత్యేకంగా కలిశారు. ఇద్దరికీ ఉన్న సామాజిక స్పృహను, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని తెలుసుకుని ఆశ్చర్యపోయారు. వాళ్ల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతున్న మహిళ, శిశు సంక్షేమ శాఖ సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ మణిపూర్ అసెంబ్లీ కమిటీ బృందం ప్రత్యేకంగా రాతపూర్వక లేఖను సదరు శాఖకు అందజేసింది. ఇక్కడి సేవలను తమ రాష్ట్రంలోనూ అమలు చేస్తామని వాళ్లు లేఖలో అందులో పేర్కొన్నారు.

ఏకగ్రీవం రద్దుపై ఆందోళన

మెట్‌పల్లి, వెలుగు :


జగిత్యాల జిల్లా మల్లాపూర్ సర్పంచ్‌ఏకగ్రీవ ఎన్నికను రద్దు చేస్తూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలంటూ బుధవారం ఆందోళనకు దిగారు. మల్లాపూర్ సర్పంచ్ పదవికి టీఆర్ఎస్ అభ్యర్థి సందిరెడ్డి శ్రీనివాస రెడ్డి, క్యాతం జీవన్ రెడ్డి , ఆకుతోట నర్సయ్య, గోపిడి రాజిరెడ్డి నామినేషన్ వేశారు. నామినేషన్ల పరిశీలన, విత్ డ్రా, గుర్తుల కేటాయింపు సమయంలో ఎమ్మెల్యే బలపరిచిన అభ్యర్థి శ్రీనివాసరెడ్డి బరిలో ఉంటాడనుకున్నారు. విత్ డ్రా రోజు గోపిడి రాజిరెడ్డి, నర్సయ్య నామినేషన్లు విత్ డ్రా చేసుకున్నారు. అందరినీ షాక్ కు గురి చేస్తూ శ్రీనివాస్ రెడ్డి సైతం ఉపసంహరించుకున్నాడు. దీంతో జీవన్ రెడ్డి ఏకగ్రీవం గా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. ఎమ్మెల్యే బలపరిచిన అభ్యర్థి అనూహ్యంగా నామినేషన్ విత్ డ్రా చేసుకోవడాన్ని టీఆర్ఎస్‌వర్గాలు జీర్ణించుకోలేకపోయాయి. తమను బెదిరించడంతో విత్ డ్రా చేసుకున్నానని ఆకుతోట నర్సయ్య జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేశారు. యువజన సంఘాలు ఆందోళనకు దిగాయి. వ్యవహారం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో విచారణకు ఆదేశించారు. సర్పంచ్ పదవికి వేలం జరిగినట్లు ఆధారాలు ఉన్నాయని కలెక్టర్ చెప్పడంతో ఈసీ మల్లాపూర్ సర్పంచ్ ఎన్నికను రద్దు చేసింది. దీంతో జీవన్ రెడ్డి వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఎన్నిక రద్దు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు.

ప్రాజెక్టులపై ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్‌లకు అవగాహన

హైదరాబాద్, వెలుగు: కాళేశ్వరం ప్రాజెక్ట్, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథపై ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లకు బుధవారం జలసౌధలో అవగాహన కార్యక్రమం జరిగింది. ‘ఇంప్లిమెంటేషన్ అండ్ మానిటరింగ్ ఆఫ్ సస్టెయినబుల్ గ్యారంటీ స్కీమ్స్’పై శిక్షణలో భాగంగా నీటిపారుదల రంగం గురించి ఇంజనీర్లు ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే ఆఫీసర్లకు ఆహ్వానం పలికి, ప్రజెంటేషన్‌లో వివరించబోయే అంశాలను పరిచయం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ హరిరాం మ్యాప్స్ ఆధారంగా నిర్మాణం, నీటి పంపింగ్ గురించి చెప్పారు. డ్రోన్ కెమెరాల్లో చిత్రీకరిస్తున్న దృశ్యాలను లైవ్‌లో చూపించారు. వచ్చే రెండేళ్లలో ప్రాజెక్ట్ లింక్1, 2ల్లో 95 శాతం పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ ఏడాది జూన్ నాటికి గోదావరి జలాలను ఎత్తిపోస్తామని చెప్పారు. మిషన్ కాకతీయలో భాగంగా 13.80 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించామని మైనర్ ఇరిగేషన్ సీఈ శ్యాంసుందర్ వివరించారు. ప్రాజెక్టు పనులపై ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. నాలుగు దశల్లో రూ.8,741 కోట్ల అంచనా వ్యయంతో 27,653 ఎకరాల చెరువుల పునరుద్ధరణ పనులు మొదలుపెట్టామని, ఇప్పటి వరకూ 20,192 చెరువుల పునరుద్ధరణ పూర్తి అయ్యిందన్నారు. మిషన్ భగీరథ ద్వారా 25 వేల ఇళ్లకు తాగునీటిని అందించే పనులను పూర్తి కావచ్చాయని రిటైర్డ్ సీఈ జగన్మోహన్ తెలిపారు.

అమ్మలు 'హోమ్'లో ఎందుకుండాలి?

అమ్మ గురించి నాలుగు మాటలు చెప్పమంటే... నాలుగేంటి, నలభై చెబుతారు. అమ్మను ఆదరించమంటేమాత్రం వెనకడుగేస్తున్నారు. అమ్మను పొగుడుతూ ఎన్నో కవిత్వాలు, మరెన్నో వ్యాసాలు, పుస్తకాలు సైతం ముద్రించి అమ్మ గొప్పతనాన్ని వర్ణిస్తుంటారు. నిజంగానే, అమ్మంటే అంత గౌరవం పొంగుకొస్తున్నట్లయితే, సమాజంలో వృద్ధాశ్రమాల అవసరం ఎందుకొచ్చింది! తమ సంతానంతో అష్టకష్టాలు పడే పరిస్థితి అమ్మలకెందుకు కలిగిందో ఆలోచించాల్సిన అవసరం ఉంది. పురుడు పోసుకున్నప్పుడు అమ్మకు కలిగే సంతోషానికి వెల కట్టలేమన్నది జగమెరిగిన సత్యం. ప్రాణసమానంగా చూసుకుంటూ, గోరుముద్దలు తినిపించేది అమ్మ. ఇంత తెలిసిన సమాజంలో ఇంకా కొందరు అమ్మలు కష్టాలు పడుతున్నారంటే కారణమేమిటి? ప్రత్యేకంగా ధనవంతులు, అపార జ్ఞానం కలిగిన ఉద్యోగస్తులు తమ తమ తల్లిదండ్రులను ఓల్డ్ ఏజ్ హోమ్‌లలో ఉంచుతున్నారంటే కారణం ఏమిటి? మానవ సంబంధాలకంటే ఆర్థిక సంబంధాలకే విలువ ఇస్తున్నారని అర్థంగాక మానదు.



తమ తల్లిని వృద్ధాప్యశ్రమాలలో ఉంచిన ఓ ఉన్నతోద్యోగిని... 'ఎందుకు సార్ ఇలా చేశారు? నలుగురికీ ఆదర్శంగా ఉండాల్సిన మీరే, మీ అమ్మగారిని అక్కడ ఉంచారే' అని అడిగితే, 'మా అమ్మ అంటే నాకు అమితమైన ప్రేమ అందుకే అక్కడ ఉంచాం. నేను, మా ఆవిడా ఉద్యోగం చేయడం మూలంగా పొద్దునే వెళ్లి, ఏదో చీకటి పడ్డాక ఇంటికి చేరుకుంటాం. రోజంతా అమ్మను ఎవరు చేసుకుంటారో తెలియక అక్కడ ఉంచాల్సి వచ్చింది' అన్నారు. కానీ, అమ్మ ప్రేమ తన బాగోగులకంటే, ఆమె కళ్ళముందు సొంత మనుషులు ఉంటేనే సంతోషంగా ఉంటుంది. అవసరమైన సేవలు చేయడానికి ఎంతోమంది పేదలున్నారు. వారికీ పని కల్పించి, ఇంట్లోనే అమ్మను చూసుకుంటే ఎంతో బాగుండేదికదా!

ఇంకొకరు భార్య మూలంగా ఓల్డ్ ఏజ్‌హోమ్‌లో అమ్మను చేర్చుతారు. పని చేసేంత ఓపిక, శక్తి ఉన్నంతవరకు ఇంట్లో అన్ని పనులకు వాడుకొని, చేతగాని సమయం వచ్చిందంటే చాలు, ప్రతిదానికి అరుస్తూ, చీటికీమాటికీ సూదిపోటు మాటలతో మనసుకి బాధ కల్గించేలా ప్రవర్తిస్తారు. తమకు తామే ఇంట్లోనుండి వెళ్లిపోయేలా చేస్తుంటారు. కానీ, ఇక్కడ అలాంటివారు గమనించాల్సిన విషయం ఒకటుంది. ఎంత గొప్పవాళ్లయినా నిత్య యవ్వనంతో వుండరు, అందరూ ముసలివారు కావాల్సిందే, మనకీ అలాంటి దుస్థితి రావచ్చు. మనం వృద్ధులను అగౌర పరిచినప్పుడు.... వాటిని పిల్లలు నేర్చుకొని భవిష్యత్‌లో ప్రయోగించరని చెప్పగలమా! పల్లెలలో సైతం ఆస్తి తగాదాలతో అమ్మ నాన్నలను దూషించడం, కొట్టడం, ఇంట్లోనుండి గెంటెయ్యడం లాంటివి అక్కడక్కడా చూస్తూ ఉంటాం. ఏ కోణంలో చూసినా నేటి సమాజంలో ప్రేమ, ఆప్యాయత లాంటివి ఏనాడో కనుమరుగైపోయాయి. సమస్త లోకాన్నీ డబ్బు శాసిస్తుందనడానికి ఇదొక నిదర్శనం.

ఈ సామాజిక మార్పును కొందరు వ్యాపారానికి అనువుగా మార్చుకుంటున్నారు. సకల సౌకర్యాలు కల్పిస్తూ, హాస్టల్ మాదిరిగా ఓల్డ్ ఏజ్ హోమ్‌లను నెలకొల్పుతున్నారు. ఎవరి స్తోమతకు తగ్గట్లుగ్గా వాళ్లకు సర్వీస్ అందిస్తూ, సొమ్ము తీసుకుంటున్నారు. ఓల్డ్ ఏజ్ హోమ్‌లు నిర్వహిస్తున్న వారందరూ డబ్బుకోసమే చేస్తున్నారని అనలేం. మానవత్వం మరిచి తల్లిదండ్రులను వెలివేస్తున్న ఈ తరుణంలో వారికి అండగా నిలుస్తున్నవారు లేకపోలేదు. అలాంటివారికి పాదాభివందనాలు చేయాలి. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులకు చేసే సేవను అదృష్టంగా భావించినప్పుడు ఓల్డ్ ఏజ్ హోమ్‌ల అవసరమే కలగదు.



– డా. పోలం సైదులు,
తెలంగాణా సామాజిక రచయితల సంఘం

అవార్డుల వెనక

పొలిటికల్ ఫాయిదా?

ఇటీవలి కాలంలో జాతీయ అవార్డుల ప్రకటనల్లో పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం తగ్గిపోయిందన్న విమర్శలు వినబడుతున్నాయి. అవార్డుల అసలు ఉద్దేశం అపహాస్యానికి గురవుతోందన్న ఆవేదన వ్యక్తమవుతోంది. గౌరవప్రదమైన వ్యక్తులకు ఇచ్చే పురస్కారమేగానీ, వ్యక్తులకు గౌరవం ఆపాదించడం కోసమే ఇచ్చే ప్రక్రియ కానే కాదు.



ఎన్నికల ఏడాదిలో ప్రభుత్వాలు తీసుకునే ప్రతి నిర్ణయాన్ని పొలిటికల్ యాంగిల్‌లో చూడటం సహజంగా జరిగేదే. 2019 భారతరత్న అవార్డీల పేర్లు చూస్తే, ఎంపిక నిష్పక్షపాతంగా, విమర్శలకు తావులేని విధంగా జరిగి ఉండొచ్చని తొలుత అనిపిస్తుంది. ఇంకొంచెం ఆలోచిస్తే అధికార పార్టీకి ఫేవర్ చేసే అంశాలూ కనిపిస్తాయి.

మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి భారతరత్న అవార్డు ఇవ్వడం 'బెంగాలీ ప్రైడ్'కి బీజేపీ ఇచ్చిన గౌరవం. వెస్ట్ బెంగాల్‌లో ఎస్టాబ్లిష్‌కావడానికి కాషాయ పార్టీ కల్పించుకున్న అవకాశం. కమ్యూనిస్టుల వైఫల్యంతో ఆ రాష్ట్రంలో ఏర్పడ్డ పొలిటికల్ వాక్యూమ్‌ని ఫిల్ చేసే ప్రయత్నం. భూమి పుత్రుణ్ని సత్కరించడం ద్వారా యావత్ బెంగాల్‌ని తన వైపు తిప్పుకునే ఎత్తుగడ. ప్రణబ్ ముఖర్జీ తొలి నుంచీ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. వందేండ్ల కాంగ్రెస్ చరిత్రపై పుస్తకం కూడా రాశారు. 'ఏ సెంటినరీ హిస్టరీ ఆఫ్ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్' బుక్ సిరీస్‌లో ఒక వాల్యూమ్‌కు రచయితగానూ వ్యవహరించారు. పబ్లిక్ లైఫ్‌లో ఆయన చేసిన కృషిని గుర్తించింది మాత్రం బీజేపీనే. ప్రణబ్ 1984లో మొదటిసారి, 2004లో రెండోసారి ప్రధాని అయ్యే అవకాశాల్ని కోల్పోయారు. రెండు సందర్భాల్లోనూ పార్టీలో గాంధీ కుటుంబ సార్వభౌమత్వానికి తలొంచారు. కోపంతో పార్టీని వదిలెల్లినా, తిరిగి అక్కడికే చేరారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల తర్వాత భారతరత్న పురస్కారం పొందిన మూడో కాంగ్రెస్ వ్యక్తి ప్రణబ్ ముఖర్జీ. ఇప్పటిదాకా గాంధీ-నెహ్రూ కుటుంబంలో ముగ్గురికి (నెహ్రూకు 1955లో, ఇందిర 1971, రాజీవ్ 1991లో) పురస్కారాలు దక్కాయి. (కాంగ్రెస్ వ్యక్తే అయినా నెహ్రూకు అవార్డు దక్కింది ఫ్రీడమ్ ఫైటర్ కోటాలో). బాబూ రాజేంద్ర ప్రసాద్ మొదలు ప్రణబ్ వరకు ప్రథమ పౌరుడిగా పనిచేసి, అత్యున్నత పౌర పురస్కారం పొందినవాళ్ల జాబితా చాలా పెద్దదే.

అస్సామీ కల్చరల్ ఐకాన్ భూపేన్ హజారికాకు భారతరత్న ఇవ్వడడం లోకల్ సెంటిమెంట్‌ను ట్యూన్ చేసే ప్రయత్నంగా చూడొచ్చు. కొంతకాలంగా అసోం అందోళనలతో అట్టుడికిపోతున్న సంగతి తెలిసిందే. ముస్లిం చొరబాటుదారుల్ని వెనక్కి పంపేందుకు రూపొందించిన నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్‌సీ) అంశంలోగానీ; ఇప్పటికే అసోంలో ఉంటున్న బంగ్లాదేశ్, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ వలసదారుల్లో ముస్లిమేతరులను భారతీయులుగా గుర్తించే సిటిజన్‌షిప్ బిల్లు విషయంలోగానీ తలెత్తిన వివాదాలు ఇప్పట్లో చల్లారేలా లేవు. ఈ రెండు నిర్ణయాల తర్వాత అసోమ్ గణ పరిషత్ (ఏజీపీ) ఎన్డీఏ నుంచి తప్పుకుంది. హజారికాకు బీజేపీ అవార్డు ఇవ్వడాన్ని అసోంలో దూరమైన మిత్రులను మళ్లీ దగ్గరికి తీసుకునే ప్రయత్నంగానో, యావత్ ఈశాన్యంపైనే బలమైన ముద్ర వేసే ఎత్తుగడగానో చూడ్డంలో తప్పు లేదు. అన్నింటికీ మించి హజారికా బీజేపీ సభ్యుడేనని మనం మర్చిపోవద్దు. 2004లో బీజేపీలో చేరిన ఆయన గువాహటి లోక్ సభ స్థానం నుంచి పోటీచేసి ఓడిపోయారు. సొంత పార్టీకి ఇచ్చుకున్న బహుమానంగాకూడా దీన్ని పరిగణించొచ్చు.

ఇక మూడో అవార్డీ నానాజీ దేశ్‌ముఖ్‌పైనైతే ఎక్కడ లేని ప్రశ్నలు తలెత్తాయి. నానాజీ జీవితాంతం ఎవరినైతే సైద్ధాంతిక గురువుగా భావించారో... ఆ దీనదయాళ్ ఉపాధ్యాయను కాదని, శిష్యుడికి భారతరత్న ప్రకటించడంలో బీజేపీ తెలివిగా వ్యవహరించింది. ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటంలో, గాంధియన్ సోషలిస్ట్ నేత జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో సాగిన సంపూర్ణ క్రాంతి ఉద్యమంలో నానాజీ దేశ్‌ముఖ్ కీలకంగా వ్యవహరించారు. ఆయనను సత్కరించడం ద్వారా ఆరంభంలో బీజేపీకి సోషలిస్టులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేయడంతోపాటు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాడిన పాత తరానికి గుర్తింపు ఇచ్చినట్లయ్యింది. భారతీయ జన సంఘ్‌లో ముఖ్యుడైన నానాజీకి 1977నాటి జనతా సర్కారులో మంత్రిగా ఆఫర్ వచ్చినా, ఆయన సున్నితంగా తిరస్కరించారు. పదవుల కంటే నేరుగా ప్రజాసేవలోనే ఉంటానని చెప్పారాయన. దీనదయాళ్ ఉపాధ్యాయ హిందూ ఫిలాసఫీపై చేసిన రచనలను అనువదించే పనికి నానాజీ పూనుకున్నారు. ఇందుకోసం 1972లో దీనదయాళ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌ను స్థాపించారు. ఆ గ్రంథాల్లోని సారమే నేటి బీజేపీ మూల సిద్ధాంతం. ఒకవేళ దీనదయాళ్‌కే భారతరత్న అవార్డు ఇచ్చుంటే ఖచ్చితంగా వివాదం రేగేది. నానాజీ ప్రస్థానం తెలుసు కాబట్టే ప్రతిపక్షాలు నోరు మెదపలేదు. రూరల్ డెవలప్‌మెంట్ సెక్టార్‌లో ఆయన కాంట్రిబ్యూషన్ మరువలేనిది. వ్యవసాయం, వ్యయసాయ అనుబంధ పరిశ్రమలు, నీటి నిర్వహణపై రూపొందించిన నమూనాలు సత్ఫలితాలిచ్చాయి. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం నానాజీని భారతరత్నగా గుర్తించడం ద్వారా ఆర్ఎస్ఎస్‌ను సంతోషపెట్టడంతోపాటు ఇంకో ముఖ్యమైన సంకేతమిచ్చింది. ఇండియాలో ఇంటలెక్చువల్స్ అంటే లెఫ్ట్ ఐడియాలజీని సమర్థించేవాళ్లే కారని, రైట్ వింగ్‌లోనూ ఉన్నారని తెలియజెప్పడమే ఆ సంకేతం.

పాత సెంటిమెంట్లకు చెక్

భారత రత్న అవార్డుల పరంపర మొదలైన తొలినాళ్లలో ఎక్కువగా స్వాతంత్ర్య సమరయోధులకే దక్కాయి. తర్వాతి కాలంలో నాన్-పొలిటికల్ ఫిగర్లకు అవార్డులిచ్చారు. ఇక, ఫ్రీడమ్ ఫైటర్లుగా భారతరత్న అందుకున్నవారిలో చాలా మందికి కాంగ్రెస్ పార్టీతో అనుబంధం ఉంది. ఆ మధ్య అటల్ బిహారీ వాజపేయి, ఇప్పుడు నానాజీ దేశ్‌ముఖ్‌లు ఇద్దరు మాత్రమే రైట్ వింగ్‌కు చెందినవాళ్లు కావడం విశేషం. ఇప్పటివరకు ఈ అవార్డీల్లో ఎక్కువ మంది ఢిల్లీ, మహారాష్ట్ర, తమిళనాడులకు చెందినవారే కాగా, 2019 పురస్కారాలతో ఆ సంప్రదాయానికి చెక్ పడింది. వాస్తవం చెప్పాలంటే, బోర్డు రూమ్‌లో కూర్చొని భారత రత్నాలను ఎంపికచేసే పద్ధతిని మార్చడానికి కొన్ని ప్రయత్నాలు జరిగాయి. ఇది ఎన్నికల ఏడాది కాబట్టి అవార్డులను ఓట్లు రాల్చే పాచికలుగానే చూడటం అనివార్యం.

ఏమన్నారంటే



ష్... రాహుల్!

రాహుల్ గాంధీ నన్ను కలిసినప్పుడు మా మధ్య రఫేల్ ఒప్పందం గురించి ప్రస్తావన రాలేదు. మీ పర్యటన లక్ష్యంపై అనుమానాలు వస్తున్నాయి.

– మనోహర్ పారికర్, గోవా ముఖ్యమంత్రి



గంగను కడగాలి

యోగిలాంటివాళ్లు స్నానం చేయడంతో గంగానది కలుషితమయ్యింది. దానిని ప్రక్షాళన చేయాలి. వారి పాపాలు నదిలో చేరకుండా కొట్టుకుపోవాలి.

– శశి థరూర్, కాంగ్రెస్ ఎంపీ



అమెరికాలో మార్పు

ఇప్పుడు అమెరికా మారుతోంది. ప్రజాస్వామ్యం దిశగా సాగుతోంది. ఇండిపెండెంట్ జర్నలిజం మళ్లీ నిలబడుతుంది.

– కమల హ్యారీస్, డెమొక్రాట్ ఎంపీ



హమ్మయ్య, హేపీ


ఎవరైనా నటుడికి పద్మశ్రీ వచ్చిందంటే సోషల్ మీడియాలో తెగ ట్రోల్ చేస్తారు. ప్రస్తుతం ఎవరూ నన్ను ట్రోల్ చేయకపోవడంతో హేపీగా ఉన్నాను.

– మనోజ్ బాజ్‌పేయి, బాలీవుడ్ నటుడు

మన జీవితానికి మనమే

అక్షరాలు చెక్కుదాం!





మనోరంజన్ బ్యాపారి.. పరిచయం చేసుకుని తీరాల్సిన ఫేమస్ పర్సన్. తూర్పుతీరం నుంచి దళితవాణిని బలంగా వినిపిస్తోన్న బెంగాలీ రైటర్. పలకాబలపం పట్టి బడికిపోయిన బాపతు కాదు. ఆవారాగా తిరిగి, చిన్నాచితకా నేరాలు చేసి, జైల్లో పడ్డాకగానీ అక్షరాల్ని ముట్టుకోలేదు. తోటి ఖైదీ సాయంతో రాయడం నేర్చుకున్న మనోరంజన్.. మహాశ్వేతాదేవి ప్రోత్సాహంతో రచయితగా మారాడు. రిక్షాపుల్లర్ నుంచి పాపులర్ రైటర్‌గా ఆయన సాగిన ప్రస్థానంలో... 15 పుస్తకాలు, 35 వ్యాసాలు, 150కిపైగా కథలు రాశారు. దళితులు విరివిగా రచనలు చేయాలని అందరూ పిలుపునిస్తే... పర్సెప్షన్ మార్చుకోలేనివాళ్లు అసలు దళితుల గురించి రాయడమే మానేయాలంటారు మనోరంజన్.

'గొప్ప పేరు తెచ్చుకున్న పెద్ద రచయితలందరికీ నా సెల్యూట్. పేదల జీవితాల గురించి వాళ్లు విస్తారంగా రాశారు. నా జీవితాన్ని మలుపు తిప్పిన మహారచయిత్రి మహాశ్వేతాదేవి, బెంగాల్‌లో బడా రైటర్లుగా పాపులరైన మానిక్ బంధోపాధ్యాయ, మున్షీ ప్రేమ్‌చంద్.. వీళ్లందరినీ గౌరవిస్తా. కానీ, కాస్త విశాలదృష్టితో, పైనుంచి చూస్తే తప్ప వాళ్లు నిజంగా ఏం రాశారో చూడలేం. పెద్ద రచయితల పుస్తకాలన్నీ విద్యావంతులకే పరిమితమైన సర్కిల్ చుట్టూ తిరుగుతాయి. పరస్పర అభినందనలు, మెచ్చుకోళ్లే ఉంటాయక్కడ. ఎప్పుడైతే పేదలుగా మన జీవితాలపై వేరే వాళ్లు రాసిన పుస్తకాల్ని మనం చదవడం, వాటి గురించి ఆలోచించడం మొదలవుతుందో అప్పుడనిపిస్తుంది.. 'అరే, వీళ్లు మన గురించి అన్నీ తప్పులే రాశారుకదా, మన లైఫ్ గురించి మరింత ఖచ్చితంగా మనమే చెప్పుకోవచ్చు కదా' అని.

మీకో రెండు మూడు ఉదాహరణలు చెబుతా. బెంగాలీ లెఫ్టిస్ట్ రైటర్‌గా మాణిక్ బంధోపాధ్యాయ చాలా ఫేమస్. ఆయన రాసిన 'పద్మనాదిర్ మాఝి' నవల చేపలు పట్టుకుని బతికే దళితుల జీవితాల చుట్టూ తిరుగుతుంది. ఆ నవల్లో మంచి క్యారెక్టర్ ఒక్కటి కూడా ఉండదు. ఒకడేమో మరదలిని లేపుకుపోతాడు, ఇంకొకడు మాదకద్రవ్యాలు అమ్ముతుంటాడు, ఫిమేల్ క్యారెక్టర్లకు సెల్ఫ్ ఐడెంటిటీ ఉండదు. అసలా నవలలో దళితుల జీవితం కనీసమైనా రిఫ్లెక్ట్ కాదు. రవీంద్రనాథ్ ఠాగూర్ ఒక కవితలో ఇలా రాస్తాడు..'నేను చాలా రచనలు చేశానుగానీ కార్మికులు, కర్షకుల గురించి ఎక్కువగా రాయలేదు. కూలీలతో మాట్లాడదామని వాళ్ల గుడిసెల గుమ్మం దాకా వెళతానుకానీ, తలుపు తీసేవాళ్లు లేక అక్కడే తచ్చాడుతుంటా' అంటారు.

ఇంకో గొప్ప రచయిత మున్షీ ప్రేమ్‌చంద్‌నే తీసుకుందాం. తన 'కఫన్' కథలో చమర్ (చర్మకారుడి) క్యారెక్టర్‌ని దారుణంగా చిత్రీకరించాడు. మద్యం అలవాటు కారణంగా ఆ చమర్ తన జీవితాన్ని సర్వనాశనం చేసుకుంటాడు. నిజమే, ఆల్కహాల్ ఎవరి జీవితాన్నైనా బుగ్గి చేస్తుంది. దానిని కులానికి ఆపాదించడమెందుకు? చమర్ మాత్రమే ఇట్లా చేస్తాడని ప్రేమ్‌చంద్ ఎందుకు రాశారు? కథలో క్యారెక్టర్‌ని 'తాగుబోతు' అని కాకుండా పదే పదే చమర్ అని ఎందుకు పిలవాల్సొచ్చింది? తాగుబోతులు ఏ కులంలోనైనా ఉంటారు. దళితులందరూ తాగుబోతులు కారు. మన రైటర్లందరూ ఉద్దేశపూర్వకంగా ఇలా రాశారని కాదు. అన్‌కాన్షియస్‌గా అలా వచ్చేస్తాయంతే. ఎందుకంటే, దళితుల పట్ల వాళ్లకున్న అవగాహన అది. పర్సెప్షన్ మారకుంటే, అసలు దళితుల గురించి రాయడం ఎందుకు? కాబట్టి నేనేమంటానంటే... 'ఇప్పటిదాకా మీరు (బడా రైటర్లు) మా (దళితుల) జీవితాల గురించి రాసింది చాలు. ఇక మానేయండి. వందల ఏండ్ల తర్వాత మేమూ ముందుకొచ్చాం. మీతోపాటే రాయగలిగే స్థాయికి ఎదిగాం. మా కథలు మేమే చెప్పుకుంటాం. కాదూ కూడదంటే మిమ్మల్ని అవతలికి విసిరేస్తాం'.

ఇంత బలంగా సాహిత్య ప్రకటన చేస్తున్న మనోరంజన్ బ్యాపారి తన మూడున్నర దశాబ్దాల లిటరరీ కెరీర్‌లో 15 పుస్తకాలు, 35 వ్యాసాలు, 150కిపైగా కథలు రాశారు. 'ఇంటరాగేటింగ్ మై ఛండాల్ లైఫ్ ; ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఎ దళిత్' పేరుతో ఆత్మకథను అచ్చు వేశారు. బెంగాల్‌లో నక్సలైట్ ఉద్యమ నేపథ్యంలో ఆయన రాసిన తాజా పుస్తకం 'గన్‌పౌడర్ ఇన్ ద ఎయిర్' పేరుతో ఇంగ్లీష్‌లోకి అనువాదమైంది. దళిత సాహిత్యం, బెంగాల్‌లో దళితుల స్థితిగతులపై ఆయన ఇంకా ఏమన్నారంటే..


'దళిత ఉద్యమం బలంగా ఉన్నచోటే దళిత రచనలూ పుట్టుకొస్తాయి. బెంగాల్‌లో అలాంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా పెద్ద కుట్రలే జరిగాయి. ఒకప్పుడు బెంగాల్‌లో నామసూద్ర కమ్యూనిటీ సంఖ్యాపరంగా పెద్దది. వీళ్లకు అంబేద్కర్‌తో చాలా దగ్గరి సంబంధాలుండేవి. బాబా సాహెబ్ బెంగాల్ నుంచి పోటీ చేసినప్పుడు ఆయన్ని గెలిపించింది నామసూద్రలే. భవిష్యత్తులో దళిత నాయకుల్ని తయారు చేసుకోగల సామర్థ్యం, అవకాశం వాళ్లకు మాత్రమే ఉండేది. ఇంత బలమైన కమ్యూనిటీ కాస్తా దేశ విభజనతో చెల్లాచెదురైపోయింది. నామసూద్రలు, ఇంకొన్ని వర్గాలను తూర్పు పాకిస్తాన్‌కు పంపేశారు. అక్కడ ముస్లింలతో కుదరక వాళ్లంతా మళ్లీ ఇండియాకి వలసొచ్చేశారు. సరిగ్గా ఆ టైమ్‌లోనే ఇండియన్ గవర్నమెంట్ 'నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్ (ఎన్ఆర్‌సీ)' తీసుకొచ్చింది. ఇక్కడి అధికార యంత్రాంగం నిండా అగ్రకులాల వాళ్లే కాబట్టి, తూర్పు పాకిస్తాన్ నుంచి తిరిగొచ్చేసిన వాళ్లలో ముందు అగ్రకులాల కుటుంబాలకు మాత్రమే తక్షణ పునరావాసం కల్పించారు. పేదలైన నామసూద్రల్ని గాలికొదిలేశారు. వేలాది నామసూద్రల జీవితాలు దశాబ్దాల పాటు రెఫ్యూజీ క్యాంపుల్లోనే గడిచిపోయాయి. ఇక సంఘటితమై పోరాడే పరిస్థితెక్కడిది? ఇదిగో, ఇన్నేండ్ల తర్వాత బెంగాలీ నామసూద్రలు మళ్లీ మాట్లాడగలుగుతున్నారు. చదువులు, ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. దళిత రచయితల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది. నిజాల్ని ఆధారం చేసుకుని హృదయంతో రాసే రచనల్ని కొట్టిపారేయలేం. లైఫ్‌ని రిప్రెజెంట్ చేసేవి అలాంటివాటినే పాఠకులూ ఇష్టపడతారు. నేను రాసిన 15 నవలల్లో ఏ ఒక్కటీ పేరు మోసిన పబ్లిషర్లు వేసినవి కావు. నా పుస్తకాలపై న్యూస్ పేపర్లలో రివ్యూలు కూడా రాలేదు. మరి, నా రచనలు దేశవ్యాప్తంగా ఎలా పాపులర్ అయ్యాయి? అంతెందుకు, ప్రఖ్యాత హిందూ లిటరరీ ప్రైజ్ పురస్కారంతో బెంగాల్‌లో అడుగు పెట్టినప్పుడు నన్ను కలవడానికి ఒక్కరూ రాలేదు. అయినాసరే, బెంగాల్‌లో నేను పేరుమోసిన రచయితనే. నేను రాయడం మొదలుపెట్టింది ఫేమస్ అయిపోవాలన్న లక్ష్యంతో కాదు. నాలాంటి బడుగు వర్గాల రచయితలే నాకు కాంపిటీటర్లు. బాబీ హల్దార్ (గుర్‌గావ్‌కు చెందిన డొమెస్టిక్ వర్కర్) ఆటోబయోగ్రఫీ 'ఎ లైఫ్ లెస్ ఆర్డినరీ' 20 భాషల్లోకి అనువాదం అయింది. ఇప్పుడు నా టార్గెట్ 21 భాషల్లోకి అనువదించగల స్థాయిలో పుస్తకం రాయడం'.

జైలు నుంచి విడుదలైన తర్వాత కోల్ కతాలో రిక్షా పుల్లర్ అవతార మెత్తుతాడు మనోరంజన్ బ్యాపారి. ఒకసారి రచయిత్రి మహాశ్వేతాదేవి అతని రిక్షా ఎక్కుతుంది. ఆమె ఫలానా అని తెలియకుండానే తాను ఎక్కడో చదివిన 'జిజిబిషా' పదానికి అర్థమేంటో అడుగుతాడు. ఒక్కక్షణం ఆశ్చర్యపోయి, జిజిబిషా అంటే ఆత్మస్థయిర్యమని అర్థం చెబుతుంది శ్వేతాదేవి. సవారీ పూర్తయ్యేసరికి, ఏదో ఒకటి రాసిచ్చేలా అతని నుంచి మాట తీసుకుంటుంది. అలా మనోరంజన్ రాసిన 'రిక్షా పుల్లర్ జీవితాన్ని' మహాశ్వేతాదేవి తన బర్తాకా పత్రికలో అచ్చు వేయిస్తుంది. చిన్నదే అయినా తొలి రచనకే మంచి పేరొస్తుంది. అలా 35 ఏండ్ల కిందట మొదలైంది మనోరంజన్ రచనా ప్రస్థానం. ఇప్పుడు మహాశ్వేతాదేవి రచనల్లోని లోపాల్ని ఎత్తి చూపేందుకుసైతం వెనకాడట్లేదు. ఎందుకంటే ప్రశ్నించడమే ఆయన తత్వం.



అన్యాయం, అణచివేత ఉన్నంత కాలం...

బలదూర్‌గా తిరిగే టైమ్‌లోనే బ్యాపారికి కార్మిక హక్కుల లీడర్ శంకర్ గుహా నియోగితో పరిచయం ఏర్పడి కొద్దికాలం మాత్రమే నక్సలైట్ జీవితం గడిపిన మనోరంజన్.. జైలు శిక్ష తర్వాత ప్రజాజీవితంలోనే ఉండిపోయాడు. 'విప్లవం అనే పదాన్ని నక్సలిజం లేదా మావోయిస్ట్ మూమెంట్‌లకు మాత్రమే ఆపాదించి చూడటం పొరపాటు. స్వాతంత్ర్యంకోసం స్పార్టకస్ యుద్ధాలు చేసినప్పుడు ఆయన వెంట కార్ల్ మార్క్స్, మావో జెడాంగ్, లెనిన్‌లు లేరే! అసలు మార్క్స్ ఎవరో, ఆయనేం చెప్పారో తెలియకున్నా ఉద్యమాలు చేస్తున్నవాళ్లు ఈ భూగోళంలో చాలా మందే ఉన్నారు. శతాబ్దాలుగా సమాజంలోని చెడుకు వ్యతిరేకంగా మనిషి పోరాడుతూనే ఉన్నాడు. అన్యాయం, అణిచివేత ఉన్నంతకాలం పోరాటాలు జరుగుతూనే ఉంటాయి. మార్క్సిజం ఒక ఆయుధం లాంటిది. సమాజం పట్ల మన దృక్పథాన్ని మారుస్తుంది. నక్సలైట్ ఉద్యమం మేల్కొలుపులో ఒక భాగం' అని మనోరంజన్ అంటారు.



ఆలియా.. అందులోనా?



చేతినిండా ఆఫర్లతో క్షణం తీరిక లేకుండా ఉంది ఆలియా. అయినా కూడా మరిన్ని ప్రాజెక్టులు ఆమె వెనకాల క్యూ కడుతున్నాయి. ఆల్రెడీ కళంక్, బ్రహ్మాస్త్ర, తఖ్త్ చిత్రాల్లో నటిస్తోంది ఆలియా. అంతలోనే ఆమె దగ్గరకు 'దోస్తానా' సీక్వెల్ వచ్చింది. ఆ కథ ఆమెకు నచ్చేసిందట కూడా. అన్నీ సెట్ అయితే ఆమే హీరోయిన్ అంటున్నారు. నిజానికి ఈ సినిమా అప్పట్లో సంచలనం సృష్టించింది. ఇద్దరు గే యువకులు ఒకే అమ్మాయితో ప్రేమలో పడటం అన్న కథాంశంతో తెరకెక్కిన మూవీ అది. అప్పట్లో అలాంటి సబ్జెక్టులు కాస్త కొత్త. అందుకే కాస్త సెన్సేషనల్ అయ్యింది. కొన్ని విమర్శలు కూడా వచ్చినా సినిమా అయితే హిట్. ఇప్పుడు దానికి సీక్వెల్ తీస్తున్నారంటే అలాంటి కథాంశమేనా లేక మారుతుందా అన్నది తెలీదు. మరోపక్క 'ఆర్ ఆర్ ఆర్' కోసం రాజమౌళి ఆలియాను ట్రై చేస్తున్నాడనే వార్తలూ గుప్పుమన్నాయి. ఇప్పటికే ఈ సినిమా విషయంలో చాలామంది పేర్లు వినిపించాయి. రీసెంట్‌గా పరిణీతి చోప్రా పేరూ బైటికొచ్చింది. ఇప్పుడు ఆలియా పేరు వినిపిస్తోంది. మరి ఈ రెండింటిలోనూ ఆలియా చేస్తోందా, లేక ఏ ఒక్కదాని వైపైనా మొగ్గు చూపుతోందా, అదీకాక రెండు వార్తలూ రూమర్సేనా అన్నది తెలియాల్సి ఉంది.

రీల్‌లో రియల్ ఫైటర్



ప్రస్తుతం స్పోర్ట్స్ నేపథ్యంలో తెరకెక్కే సినిమాల హవా ఎక్కువైంది. చాలామంది దర్శకులు రకరకాల క్రీడల చుట్టూ కథలు అల్లుకుని తీస్తున్నారు. జయంత్ సి. పరాన్జీ కూడా అదే ప్రయత్నంలో ఉన్నాడు. నీలేష్, ఇజబెల్లాలతో ఇండియా పాకిస్థాన్ బ్యాక్‌డ్రాప్‌లో 'నరేంద్ర' మూవీ తీస్తున్నారాయన. ఇందులో హీరో బాక్సింగ్ చాంపియన్. సినిమా మొత్తం ఆ క్రీడ చుట్టూనే తిరుగుతుంది. విశేషమేమిటంటే... ప్రపంచ ప్రఖ్యాత ఇండో అమెరికన్ రెజ్లర్ ఖలీ ఈ చిత్రంలో ఒక ముఖ్య పాత్ర పోషించనున్నాడని తెలుస్తోంది. ఆ పాత్ర ఏంటి, ఎలా ఉంటుందనేది ఇంకా తెలియలేదు కానీ అంత గొప్ప చాంపియన్ నటిస్తున్నాడంటే విశేషమే. ప్రేమించుకుందాం రా, బావగారు బాగున్నారా వంటి చిత్రాలతో ఒకప్పుడు మంచి విజయాలు సాధించిన జయంత్... ఆ తర్వాత వరుస పరాజయాలు రావడంతో కెరీర్‌లో కాస్త వెనుకబడ్డాడు. మరి ఈ సినిమాతోనైనా మళ్లీ ఫామ్‌లో కొస్తాడేమో చూడాలి.

సందేశాత్మక థ్రిల్లర్



శివ కంఠంనేని ప్రధాన పాత్రలో శ్రీపాద విశ్వక్ రూపొందించిన చిత్రం 'అక్కడొకడుంటాడు'. రామ్ కార్తీక్, శివ హరీష్, అలేఖ్య, రసజ్ఞ దీపిక హీరో హీరోయిన్లు. రవిబాబు, వినోద్ కుమార్, ఇంద్రజ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. లైట్ హౌస్ సినీ మ్యాజిక్ పతాకంపై కె.శివశంకరరావు, రావుల వెంకటేశ్వరరావు నిర్మించిన ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ప్రముఖ నటుడు, దర్శకుడు వల్లభనేని జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరై ఆడియో సీడీని ఆవిష్కరించారు. ఈ చిత్ర నిర్మాతలతో తనకు ముప్పయ్యేళ్ల అనుబంధం ఉందని, మంచి అభిరుచితో విభిన్నంగా ఈ చిత్రాన్ని తీశారని ఆయన అన్నారు. మరో అతిథి సి.కళ్యాణ్ మాట్లాడుతూ... 'ప్రతివారం పది చిన్న సినిమాలు, ఒక పెద్ద సినిమా విడుదలవుతుంటాయి. వాటిలో ఒకటిగా కాకుండా ఓ ప్రత్యేక సినిమాగా ఇది నిలుస్తుంది. సందేశాన్ని మిళితం చేసి.. చూస్తున్నంతసేపు ఏం జరుగుతుందా అని ఉత్కంఠ రేపేలా ఈ చిత్రాన్ని తీశారు' అన్నారు. టైటిల్లో ఉన్న ఆ ఒకడు ఎవడు, ఎక్కడుంటాడు, ఎందుకుంటాడో తెలియాలంటే తప్పకుండా సినిమా చూడాలన్నారు శివ కంఠంనేని. ప్యాషన్‌తో వచ్చిన ఈ చిత్ర నిర్మాతల క్రమశిక్షణ, అంకితభావం చూసి తనకి చాలా ముచ్చటేసిందంటూ ప్రశంసించారు రవిబాబు. ఇది మంచి సస్పెన్స్ థ్రిల్లర్ అని, పైరసీ జోలికి వెళ్లకుండా థియేటర్లో చూస్తే సాంకేతిక విలువలు తెలుస్తాయని నిర్మాతలు అన్నారు.

కంటెంట్ ఉంటే ప్రేక్షకులే హిట్ చేస్తారు



ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరో హీరోయిన్లుగా పరిచయమవుతోన్న చిత్రం '4 లెటర్స్'. ఆర్.రఘురాజ్ దర్శకుడు. దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్ కుమార్ నిర్మించారు. బుధవారం ప్రసాద్ ల్యాబ్స్‌లో ఈ చిత్ర లోగోని జెమినీ కిరణ్ లాంచ్ చేయగా... చంద్రబోస్, శివాజీ రాజా, సురేష్, అచ్చిరెడ్డి నాలుగు పాటలను లాంచ్ చేశారు. ట్రైలర్‌ను ఎస్.వి.కృష్ణారెడ్డి లాంచ్ చేశారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ 'ఈశ్వర్‌కి తన కలను నిజం చేసుకోవడానికి తల్లిదండ్రులు మంచి సపోర్ట్ ఇచ్చారు. దాని ఫలితమే ఈ సినిమా. పాటలన్నీ బాగున్నాయి. సినిమా ఖచ్చితంగా హిట్టవుతుందని ఆశిస్తున్నాను' అన్నారు. అచ్చిరెడ్డి మాట్లాడుతూ 'ఒక సినిమా హిట్ అవ్వడానికి ఎంత బడ్జెట్‌లో తీశారు, కాస్టింగ్ ఏంటి అనేది కాదు.. మంచి కంటెంట్ ఉంటే చాలు, ప్రేక్షకులు హిట్ చేస్తారు' అన్నారు. హీరో మాట్లాడుతూ 'నా ప్యాషన్‌ని గమనించి నాతో సినిమా తీసిన నా పేరెంట్స్‌కి కృతజ్ఞతలు. మా ఫ్యామిలీలో అందరికీ సినిమాపై ఇంటరెస్ట్ ఉండడంతో ఈ సినిమాని ప్రారంభించాం' అన్నారు. మూవీ అందరికీ నచ్చుతుందని అంకిత, తెలుగు రాని తనకు అందరూ సపోర్ట్ చేశారని టువ అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ బీన్స్ మాట్లాడుతూ 'మూడు పాటలు ఫోక్, ఒక పాట వెస్ట్రన్ స్టయిల్లో ఉంటాయి. ఇప్పటివరకు నా పాటలను ఆదరించారు. వీటినీ ఆదరించాలని కోరుకుంటున్నాను' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఒకసారి ఎయిర్ పోర్ట్ నుంచి కారులో వస్తున్నాను. ఆ డ్రైవర్ ఒక ఇంజినీర్. ఇండియాలో ఇంజినీర్‌కి వాల్యూ లేదని ఆ డ్రైవర్ చెప్పిన మాటలు విన్న తర్వాత వచ్చిన ఆలోచనే ఈ సినిమా. ఫిబ్రవరి రెండో వారంలో రిలీజ్ చేయాలనుకుంటున్నాం' అన్నారు. 'ఇరవయ్యేళ్లుగా న్యూయార్క్ లో సెటిలయినా తెలుగువారికి దగ్గరవ్వాలని, మా అబ్బాయి ఈశ్వర్‌కి సినిమా మీదున్న ప్యాషన్ చూసి ఈ సినిమా నిర్మాణం మొదలుపెట్టా. రఘురాజ్ మంచి సబ్జెక్టు చెప్పారు. నచ్చింది. ఎక్కడా రాజీ పడకుండా తీశాం. మా బ్యానర్‌లో వస్తోన్న ఈ మొదటి సినిమా అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాను' అన్నారు నిర్మాత ఉదయ్ కుమార్.

పాటలో పాయల్?



బోల్డ్ సినిమాతో ఎంట్రీ ఇచ్చినా బెస్ట్ పర్‌ఫార్మెన్స్‌తో బోలెడన్ని కాంప్లిమెంట్స్ సంపాదించింది పాయల్ రాజ్‌పుత్. ఆ తర్వాత వరుసగా సినిమాలు చేసుకుంటూనే పోతోంది. ఇటీవలే 'కథానాయకుడు'లో జయసుధగా కనిపించిన ఆమె... రవితేజ సరసన 'డిస్కో రాజా'లో కూడా నటిస్తోంది. ఇందులో ఆమె వైకల్యం ఉన్న అమ్మాయిగా నటిస్తోందని సమాచారం. వీఐ ఆనంద్ దర్శకత్వం వహించే ఈ చిత్రంలో నభా నటేష్ మరో కథానాయికగా నటిస్తున్నప్పటికీ, పాయల్ పాత్ర చాలా డిఫరెంట్‌గా, ఎక్కువ ప్రాధాన్యతతో ఉంటుందట. మరోపక్క మాతృభాష పంజాబీలోనూ చాలా సినిమాలు చేస్తోంది. తమిళంలో ఉదయనిధి స్టాలిన్‌తో కలిసి 'ఏంజిల్' మూవీలో నటిస్తోంది. చేతిలో ఇన్ని అవకాశాలున్నా ఇప్పుడో కొత్త ప్రయోగం చేయడానికి రెడీ అయ్యింది పాయల్. బెల్లంకొండ శ్రీనివాస్, కాజల్ అగర్వాల్ జంటగా తేజ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'సీత' చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్ చేయడానికి పాయల్ ఎస్ చెప్పినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో ఒక ఐటమ్ సాంగ్ తప్పకుండా ఉండాలట. దానికి చాలా ప్రాముఖ్యత ఉంటుందట. అందుకే ఎవరైనా గ్లామరస్ హీరోయిన్‌ని తీసుకుంటే మంచిదని దర్శక నిర్మాతలు భావించారట. ఆ క్రమంలో పాయల్‌ను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. కెరీర్ డల్ అయిన చాలామంది హీరోయిన్లకి స్పెషల్ సాంగ్స్ కలిసొచ్చిన సందర్భాలున్నాయి. పాయల్‌కి ఈ పాటెలా ప్లస్ అవుతుందో చూడాలి.

హీరోయిన్‌గా విలన్ కూతురు



'రేసుగుర్రం' చూసినవారెవ్వరూ మద్దాలి శివారెడ్డి అన్న పేరును మర్చిపోరు. ఆ పాత్రను అద్భుతంగా పండించిన రవి కిషన్‌నీ మర్చిపోరు. మనకి విలన్‌గా దగ్గరైన ఈ భోజ్‌పురి హీరో... తన కూతుర్ని కూడా తన బాటలోనే నడిపిస్తున్నాడు. ఆమెను ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నాడు. అదీ బాలీవుడ్ సినిమాతో. సీనియర్ నటి పద్మినీ కొల్హాపురి కొడుకు ప్రియాంక్ హీరోగా రూపొందుతున్న 'సాబ్ కుశల్ మంగల్' మూవీతో రవికిషన్ కుమార్తె రివా హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తోంది. చాలా కాలంగా ఆమె యాక్టింగ్‌తో పాటు డ్యాన్స్‌లో కూడా శిక్షణ తీసుకుంటోంది. మంచి సమయం చూసి ఆమెను వెండితెరకు పరిచయం చేయాలనుకున్న రవికిషన్... దర్శకుడు కరణ్ కశ్యప్ చెప్పిన కథ నచ్చడంతో వెంటనే ఓకే అన్నాడు. నిజానికి బాలీవుడ్‌లో ఆఫర్ రావడం, అందులోనూ తొలి సినిమాకే ఆ చాన్స్ కొట్టేయడం అంత తేలికేమీ కాదు. అలాంటిది రివా తొలి అడుగే అక్కడ వేయబోతోంది. మరి తండ్రిలాగే ఆమె కూడా మంచి పర్‌ఫార్మర్ అనిపించుకుంటుందో లేక తండ్రినే మించిపోతుందో.

చాలా ఇష్టపడి చేశా: అనసూయ



'క్షణం'లో కీలక పాత్రలో కనిపించి, 'రంగస్థలం'లో రంగమ్మత్తగా అలరించి, 'ఎఫ్ 2'లోని ఒక పాటలో మెరిసి మనసులు దోచింది అనసూయ. వైఎస్సార్ బయోపిక్ 'యాత్ర'లో కూడా ఒక కీలక పాత్రలో కనిపించనుంది. ఇవన్నీ ఒకెత్తయితే... 'కథనం' సినిమా ఒకెత్తు. ఎందుకంటే ఇందులో ఆమె హీరోయిన్. బి.నరేంద్రరెడ్డి, శర్మ చుక్కా సంయుక్తంగా నిర్మిస్తోన్న ఈ చిత్రానికి రాజేష్ నాదెండ్ల దర్శకుడు. అవసరాల శ్రీనివాస్, రణధీర్, ధనరాజ్ ఇతర ప్రధాన పాత్రల్లో కనిపిస్తారు. టాకీ పార్ట్ పూర్తయిన సందర్భంగా అనసూయ మాట్లాడుతూ... 'ఫస్ట్ టైమ్ హీరోయిన్‌గా చేస్తున్నాను. అసోసియేట్ డైరెక్టర్ పాత్రలో కనిపిస్తాను. చాలా ఇష్టపడి చేశాను. ప్రేక్షకులు నన్ను ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అన్నారు. 'ఇప్పటివరకు నేను హీరోకి ఫ్రెండ్‌గానే నటించాను. మొదటిసారి హీరోయిన్‌కి ఫ్రెండ్‌గా నటిస్తున్నాను' అన్నారు నటుడు ధనరాజ్. 'ఫిలిం డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్న నేను మంగళ సినిమాకి పార్ట్ టైమ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నాను. ఈ సినిమాతో ఫుల్ టైమ్ నిర్మాతగా మారాను. ఒక డిస్ట్రిబ్యూటర్‌గా కథ ఎలా ఉంటే బాగుంటుందో నాకు తెలుసు. ఈ సినిమా పెద్ద హిట్ అవుతుంది' అన్నారు నిర్మాత నరేందర్‌రెడ్డి. దర్శకుడు మాట్లాడుతూ 'రెండు పాటలు మినహా టాకీ పార్ట్ పూర్తయ్యింది. సమ్మర్‌లో రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నాం. మా ప్రొడ్యూసర్ గారు ఏ సినిమా డిస్ట్రిబ్యూట్ చేసినా బంగారమే. ఈ సినిమా కూడా కచ్చితంగా హిట్ అవుతుంది' అన్నారు.

మెప్పించే వల్లభుడు



తనిష్క్ రెడ్డి, మేఘ్లా ముక్తా ప్రధాన పాత్రల్లో శివ గణేశ్ రూపొందించిన 'సకల కళా వల్లభుడు' ఫిబ్రవరి 1న విడుదల కానున్న సందర్భంగా మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాతలు అనిల్, శ్రీకాంత్ మాట్లాడుతూ... 'యాక్షన్, కామెడీతో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌ని మెప్పించే అంశాలూ ఉంటాయి. కథ, కథనాలతో పాటు హీరో నటన కూడా హైలైట్. అందరూ కొత్తవారే అయినా అద్భుతంగా నటించారు. హీరో అయితే బెస్ట్ పర్‌ఫార్మెన్స్ ఇచ్చాడు. అతనితో మరిన్ని సినిమాలు చేస్తాం' అన్నారు. సినిమా చాలా బాగా వచ్చిందని, తప్పక హిట్ అవుతుందని దర్శకుడు నమ్మకాన్ని వ్యక్తం చేశాడు. దర్శకుడితో పాటు టెక్నీషియన్స్ అందరూ క్వాలిటీ కోసం తపన పడ్డారని, అది సినిమాలో కనిపిస్తుందని అన్నాడు హీరో తనిష్క్. నటుడు రాజేంద్ర కుమార్, నటి అలెక్సా, సంగీత దర్శకుడు అజయ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ట్విటర్ టాక్



"జీవితంలో గెలుపు అనేది మనం ఓడిపోవడానికి నిరాకరించినప్పుడే మన దగ్గరికొస్తుంది. మన లక్ష్యం గట్టిదైనప్పుడు ఎటువంటి అవరోధమైనా పక్కకి తొలగిపోతుంది. అసలు నా దృష్టిలో గెలుపోటములనేవి మనల్ని ఉత్సాహపర్చి, మరింత ఉన్నత లక్ష్యం వైపు నడిపించే అంశాలు మాత్రమే."

– మల్లికా శెరావత్, బాలీవుడ్ నటి

ఆన్ లొకేషన్



మహిళా పాత్రధారులే ప్రధానంగా సుందర్ బాలు నిర్మిస్తూ దర్శకత్వం వహిస్తోన్న తమిళ చిత్రం 'కన్ని తీవు'. వరలక్ష్మీ శరత్ కుమార్, ఆష్నా జవేరీ, సుభిక్ష, ఐశ్వర్యాదత్తా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఆ షూటింగ్ లొకేషన్లో కో ఆర్టిస్టులు, టెక్నీషియన్లతో వరలక్ష్మి.

గప్‌చుప్



శృంగార తార మన సినిమాల్లో ఏంటి అన్నవారంతా షాకయ్యేలా ఆఫర్లు అందుకుంటోంది సన్నీ లియోన్. హిందీ, తెలుగు, కన్నడ, మలయాళ, తమిళ చిత్రాల్లో చాన్సులు సంపాదిస్తోంది. ఇప్పుడు హాలీవుడ్ సినిమాలో కూడా నటించే సూచనలు కనిపిస్తున్నాయి. మార్వెల్ యూనివర్స్ సంస్థ తీయబోయే 'అవెంజర్స్... ది ఎండ్ గేమ్'లో ఒక భారతీయ సూపర్ హీరోను పెట్టాలని మొదట ప్లాన్ చేశారట. అయితే తర్వాత హీరో కంటే హీరోయిన్ అయితే బెటరని ఫిక్సయ్యారట. ఆ అవకాశం సన్నీని వరించనుందని టాక్. ఆమె మూలాలు భారత్‌లో ఉండటంతో పాటు ఆమె హాలీవుడ్‌కి కూడా సూటవుతుందనే అలా డిసైడయ్యారట. అదే నిజమైతే సన్నీకి తిరుగు లేనట్టే.

ఫొటో ఫీస్ట్



'ఎఫ్ 2' విజయానందమో లేక విహరించాలన్న ఉత్సాహమో తెలియదు కానీ... కొద్ది రోజులుగా రకరకాల ప్రదేశాలు చుట్టేస్తూ ఎంజాయ్ చేస్తోంది మెహ్రీన్. తన కంటికి నచ్చిన ప్రతిదానీ్న క్లిక్‌మనిపిస్తోంది. లేత గులాబీల అందాన్ని ఆమె ఫొటో తీస్తుంటే, ఆమె అందాన్ని ఎవరో ఫొటోలో బంధించారు.

నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.395	రూ.4.55
వరంగల్	రూ.397	రూ.4.55

సెన్సెక్స్ 1.25 35,591

నిఫ్టీ 0.4 10,651.8

కదలని ఇండెక్స్‌లు

ఫ్లాట్‌గా ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

ముంబై : జనవరి డెరివేటివ్ సిరీస్ గడువు ముగియనుండటం, కేంద్ర బడ్జెట్, అమెరికా ఫెడ్ పాలసీ వంటి కీలక పరిణామాల నేపథ్యంలో దేశీయ స్టాక్ సూచీలు బుధవారం ఫ్లాట్‌గా ముగిశాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ స్వల్పంగా 1.25 పాయింట్లు నష్టపోయి 35,591.25 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 0.4 పాయింట్ నష్టంతో 10,651.80 వద్ద క్లోజైంది. ప్రారంభంలో సెన్సెక్స్ 200 పాయింట్ల మేర ర్యాలీ జరిపి, అనంతరం 359 పాయింట్ల మేర



కిందకి పడింది. చివరికి ఫ్లాట్‌గా ముగిసింది. రంగాల వారీగా మెటల్, బ్యాంకింగ్ స్టాక్స్ ఎక్కువగా లాభపడ్డాయి. ఎఫ్‌ఎంసీజీ, రియాల్టీ స్టాక్స్ ఒత్తిడిలో కొనసాగాయి. ఇండెక్స్‌లో హెవీ వెయిట్‌గా ఉండే ఐసీఐసీఐ బ్యాంక్, టాటా స్టీల్ షేర్లు 5 శాతానికి పైగా ఎగిశాయి. అమెరికా, చైనా ట్రేడ్ చర్చల నేపథ్యంలో గ్లోబల్ షేర్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి.



నాలుగున్నరేళ్లలో ₹1.47 లక్షల కోట్లు

హైదరాబాద్, వెలుగు

అమెజాన్ ఆసియాలోనే అతిపెద్ద ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ ను త్వరలోనే హైదరాబాద్ లో ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ సెక్రెటరీ జయేష్ రంజన్ తెలిపారు. బుధవారం జరిగిన ఫిక్కీ జాతీయ కార్యవర్గ సమావేశానికి జయేష్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణలో కంపెనీలు ప్రారంభించడానికి ముందుకువస్తే 15 రోజుల్లోనే అన్ని రకాల అనుమతులు ఇచ్చేలా టిఎస్ ఐపాస్ కృషి చేస్తోందని అన్నారు. ఇప్పటివరకు 8 వేలకు పైగా క్లియరెన్సులు ఇచ్చామని, ఈ నాలుగున్నరేళ్లలో రాష్ట్రానికి 2,100 కోట్ల డాలర్ల (1.47 లక్షల కోట్ల రూపాయిలు) పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. పెద్ద కంపెనీలతో పాటు ఎంఎస్‌ఎంఈ లకు కూడా పెద్దపీట వేస్తున్నామని దీన్లో భాగంగా 375 ఎకరా

- తెలంగాణకు వెల్లువెత్తుతున్న పెట్టుబడులు
- అతి పెద్ద అమెజాన్ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ త్వరలో పూర్తి

ల్లో గ్రీన్ ఎమ్ఎస్ఎమ్ఈ పార్క్ ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మేక్ఇన్ తెలంగాణ లో భాగంగా ఎలక్ట్రానిక్, ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్ టైల్ పార్కులను కూడా ఏర్పాటు చేయడానికి రూపకల్పన జరిగిందని అన్నారు. కంపెనీలకు 15 రోజుల్లో అనుమతులు రాకుంటే కారణాలను అన్వేషించి ఏ అధికారి వల్ల అనుమతి ఆలస్యం జరిగిందో అతని వేతనం నుండి ఆలస్యం అయిన పనిదినాలకు కోత విధిస్తున్నామని, ఫలితంగా పనితనం మరింత మెరుగుపడిందని జయేష్ రంజన్ తెలిపారు.

అవకాశాలు మెండు

పరిశ్రమలను ఏర్పాటుచేయడానికి తెలంగాణ అనువైన ప్రాంతమని పరిశ్రమలు, ఐటి శాఖ సెక్రెటరీ జయేష్ రంజన్ తెలిపారు. లక్షా 50 వేల ఎకరాల ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండడంతో పాటు 24 గంటల కరెంటు సదుపాయం, ఇండస్ట్రీ ఫ్రెండ్లీ ప్రభుత్వం వంటివి తెలంగాణ ప్రభుత్వానికి కలిసివచ్చే అంశాలని అన్నారు. టాస్క్ (తెలంగాణ అకాడెమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ద్వారా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా స్కిల్డ్ మాన్ పవర్ ను అందిస్తున్నామని అన్నారు. ట్రెయినింగ్ పొందిన వారు ఒకవేళ కంపెనీల అంచనాలను చేరుకోలేకపోతే మళ్లీ రీ ట్రెయిన్ చేసి కంపెనీలకు అందిస్తామని చెప్పారు. 15 రోజుల్లో పరిశ్రమలకు కావల్సిన అన్ని అనుమతులను మంజూరు చేస్తున్నామని, ప్రభుత్వం పరిశ్రమల మధ్య పూర్తి స్నేహపూర్వక వాతావరణం తేగలిగామని తెలిపారు. ఓఆర్ఆర్ (ఔటర్ రింగ్ రోడ్) తో పాటు ఆర్ఆర్ఆర్ (రీజనల్ రింగ్ రోడ్) ను కూడా ఏర్పాటుచేయడంతో సిటీ వెలుపల ఉన్న పరిశ్రమలకు కనెక్టివిటీ మరింత సులభతరం అవుతుందని అన్నారు.

125 ఎకరాల్లో లాజిస్టిక్స్ పార్కులు

ఇప్పటికే తెలంగాణలో 150 మిలియన్ డాలర్ల మేర పెట్టుబడి తో టెక్నికల్ టెక్స్‌టైల్ పరిశ్రమను ప్రారంభించిన వెల్‌స్పన్, ఇప్పుడు లాజిస్టిక్స్ పార్క్ ను ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. ఇందుకు గాను తెలంగాణ ప్రభుత్వం 100 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. గత నెల అదానీ పోర్ట్స్ శంషాబాద్ వద్ద ఏరోస్పేస్ పార్క్ ను ఏర్పాటు చేయగా, మరో 25 ఎకరాల స్థలంలో లాజిస్టిక్స్ పార్క్ ను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. వీటికోసం ఇప్పటికే వెల్‌స్పన్, అదానీ పోర్ట్స్ లు తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. సోమాని సంస్థ తమ 5 వ తయారీ కేంద్రాన్ని ఏర్పాటుచేయడానికి ముందుకు వచ్చింది. ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ ఆసియాలోనే తమ అతిపెద్ద ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ ను ప్రారంభించేందుకు హైదరాబాద్ నే ఎంచుకుంది. 30 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటుచేస్తున్న ఈ సెంటర్ ప్రస్తుతం నిర్మాణదశలో ఉండగా, ఏప్రిల్ కల్లా పూర్తికానుంది. హాస్పిటాలిటీ దిగ్గజం ఓయో త్వరలోనే తమ హైదరాబాద్ టెక్నాలజీ సెంటర్ నుండి వెడ్డింగ్, హాలిడే ప్యాకేజీల వంటి బి2బి సేవలను విస్తరించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇండియా మొత్తం మీద చూస్తే పెట్టుబడుల ప్రతిపాదనల కన్వర్షన్ రేటు 60-70 శాతం ఉండగా, తెలంగాణ కు వచ్చిన పెట్టుబడుల ప్రతిపాదనలలో కన్వర్షన్ రేటు 90-95 శాతంగా ఉంటోందని, దీనిని బట్టి రాష్ట్ర ప్రభుత్వ సామర్థ్యాన్ని అర్థం చేసుకోవచ్చని జయేష్ రంజన్ పేర్కొన్నారు.

ఇక్కడే ఫాక్స్‌కాన్ ఆర్&డి సెంటర్

ఫాక్స్‌కాన్ ఇండస్ట్రియల్ ఇంటర్నెట్ కంపెనీ లిమిటెడ్ హైదరాబాద్ లో అడ్వాన్స్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆర్&డి సెంటర్ ను ఏర్పాటుచేయనుంది. తైవాన్ కు చెందిన ఫాక్స్‌కాన్ టెక్నాలజీ గ్రూప్ కు ఈ సెంటర్ ద్వారా టెక్నాలజీ సేవలతో పాటు స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్ సొల్యూషన్స్ వంటివి అందించనుంది. క్లౌడ్ కంప్యూటింగ్, మొబైల్ డివైజెస్, ఐవోటీ, బిగ్ డేటా, ఏఐ, నెట్‌వర్క్ ట్రాన్స్మిషన్ తో పాటు ఆటోమేటెడ్ రోబోటిక్స్ వంటి టెక్నాలజీల



మీద హైదరాబాద్ సెంటర్ దృష్టి పెడుతుంది. వివిధ టెక్నాలజీల అనుసంధానం మీదా ఈ సెంటర్ పనిచేస్తుంది. పరిశోధనఅభివృద్ధి కార్యకలాపాల కోసం స్థానిక పరిశ్రమలు, రిసెర్చ్ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుని ఈ సెంటర్ ను ఏర్పాటు చేయనున్నట్లు ఫాక్స్‌కాన్ తెలిపింది. ఏఐ ఆర్ అండ్ డీ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన అవగాహన ఒప్పందం మీద తెలంగాణ ఎలక్ట్రానిక్స్ డైరెక్టర్ సుజయ్ కారంపూరి, ఫాక్స్‌కాన్ అధికారులు బుధవారం సంతకాలు చేశారు. ఆర్&డి సెంటర్ ఏర్పాటుకోసం ఐఐటి, ఐఐఐటి, బిట్స్ ను సందర్శించిన ఫాక్స్‌కాన్ ప్రతినిధులు మరోసారి ఫిబ్రవరి మూడో వారంలో ఇక్కడకు వచ్చి, తమ ఆర్&డి సెంటర్ కు సంబంధించిన పూర్తి వివరాలు ప్రకటిస్తారు.

ప్రతి 5 షేర్లకి ఒక షేర్ ఎన్‌టీపీసీ బోనస్

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థ ఎన్‌టీపీసీ బోనస్ ఇష్యూ ప్రకటించింది. ప్రతి అయిదు వాటాలకు ఒకటి చొప్పున బోనస్ షేర్లను జారీ చేసే ప్రతిపాదనను డైరెక్టర్ల బోర్డు ఆమోదించింది. ఈ ప్రతిపాదనకు వాటాదారుల ఆమోదం లభించాల్సి ఉంటుంది. డిసెంబర్ 2018 తో ముగిసిన మూడో క్వార్టర్‌లో ఎన్‌టీపీసీ లాభం రూ. 2,385 కోట్ల వద్దే నిలిచిపోయింది. ఇంధన వ్యయంతోపాటు, అప్పుల మీద వడ్డీ వ్యయం పెరగడమే లాభం పెరగకపోవడానికి కారణాలని కంపెనీ తెలిపింది. వాటాదారులకు 35.80 శాతం ఇంటరిమ్ డివిడెండ్ చెల్లించాలని కూడా ఎన్‌టీపీసీ డైరెక్టర్ల బోర్డు నిర్ణయించింది. ఈ ఇంటరిమ్ డివిడెండ్‌ను ఫిబ్రవరి 14 న చెల్లించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. అంతకు ముందు ఏడాది ఇదే త్రైమాసికంలో కంపెనీకి రూ. 2,361 కోట్ల నికర లాభం వచ్చింది. డిసెంబర్ 2018 తో అంతమైన క్వార్టర్‌లో మొత్తం ఆదాయం మాత్రం 15.27 శాతం పెరిగి రూ. 24,308 కోట్లకు చేరింది.



ఫిలిప్పీన్స్‌లో అడుగుపెట్టిన ఓయో

న్యూఢిల్లీ: హాస్పిటాలిటీ సంస్థ ఓయో తన ఆపరేషన్స్‌ను ఫిలిప్పీన్స్‌లో లాంచ్ చేసింది. 21కి పైగా ఫ్రాంఛైజ్, లీజ్ హోటల్స్‌తో ఓయో ఫిలిప్పీన్స్‌లోకి అడుగుపెట్టింది. ఓయోకు ఫిలిప్పీన్స్ 8వ మార్కెట్. ఇండియాతో పాటు ప్రస్తుతం చైనా, మలేసియా, నేపాల్, యూకే, యూఏఈ, ఇండోనేషియాల్లో ఓయో తన కార్యకలాపాలను సాగిస్తోందని కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. ఫిలిప్పీన్స్‌లో వచ్చే కొన్నేళ్లలో 5 కోట్ల డాలర్లకు పైగా పెట్టుబడి పెట్టాలని నిర్ణయించినట్టు ఓయో చెప్పింది. వెయ్యి మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు కూడా కల్పించనున్నట్టు పేర్కొంది. ఫిలిప్పీన్స్‌లో ఓయో అడుగుపెట్టడం, ఆగ్నేయాసియాలో తమ విజన్‌ను బలోపేతం చేసుకునేందుకు దోహద పడుతుందని ఓయో హోటల్స్, హోమ్స్ సీఓఓ అభినవ్ సిన్హా తెలిపారు. ఫిలిప్పీన్స్‌లో 21 హోటల్స్, 500 రూమ్స్‌తో ఉన్న ఓయో, 2020 నాటికి 10 నగరాల్లో 20వేల రూమ్స్‌కు విస్తరించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు సిన్హా చెప్పారు. ఫిలిప్పీన్స్‌ను సందర్శించే లోకల్, ఇంటర్నేషనల్ సందర్శకులకు ఓయో హోజ్‌హోల్డ్ నేమ్‌గా మారబోతుందన్నారు.

నెంబర్ ‘వన్’ ప్లస్సే

న్యూఢిల్లీ :

ఇండియా ప్రీమియం స్మార్ట్‌ఫోన్‌మార్కెట్‌లో చైనాకు చెందిన వన్‌ప్లస్ కంపెనీ అదరగొట్టింది. సింగిల్ క్వార్టర్‌లోనే (డిసెంబర్‌తో ముగిసిన క్వార్టర్‌లో) వన్‌ప్లస్, అత్యధిక షిప్‌మెంట్లతో 36 శాతం మార్కెట్ షేరును సొంతం చేసుకుంది. దీంతో వరుసగా మూడు క్వార్టర్‌లలో ప్రీమియం స్మార్ట్‌ఫోన్ సెగ్మెంట్‌లో వన్‌ప్లస్ తిరుగులేని బ్రాండ్‌గా అవతరించింది. షిప్‌మెంట్లు, రిటైల్ విలువలో 2018 అంతా వన్‌ప్లస్ 6 బెస్ట్ సెల్లింగ్ స్మార్ట్‌ఫోన్‌గా ఉన్నట్టు, వన్‌ప్లస్ 6టీ రెండో స్థానంలో నిలిచినట్టు కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ అనలిస్ట్ కరణ్ చౌహాన్ తెలిపారు. ఈ రెండు ఫోన్ల తర్వాత శాంసంగ్ ఎస్9 ప్లస్ నిలిచింది. డిసెంబర్‌తో ముగిసిన క్వార్టర్‌లో శాంసంగ్ కేవలం 26 శాతం షేరును మాత్రమే పొందింది.

అయితే గతేడాది మొత్తంగా చూసుకుంటే, ప్రీమియం స్మార్ట్‌ఫోన్ సెగ్మెంట్ 8 శాతం వృద్ధిని నమోదు చేసిందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ వెల్లడించింది. అయితే ఈ సెగ్మెంట్‌లో 2018లో 34 శాతం షేరుతో శాంసంగ్ కంపెనీనే మొదటిస్థానంలో ఉంది. దాని తర్వాత వన్‌ప్లస్ 33 శాతం షేరుతో రెండో స్థానాన్ని దక్కించుకున్నట్టు కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ తెలిపింది. 23 శాతం షేరుతో ఆపిల్ మూడో స్థానానికి పరిమితమైంది. శాంసంగ్ కొత్తగా లాంచ్ చేసిన గెలాక్సీ ఏ9 వన్‌ప్లస్‌కు డైరెక్ట్ పోటీని ఇస్తోంది. ఇది ప్రపంచంలోనే తొలి క్వాడ్ రియర్ కెమెరా ఫోన్‌గా రూ.30వేల నుంచి రూ.40వేల రేంజ్‌లో మార్కెట్‌లోకి వచ్చింది. నాలుగో క్వార్టర్‌లో మొత్తం ప్రీమియం మార్కెట్‌లో టాప్ త్రీ బ్రాండ్స్ వన్‌ప్లస్, ఆపిల్, శాంసంగ్‌లు కలిపి 92 శాతం వాటాను ఆక్రమించాయి. గత కొన్ని క్వార్టర్ల నుంచి యూజర్ అనుభవాన్ని మెరుగుపర్చేందుకు పలు రకాల చర్యలు తీసుకుంటున్నామని వన్‌ప్లస్ ఇండియా జనరల్ మేనేజర్ వికాస్ అగర్వాల్ చెప్పారు. మేజర్ సిటీల్లో సొంత స్టోర్లను ఏర్పాటు చేయడం కోసం ప్రస్తుతం ఇండియాలో భారీగా పెట్టుబడులు పెడుతున్నట్టు కూడా చెప్పారు. సర్వీసు సెంటర్ నెట్‌వర్క్‌ను కూడా విస్తరిస్తున్నట్టు పేర్కొన్నారు. అమ్మకాల సంఖ్య పరంగా 2018లో వన్‌ప్లస్ 58 శాతం వృద్ధిని నమోదు చేసిందని తెలిపారు. ఈ ఏడాది కూడా ఇదే రకమైన వృద్ధిని రికార్డు చేస్తామన్నారు.

- ఇండియా మార్కెట్లో వన్‌ప్లస్ అదరగొట్టింది
- డిసెంబర్ క్వార్టర్‌లో బెస్ట్ సెల్లింగ్ స్మార్ట్‌ఫోన్‌గా వన్‌ప్లస్ 6
- గతేడాది ప్రీమియం స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 8% వృద్ధి



ఆపిల్ షిప్‌మెంట్లు తగ్గాయి...

డిసెంబర్ క్వార్టర్‌లో ఆపిల్ ప్రీమియం సెగ్మెంట్ షిప్‌మెంట్లు 25 శాతానికి తగ్గాయి. కొత్త ఐఫోన్లను ఇంకా దిగుమతి చేసుకుంటుండటంతో పాటు, వాటికి 20 శాతం దిగుమతి సుంకం చెల్లిస్తోంది. దీంతో ధరలు అత్యధికంగా ఉండి, షిప్‌మెంట్లు తగ్గిపోతున్నాయి. ధరలు తగ్గించడానికి ప్రస్తుతం ఆపిల్ ఇండియాలోనే తన ఐఫోన్లను తయారు చేయాలనుకుంటోంది. ఈ తయారీని ఈ ఏడాది నుంచే ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది.



క్లోవ్ డెంటల్ సేవలు విస్తృతం

హైదరాబాద్, వెలుగు: డెంటల్ కేర్ క్లినిక్ చెయిన్ క్లోవ్ డెంటల్ తమ సేవలను మరింత విస్తరించనుంది. 2011 లో ప్రారంభించిన క్లోవ్ డెంటల్ కు ప్రస్తుతం దేశవ్యాప్తంగా 308 క్లినిక్స్ ఉండగా, 2020-21 నాటికి 600 డెంటల్ క్లినిక్స్ ను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు క్లోవ్ డెంటల్ ఫౌండర్ అండ్ సీఈవో అమరిందర్ సింగ్ తెలిపారు. డెంటల్ డిసీజెస్ అల్జీమర్స్, గుండె సంబంధిత వ్యాధులు, ప్రీమెచ్యూర్ డెలివరీ తో పాటు నోటి క్యాన్సర్ వంటి వాటికి నేరుగా లింక్ అయి ఉంటుందని, డెంటల్ డిసీజెస్ విషయంలో అశ్రద్ధ మంచిది కాదని అన్నారు. వీటిపై అవగాహన పెంచేందుకు స్కూల్స్, కార్పోరేట్స్ తో పాటు పలు సొసైటీలతో కలిసి అవేర్‌నెస్ క్యాంప్ లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ కంపెనీ యేటా 190 శాతం వృద్ధి సాధిస్తోందని, గత యేడాది 4 లక్షల మందికి వైద్యం అందించినట్లు చెప్పారు. హైదరాబాద్ లో 45 క్లినిక్స్ ఉన్నాయని, ఒక్కో క్లినిక్ లో 6,7 మంది డాక్టర్లు ఉంటారని వెల్లడించారు. 90 శాతం భారతీయులకు దంత సమస్యలు ఉన్నాయని, దీన్లో 20 శాతం లోపే డాక్టర్ వద్దకు వస్తున్నారని అన్నారు. ప్రస్తుతం అవగాహన పెరుగుతూ వస్తోందని సింగ్ తెలిపారు. తాము బ్రాండెడ్ ఉత్పత్తులనే వాడుతామని, పరికరాలను విదేశాలనుండి దిగుమతి చేసుకుంటామని అన్నారు.

హోండా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

హైదరాబాద్, వెలుగు: యువతలో మరింత నైపుణ్యాన్ని పెంచడం కోసం హోండా మోటర్‌సైకిల్ సంస్థ తెలంగాణ ప్రభుత్వ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్ డైరెక్టరేట్ తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీన్లో భాగంగా హైదరాబాద్ లోని ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఇన్స్టిట్యూట్ (ఐటిఐ) లో హోండా నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. వెహికిల్ మెయింటెనెన్స్, రిపెయిర్ వంటివాటికి సంబంధించిన పలు అంశాలపై నైపుణ్యాన్ని పెంచాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు హోండా కస్టమర్ సర్వీసెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రదీప్ పాండే తెలిపారు. దీంతోపాటు హోండా సర్వీస్ వర్క్‌షాప్స్ లో ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ను ఇస్తామని చెప్పారు. 2020 నాటికి బీఎస్6 ఉద్గార ప్రమాణాలను యూరోప్ కన్నా ముందుగా భారత్ అనుసరించబోతోందని, దీనికి అత్యంత సాంకేతిక నైపుణ్యం అవసరమని అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఈ శిక్షణా కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిపారు.

డేటా యాక్సెస్ ఇస్తే.. 20 డాలర్లిస్తాం

యువతకు ఫేస్‌బుక్ వల ● సీక్రెట్‌గా 2016 నుంచి సాగుతున్న వ్యవహారం

శాన్‌ఫ్రాన్సిస్కో: ఫేస్‌బుక్ సీక్రెట్ వ్యవహారం మరోసారి వీధికెక్కింది. టీనేజర్లు తమ డేటా యాక్సెస్‌ను ఫేస్‌బుక్‌కు కల్పిస్తే, గుట్టుచప్పుడు కాకుండా ఆ యువతకు 20 డాలర్లను అంటే మన కరెన్సీ ప్రకారం రూ.1423ను చెల్లిస్తుందట. దీని కోసం ‘ఫేస్‌బుక్ రీసెర్చ్’ వర్చ్యువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ (వీపీఎన్)ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని యూజర్లకు సూచిస్తోందని టెక్ క్రంచ్ రిపోర్టు చేసింది. ఈ యాప్ ఇన్‌స్టాలేషన్‌తో కంపెనీ తేలికగా యూజర్ల డేటా యాక్సస్ పొందుతోందని తెలిపింది. దీంతో యూజర్ల ఫోన్ యాక్టివిటీని అనాలసిస్ చేయడం, డీక్రిప్ట్ చేయడం చేస్తోందని టెక్‌క్రంచ్ రిపోర్టు చేసింది. ఇది ఆపిల్ పాలసీని ఉల్లంఘించడం కిందకే వస్తుందని చెప్పింది.

టెక్ క్రంచ్ రిపోర్టు ప్రకారం ఈ సోషల్ మీడియా దిగ్గజం డేటాను సమీకరించేందుకు రీసెర్చ్ ప్రొగ్రామ్‌ను రన్ చేస్తుందని, ఈ ప్రొగ్రామ్ ఆపివేసే ఉద్దేశ్యాలేమీ ఆ కంపెనీకి లేవని పేర్కొంది. ఈ యాప్ అచ్చం ఫేస్‌బుక్ ఓనావో ప్రొటెక్ట్ యాప్ మాదిరిదే



నట. దీన్ని ఆపిల్ జూన్‌లో బ్యాన్ చేయగా.. ఆగస్టులో పూర్తిగా తొలగించేసింది. యువత తమ ఐఓఎస్, ఆండ్రాయిడ్‌లో ‘ఫేస్‌బుక్ రీసెర్చ్’ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని ప్రైవసీని విక్రయిస్తే నెలకు 20 డాలర్లు చెల్లిస్తుందని టెక్‌క్రంచ్ తెలిపింది. సాధారణంగా 13 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వారిని దీని కోసం వాడుకుంటోంది. 2016 నుంచి ఈ వ్యవహారం సాగిస్తోంది. అదేవిధంగా యూజర్లు తమ అమెజాన్ ఆర్డర్ హిస్టరీ పేజీని కూడా స్క్రీన్‌షాట్ తీసి పంపాలని ఫేస్‌బుక్ అడుగుతోంది. కాగా, గత ఏడాది కాలంగా ఫేస్‌బుక్ డేటా స్కాంలతో తీవ్ర సతమతమవుతోంది. కేంబ్రిడ్జ్ అనలిటికా డేటా స్కాండల్ వెలుగులోకి వచ్చిన తర్వాత, ఫేస్‌బుక్ పెద్ద ఎత్తునే మూల్యం చెల్లించుకుంది. ఐనా, ఇప్పటికీ ఫేస్‌బుక్‌లో డేటా స్కాంలు వెలుగుచూస్తూనే ఉన్నాయి.

బంగారం రూ.34 వేలు దాటేసింది

అంతర్జాతీయ పరిణామాలతో ఆకాశాన్నంటుతున్న పుత్తడి

న్యూఢిల్లీ :

బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అంతర్జాతీయ పరిణామాలతో దేశీయంగా బంగారం ధర భారీగా పెరిగింది. బుధవారం బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ.34,000 మార్కును దాటేసింది. ఒక్కరోజే రూ.320 పెరిగి రూ.34,070గా రికార్డయింది. బంగారం ధరలు వరుసగా మూడు రోజుల నుంచి పెరుగుతూనే ఉన్నాయి. గత మూడు రోజుల్లో రూ.800 మేర బంగారం ధర పెరిగింది. బంగారంతో పోటాపోటీగా వెండి ధర కూడా ఎగుస్తోంది. కేజీ వెండి ధర రూ.330 పెరిగి రూ41,330కు చేరింది.

డాలర్ స్తబ్దుగా ఉండటంతో, గ్లోబల్ మార్కెట్‌లో కూడా బంగారం ధర బుధవారం ఎనిమిది నెలల గరిష్టానికి చేరింది. ఫెడరల్ రిజర్వు పాలసీ నిర్ణయం, అమెరికా, చైనాల మధ్య ట్రేడ్ చర్చలు బంగారం ధర పెరగడానికి దోహదం చేస్తున్నాయి. చైనాకు చెందిన హువావే టెక్నాలజీస్‌కు వ్యతిరేకంగా క్రిమినల్ ప్రొసీ



డింగ్స్ ప్రారంభించడంతో, అమెరికా, చైనాల మధ్య ట్రేడ్ చర్చలపై అనిశ్చితి ఏర్పడింది. ఇది బంగారం ధరలకు మంచి బూస్ట్ నిచ్చింది.

అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర 0.1 శాతం పెరిగి ఒక ఔన్స్‌కు 1,312.51 డాలర్లను టచ్ చేసింది. దేశ రాజధాని ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ.320 పెరిగి రూ.34,070గా... 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ.33,920గా నమోదయ్యాయి.

పేటీఎం చేతికి నైట్‌స్టే

న్యూఢిల్లీ : డిజిటల్ దిగ్గజం పేటీఎం తన ప్లాట్‌ఫామ్‌పై హోటల్ బుకింగ్ సర్వీసులను లాంచ్ చేసింది. దీని కోసం హోటల్ బుకింగ్ యాప్ ‘నైట్‌స్టే’ను రూ.142 కోట్లకు పేటీఎం కొనుగోలు చేసింది. చివరి నిమిషాల్లో లగ్జరీ హోటల్స్‌లో బుకింగ్స్‌ను ఇది ఆఫర్ చేస్తుంది. అలీబాబా పెట్టుబడి పెట్టిన ఈ యాప్, తన ట్రావెల్ బిజినెస్‌లను విస్తరిస్తోంది. ట్రావెల్ ఆపరేషన్స్ విస్తరణకు రూ.500 కోట్లను పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్టు పేటీఎం చెప్పింది. బడ్జెట్, లగ్జరీ, బిజినెస్ సెగ్మెంట్‌లో 5వేలకు పైగా హోటల్స్‌తో పేటీఎం భాగస్వామ్యమైంది. దీని హోటల్ పార్టనర్స్‌లో సరోవర్, జురి, ట్రీబో, జింజర్, స్టెర్లింగ్, రేసార్ట్స్ వంటివి ఉన్నాయి. 20 లక్షల హోటల్స్‌తో భాగస్వామ్యం ఏర్పరుచుకుని, 2020 నాటికి ఆసియాలోనే టాప్ హోటల్ బుకింగ్ డెస్టినేషన్ కావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్టు పేటీఎం చెప్పింది.

ఇప్పటికే ఆన్ డిమాండ్ హోటల్ బుకింగ్ స్పేస్‌లో ఓయో రూమ్స్ ఆధిపత్య స్థానంలో ఉంది. పేటీఎం హోటల్ బుకింగ్ సర్వీసులకు నైట్‌స్టే వ్యవస్థాపకుడు నాసర్ ఖాన్ అధిపతిగా ఉండనున్నారు. తమ ప్లాట్ ఫామ్‌పై విస్తృతమైన ట్రావెల్ సెలక్షన్‌ను ఆఫర్ చేయనున్నామని, నమ్మకస్తులైన ట్రావెల్ పార్టనర్ల సాయంతో ఈ వ్యాపారాలను విస్తరించుకోనున్నామని పేటీఎం చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ మధుర్ డియోరా చెప్పారు. పేటీఎం తన ట్రావెల్ బిజినెస్‌లను 2014లో ప్రారంభించింది. ఇప్పటి వరకు 6 కోట్లకు పైగా రైలు, బస్సు, విమాన టికెట్లను విక్రయించింది.



- రూ. 142 కోట్లతో కొనుగోలు.
- ఇక హోటల్ బుకింగ్స్ కూడా...



హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో బుధవారం ముగిసిన నేషనల్ డెఫ్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన మహారాష్ట్ర టీమ్‌కు ట్రోఫీ అందజేస్తున్న రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జి.వివేక్ వెంకటస్వామి

ఇంకొక్కటి చాలు.. న్యూజిలాండ్ గడ్డపై అతిపెద్ద సిరీస్ విజయం అందుకోవాలంటే టీమిండియా ఒక్క మ్యాచ్ గెలిస్తే చాలు. చరిత్ర సృష్టించడానికి అడుగుదూరంలో నిలిచిన సమయంలో జట్టు పగ్గాలందుకున్న రోహిత్.. హామిల్టన్‌లో రికార్డు తిరగరాయడానికి రెడీ అయ్యాడు. న్యూజిలాండ్‌తో గురువారం జరిగే నాలుగో వన్డే రోహిత్‌శర్మకు కెరీర్‌లో 200వ మ్యాచ్ కావడం విశేషం.

నేడు న్యూజిలాండ్‌తో నాలుగో వన్డే

రిజర్వ్ బెంచ్‌ను పరీక్షించే చాన్స్..!

గెలిస్తే చరిత్రే



కివీస్‌లో అతిపెద్ద విజయంపై కన్నేసిన టీమిండియా

ఉ. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..

హామిల్టన్ :

న్యూజిలాండ్ గడ్డపై అరుదైన రికార్డు సాధించేందుకు టీమిండియా అడుగుదూరంలో నిలిచింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇప్పటికే 3-0తో సొంతం చేసుకున్న టీమిండియా గురువారం ఇక్కడ జరిగే నాలుగో వన్డేలో గెలిచి ఆధిక్యాన్ని 4-0కు పెంచుకోవడంతో పాటు కివీస్ నేలపై అతి పెద్ద సిరీస్ విజయం దక్కించుకోవాలని ఆశిస్తోంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే 1967 నుంచి న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న ఇండియాకు కివీస్ గడ్డపై ఏఫార్మాట్‌లో అయినా ఇదే పెద్ద సిరీస్ విజయం కానుంది. దీంతో సెడాన్ పార్క్‌లో జరిగే ఈ మ్యాచ్‌ను ఇండియా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మరోపక్క రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లీ గైర్హాజరీలో జట్టు పగ్గాలు అందుకున్న రోహిత్‌శర్మ తన కెరీర్‌లో 200వ వన్డే ఆడబోతున్నాడు. దీంతో హామిల్టన్‌లో ఎలాగైనా గెలవాలని రోహిత్ కూడా పట్టుదలగా ఉన్నాడు. టీమిండియా ప్రస్తుత ఫామ్, న్యూజిలాండ్ జట్టు పరిస్థితిని చూస్తోంటే.. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప రోహిత్ సేన విజయాన్ని హోమ్‌టీమ్ అడ్డుకోవడం కష్టమే అనిపిస్తోంది.

తుది జట్టులో గిల్ !

ఇప్పటికే సిరీస్ సొంతం కావడం, రెగ్యులర్ కెప్టెన్ కోహ్లీకి విశ్రాంతినివ్వడంతో చివరి రెండు వన్డేల్లో రిజర్వ్ బలాన్ని పరీక్షించుకునే అవకాశం టీమిండియాకు దొరికింది. కోహ్లీ స్థానంలో యంగ్ ప్లేయర్ శుభ్‌మన్ గిల్‌కు తుది జట్టులో స్థానం దాదాపు ఖరారైనట్లే. గాయం కారణంగా మూడో వన్డేకు దూరమైన ధోనీ ప్రస్తుత పరిస్థితిపై సరైన సమాచారం లేదు. కానీ మహీ బుధవారం నెట్స్‌లో శ్రమించాడు. అయితే నాలుగో వన్డేలో ఉంటాడా లేదా అనేది ఖచ్చితంగా తెలియదు. ఒక వేళ ధోనీ ఫిట్‌గా ఉంటే అతను కోహ్లీకి రిప్లేస్‌మెంట్‌గా జట్టులో చేరతాడు. అయితే బ్యాట్స్‌మన్ స్థానాన్ని బ్యాట్స్‌మన్‌తోనే భర్తీ చేయాలని జట్టు యజమాన్యం భావిస్తే 19 ఏళ్ల గిల్ అరంగేట్రం చేయడం ఖాయం. కోహ్లీ ఆడే అనేక షాట్లను అలవోకగా ఆడే సామర్థ్యం కలిగిన గిల్.. భవిష్యత్తులో ఇండియాకు స్టార్ అవుతాడని పలువురు సీనియర్ క్రికెటర్లు ఇప్పటికే అతనిపై ప్రశంసలు కురింపించారు. మూడో వన్డే తర్వాత జరిగిన ప్రెస్‌మీట్‌లో కోహ్లీ కూడా గిల్ సత్తా గురించి మాట్లాడాడు. కెరీర్‌లో 36 లిస్ట్ ఏ మ్యాచులు ఆడిన గిల్ బ్యాటింగ్ యావరేజ్ 47.78. అంతేకాక 2018లో న్యూజిలాండ్‌లో జరిగిన ఐసీసీ అండర్-19 వరల్డ్‌కప్‌లో అతను ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. ఈ నేపథ్యంలో గిల్ అరంగేట్రం దాదాపు ఖరారైనట్లే. అయితే అతని బ్యాటింగ్ స్థానంపైనే చర్చ జరుగుతుంది. రాయుడికి విశ్రాంతినిచ్చి గిల్‌ను నాలుగో నంబర్ స్థానంలో పరీక్షించే అవకాశం కూడా ఉంది. ధోనీ, గిల్ ఇద్దరు జట్టులో ఉంటే కార్తీక్ బెంచ్‌కు పరిమితమవ్వొచ్చు. హార్దిక్ పాండ్యా, కేదార్ జాదవ్ తుది జట్టులో తమ స్థానాలను నిలబెట్టుకోనున్నారు. ఇక బౌలింగ్ విభాగం విషయానికొస్తే మూడు మ్యాచుల్లో మొత్తం 14 వికెట్లు తీసిన స్పిన్ ద్వయం చహల్, కుల్దీప్ ఈ మ్యాచ్‌లోనూ అదే జోరు చూపాలని ఆశిస్తున్నారు. అయితే ఆస్ట్రేలియా సిరీస్ నుంచి నిర్విరామంగా ఆడుతున్న మహ్మద్ షమీకి విశ్రాంతినిచ్చి ఖలీల్ అహ్మద్ లేదా మహ్మద్ సిరాజ్‌లో ఒకరిని టీమ్‌లోకి తీసుకొనే చాన్సుంది. భువీ, షమీ ఇద్దరికి విశ్రాంతినిచ్చి ఇద్దరు యువ పేసర్లను ఆడిండే అవకాశాలను కూడా కొట్టిపారేయలేం.



శుభ్‌మన్ గిల్

కివీస్‌కు బ్యాటింగే సమస్య..

ఇప్పటికే సిరీస్ కోల్పోయిన న్యూజిలాండ్ చివరి రెండు వన్డేల్లోనైనా గెలిచి పరువు దక్కించుకోవాలని ఆశిస్తోంది. అయితే అది జరగాలంటే బ్యాటింగ్ లైనప్ ముఖ్యంగా టాపార్డర్ భారీ స్కోర్లు చేయాల్సి ఉంది. ఓపెనర్లు గప్టిల్, మన్రో పరుగులు చేయడానికి అవస్థలు పడుతున్నారు. కేన్ విలియమ్సన్, రాస్ టేలర్, టామ్ లాథమ్ మంచి ఆరంభాలు సాధించినా వారికి సహకారం అందించే వారు లేకపోవడంతో భారీ స్కోర్లు చేయలేకపోతున్నారు. తొలి మూడో వన్డేల్లో కివీస్ టాప్, లోయర్ మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ పూర్తిగా ఫెయిలయ్యారు. నికోల్స్, శాంట్నర్, గ్రాండ్‌హోమ్ కూడా పెద్ద స్కోర్లు చేయలేకపోతున్నారు. ఆల్‌రౌండర్ జేమ్స్ నీషమ్ చేరికతో జట్టు బలం కాస్త పెరిగినట్లయ్యింది. నీషమ్‌తో పాటు టాడ్ ఆస్టిల్ కూడా తుది జట్టులో ఉండే అవకాశముంది. ఇక బౌలింగ్ విభాగానికొస్తే ట్రెంట్ బౌల్ట్‌కు సహకరించే బౌలరే కరువయ్యాడు. ఫెర్గూసన్‌తో పాటు బ్రేస్‌వెల్, ఇష్ సోధి.. టీమిండియా బ్యాట్స్‌మెన్‌ను అడ్డుకోలేకపోతున్నారు.

> "మ్యాచ్‌లో ఎలా ఆడాలో మా ప్లాన్ మాకుంది. అలానే ఆడతాం. మా ఓపెనర్లు రన్స్ చేయడం లేదనేది నిజం. అయితే షమీ, భువనేశ్వర్ కొత్త బంతితో అద్భుతంగా బౌలింగ్ చేస్తూ మా బ్యాట్స్‌మన్‌ను ఒత్తిడిలోకి నెడుతున్నారు"
>
> **- గారీ స్టీడ్, న్యూజిలాండ్ కోచ్**

200

రోహిత్ శర్మ ఈకెరీర్‌లో ఇది 200వ వన్డే మ్యాచ్

పిచ్/ వాతావరణం

సెడాన్ పార్క్‌లో భారీ స్కోర్లు నమోదయ్యే చాన్సుంది. వికెట్ స్పిన్నర్లుకు కూడా అనుకూలిస్తుంది. ఇక్కడ జరిగిన చివరి మూడు వన్డేల్లో 260 పైగా స్కోర్లు నమోదయ్యాయి. కివీస్ 290 టార్గెట్‌ను కూడా ఛేజ్ చేసింది. హామిల్టన్‌లో గురువారం ఉష్ణోగ్రతలు16 –29 డిగ్రీల మధ్య ఉండోచ్చు.

తుది జట్లు(అంచనా)

ఇండియా: రోహిత్(కెప్టెన్). ధవన్, రాయుడు/ గిల్, ధోనీ, కార్తీక్, జాదవ్, హార్దిక్ పాండ్యా, కుల్దీప్, చహల్, భువనేశ్వర్, షమీ/ఖలీల్
న్యూజిలాండ్ : గప్టిల్, మన్రో, విలియమ్సన్ (కెప్టెన్), రాస్ టేలర్, లాథమ్, నికోల్స్, నీషమ్, ఆస్టిల్, శాంట్నర్, బౌల్ట్, ఫెర్గూసన్

ఫీల్డింగ్ సక్సెస్‌కు శ్రీధర్ మంత్రం

కొత్త టెక్నిక్స్‌తో క్యాచింగ్ మెరుగు

హామిల్టన్:

గత కొన్నేళ్ల నుంచి టీమిండియా ఫీల్డింగ్ వరల్డ్ బెస్ట్ లెవెల్‌కు చేరుకుంది. మైదానంలో పాదరసంలా కదులుతున్న ఫీల్డర్లు.. ఎలాంటి క్యాచ్‌లనైనా అలవోకగా పట్టేస్తున్నారు. ఇదంతా ఇండియా ఫీల్డింగ్ కోచ్ ఆర్. శ్రీధర్ చలవే. కొత్త కొత్త టెక్నిక్స్‌తో టీమిండియా ఫీల్డింగ్‌ను అతను మరో స్థాయికి తీసుకెళ్లాడు. బ్లైండ్‌ఫోల్డ్ టెక్నిక్, డిఫరెంట్ వెయిట్స్‌లో ఉన్న లెదర్ బాల్స్, బ్యాటింగ్ ప్రాక్టీస్‌కు ఉపయోగించే సిములేషన్ మెషిన్ సాయంతో జట్టులో ప్రతీ ఆటగాడినీ బెస్ట్ ఫీల్డర్‌గా మార్చినట్టు హైదరాబాదీ శ్రీధర్ చెబుతున్నాడు. రియాక్షన్ టైమ్‌ను పెంచేందుకు బ్లైండ్‌ఫోల్డ్ టెక్నిక్.. మైదానంలో గాలులు వీస్తున్నప్పుడు బంతి దిశను సరిగ్గా అంచనా వేసేందుకు వివిధ రకాల బరువులలో ఉన్న లెదర్ బాల్స్.. స్లిప్ క్యాచింగ్‌ను మెరుగు పరిచేందుకు సిమ్యులేషన్ మెషిన్ సాయం తీసుకుంటున్నట్టు తెలిపాడు. 'ఇంగ్లండ్‌లో టెస్ట్ సిరీస్ సమయంలో బ్లైండ్‌ఫోల్డ్ టెక్నిక్‌ను వాడాం. ప్రధానంగా రెడ్‌బాల్ క్రికెట్ కోసం ఉపయోగించే ఈ టెక్నిక్‌లో ఒక కర్టెన్‌కు అవతలివైపు ఉన్న వ్యక్తి బంతిని విసిరితే ఇవతలి వైపు ఉన్న ఫీల్డర్ దాన్ని అందుకోవాలి. బంతి ఏ వైపు నుంచి వస్తుందో క్యాచర్‌కు తెలియదు. ఇలాంటి ప్రాక్టీస్‌తో ఫీల్డర్ రియాక్షన్ టైమ్ పెరుగుతుంది. ఆ తర్వాత ఆస్ట్రేలియాకు చేరుకోగానే టీమ్‌మేట్ అనే ప్రత్యేకమైన సిములేషన్ మెషిన్ సాయంతో స్లిప్ ఫీల్లింగ్ డ్రిల్స్ చేశాం. దాని వల్ల మెరుగైన ఫలితాలు వచ్చాయి.



ముఖ్యంగా విరాట్ కొన్ని అద్భుతమైన క్యాచ్‌లు అందుకున్నాడు. ఇక, న్యూజిలాండ్‌లో స్థిరమైన గాలులు వీస్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎక్కువ ఎత్తు నుంచి వచ్చిన బంతులను అందుకోవడం కష్టం. దీనికి కౌంటర్ ఇచ్చేందుకు ఈ వన్డే సిరీస్‌లో మేం డిఫరెంట్ వెయిట్స్ ఉన్న లెదర్ బాల్స్‌ను ఉపయోగిస్తున్నాం. వాటితో ప్రాక్టీస్ చేయడం ద్వారా గాలిలో దిశ, వేగం మారుతూ వచ్చే క్యాచ్‌లను ఎలా పట్టుకోవాలో ఆటగాళ్లు నేర్చుకున్నార'ని శ్రీధర్ చెప్పుకొచ్చాడు. ఐపీఎల్‌లోనూ ఈ విధానాలను కొనసాగించాలని పలు ఫ్రాంచైజీలు తమ ఫీల్డింగ్ స్టాఫ్‌ను కోరుతున్నారని చెప్పాడు.

నవంబర్‌లో నేషనల్ గేమ్స్!

పనాజి: గోవా ఆతిథ్యమివ్వనున్న జాతీయ క్రీడలు నవంబర్‌లో జరిగే అవకాశముంది. షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది మార్చి నెలాఖరులో పోటీలను నిర్వహించలేమని గోవా ప్రభుత్వం జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓఏ)కు లేఖ రాసింది. సార్వత్రిక ఎన్నికలు, ప్లేయర్లకు భద్రత వంటి కారణాలు చూపుతూ గోవా ప్రభుత్వం రాసిన ఈ లేఖతో ఐఓఏ పునరాలోచనలో పడింది. గోవా నుంచి మరో చోటికి జాతీయ క్రీడల వేదికను మార్చే బదులు అక్కడే మరికొన్ని రోజుల తర్వాత నిర్వహిస్తే బావుంటుందని నిర్ణయించింది.



'టాప్' నుంచి ప్రణీత్ ఔట్

న్యూఢిల్లీ: కొంతకాలంగా ఆటలో వెనకబడిన తెలుగు షట్లర్ బి. సాయి ప్రణీత్.. కేంద్ర ప్రభుత్వ టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్)లో చోటు కోల్పోయాడు. ఏస్ షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, సైనా నెహ్వాల్, పీవీ సింధుతో పాటు సమీర్ వర్మను వచ్చే ఒలింపిక్స్ వరకూ ఈ పథకంలో కొనసాగించాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) నిర్ణయించింది. ఈ స్కీమ్ కింద లబ్ధి పొందుతున్న క్రీడాకారుల ఆటతీరును బేరీజు వేసిన సాయ్.. కొందరిపై వేటు వేసి.. పలువురు కొత్త ప్లేయర్లకు అవకాశం కల్పించింది. గురువారం ప్రకటించిన తాజా జాబితాలో బ్యాడ్మింటన్, సైక్లింగ్, పారా-స్పోర్ట్స్ నుంచి 23 మంది ప్లేయర్లు చోటు దక్కించుకున్నారు. సాయి ప్రణీత్‌తో పాటు లక్ష్యసేన్‌ను తప్పించారు. డబుల్స్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి, ప్రణవ్ చోప్రా, సిక్కిరెడ్డిలను ఈ ఏడాది వరల్డ్ చాంపియన్‌షిప్స్ వరకు కొనసాగిస్తున్నట్టు సాయ్ తెలిపింది. సుమీత్ రెడ్డి, మను అత్రి, జక్కంపూడి మేఘన, పూర్విషా రామ్‌లను వెయిటింగ్ లిస్ట్‌లో ఉంచింది. 2020 టోక్యో పారాలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకొని ఏషియాడ్ గోల్డ్ మెడలిస్ట్ శరద్ కుమార్ సహా 12 మంది పారా అథ్లెట్లను లిస్ట్‌లో చేర్చినట్టు సాయ్ వర్గాలు తెలిపాయి.

రాజస్తాన్ సైక్లిస్ట్‌ల దయనీయం

- వెలోడ్రమ్ స్టాండ్‌లో వసతి
- చలిలో రాత్రంతా ప్లేయర్ల పడిగాపులు

జైపూర్: దేశంలో క్రీడలకు, క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా ప్లేయర్ల పరిస్థితి మాత్రం మారటం లేదు. రాజస్తాన్‌లో జరిగిన ఈ ఘటనే ఇందుకు తాజా ఉదాహరణ. సొంత రాష్ట్రంలోనే రాజస్తాన్ సైక్లిస్ట్‌ల దుస్థితి ఇప్పుడు చర్చనీయాంశమైంది. సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో గురువారం మొదలయ్యే జాతీయ సైక్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి దాదాపు 30 మంది ప్లేయర్లు నగరానికి చేరుకున్నారు. అయితే వారికి సరైన వసతి కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. ప్లేయర్లందరికీ ఓ చిన్న హాల్‌ను కేటాయించారు. పది డిగ్రీల టెంపరేచర్‌లో ప్లేయర్లు రాత్రంతా నిద్రలేకుండా గడిపారు. నేలపై వేసుకునేందుకు మ్యాట్లు మాత్రమే ఇచ్చిన



రాజస్తాన్ సైక్లింగ్ సంఘం మిగతా వాటి గురించి మరచిపోయింది. దీనంతటికి కారణం నిధుల కొరతేనని రాష్ట్ర సైక్లింగ్ సంఘం అధికారులు తెలిపారు. ఈ టోర్నీలో ఆడే చాలా జట్లు సొంత ఖర్చులతో హోటళ్లలో దిగితే సొంత రాష్ట్రం జట్టు పరిస్థితి ఇంత దయనీయంగా ఎందుకుందని స్థానిక క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు.

కివీస్ జట్టులోకి ఇద్దరు కొత్త కుర్రాళ్లు

వెల్లింగ్టన్: ఇండియాతో వచ్చే నెల ఆరు నుంచి ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల టీ20సిరీస్‌లో ఆడే న్యూజిలాండ్ జట్టులో ఇద్దరు కొత్త కుర్రాళ్లు డారెల్ మిచెల్, బ్లెయిర్ టిక్నర్‌కు చోటు దక్కింది. దేశవాళీల్లో రాణించిన మిచెల్, టిక్నర్‌లకు సెలెక్టర్లు ఈ జట్టులో అవకాశం కల్పించారు. ఫెర్గూసన్ మొదటిరెండు మ్యాచ్‌లకు మాత్రమే ఆడుతుండగా, టిక్నర్‌ను మూడో టీ20కి ఎంపిక చేశారు.

న్యూజిలాడ్ టీ20 జట్టు:
కేన్ విలియమ్సన్ (కెప్టెన్), గ్రాండ్‌హోమ్, బ్రేస్‌వెల్, ఫెర్గూసన్ , మార్టిన్ గప్టిల్, స్కాట్, డారిల్ మిచెల్, మన్రో, శాంట్నర్, టిమ్ సీఫర్ట్ (వికెట్ కీపర్), ఇష్ సోధి, టిమ్ సౌథీ, రాస్ టేలర్, టిక్నర్.

జాకబ్ ఔటాఫ్ డేంజర్

బరోడా: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీమిండియా మాజీ క్రికెటర్ జాకబ్ మార్టిన్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. డిసెంబర్ నుంచి ఐసీయూలో చికిత్స పొందుతున్న మార్టిన్ క్రమంగా కోలుకుంటున్నాడని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం మార్టిన్‌కు వెంటిలేటర్ తొలగించామని ఆయన మాట్లాడుతున్నారని చెప్పారు. వైద్య ఖర్చుల కోసం బీసీసీఐతో పాటు పలువురు క్రికెటర్లు, మాజీలు, బరోడా క్రికెట్ సంఘం మార్టిన్ కుటుంబానికి అండగా నిలిచారు. దాదాపు 20 లక్షల సాయం అందిందని, ఆసుపత్రి ఖర్చులు కూడా ఇప్పటి వరకూ దాదాపు 15 లక్షలు అయ్యాయని జాకబ్ భార్య వివరించింది. డిశ్చార్జ్ అయ్యాక జాకబ్ నెల రోజులు రిహాబిలిటేషన్‌కు వెళ్లాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు.

ప్రభాత వెలుగు తెలుగు దినపత్రిక V6 NEWS
క్రికెట్ టోర్నమెంట్
www.v6velugu.com v6velugu

వరంగల్‌లో సెలెక్షన్స్ పూర్తి

రేపటి నుంచి వీ6 వెలుగు టీ20 క్రికెట్ టోర్నీ

వరంగల్, వెలుగు : గ్రామీణ క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వెలుగు వీ6 మీడియా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌కు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పన్నెండు అసెంబ్లీ నియోజకవర్గాల జట్ల ఎంపిక పూర్తయింది. బుధవారం హన్మకొండలోని జేఎన్ స్టేడియంలో సెలెక్షన్స్ జరిగాయి. ఇందులో వరంగల్ వెస్ట్, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల జట్లను ఎంపిక చేశారు. సుమారు రెండు వందల మంది క్రీడాకారులు వచ్చారు. వీరిలో జట్టుకు పద్దెనిమిది మంది చొప్పున ఎంపిక చేశారు. కార్యక్రమానికి వరంగల్ అర్బన్ డీవైఎస్‌వో ధనలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫిబ్రవరి 1 నుంచి 8 వరకు వరంగల్ జిల్లాకు సంబంధించిన క్రికెట్ పోటీలు వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, భూపాలపల్లిలలో నిర్వహించనున్నారు.

కల్వకుర్తిలో..

నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో బుధవారం నిర్వహించిన సెలెక్షన్స్‌ను టోర్నమెంట్ డైరెక్టర్ వరుణ్ ప్రారంభించారు. నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట నుంచి వచ్చిన 148 మంది క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. ప్రతీ నియోజకవర్గం నుంచి 18 మందిని ఒక టీమ్‌కు ఎంపిక చేశారు. క్రికెట్ సెలెక్షన్స్ ఆర్గనైజర్ రాజ శేఖర్, మహబూబ్‌నగర్, కల్వకుర్తి క్రికెట్ కోచ్‌ల సమక్షంలో దాదాపు ఆరుగంటల పాటు సెలెక్షన్స్ జరిగాయి. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో తుది విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉన్నందున ఆయా ప్రాంతాల క్రీడాకారులకు గురువారం మహబూబ్‌నగర్ సెలెక్షన్స్‌లో అవకాశం ఇస్తామని ఆర్గనైజర్ రాజ శేఖర్ తెలిపారు.



క్రికెటర్లతో టోర్నమెంట్ డైరెక్టర్ వరుణ్

'శ్రీశాంత్ పద్ధతి బాలేదు'

న్యూ ఢిల్లీ : ఐపీఎల్‌లో స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడాలని బుకీలు సంప్రదిస్తే శ్రీశాంత్ ఆ విషయాన్ని బీసీసీఐ దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదని సుప్రీంకోర్టు బుధవారం ప్రశ్నించింది. ఈ మొత్తం వ్యవహారంలో శ్రీశాంత్ ప్రవర్తనను కూడా అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. ఈ కేసుకు సంబంధించిన క్రిమినల్ కేసు నుంచి 2015లో విముక్తి పొందిన శ్రీశాంత్‌పై బీసీసీఐ విధించిన జీవిత కాల నిషేధం మాత్రం కొనసాగుతోంది. దీనిని శ్రీశాంత్ సుప్రీంకోర్టులో సవాల్ చేశాడు. దీనిని విచారించిన బెంచ్.. ఫిక్సర్లతో శ్రీశాంత్ మాట్లాడిన కాల్ రికార్డింగ్‌ల అంశాన్ని ప్రస్తావించి క్రికెటర్ ప్రవర్తనను తప్పుబట్టింది. అయితే శ్రీశాంత్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని ఎలాంటి ఆధారాలు లేవని, ఫిక్సింగ్‌కు తనను ప్రేరేపిస్తున్నారని బోర్డుకు చెప్పకపోవడం తప్పు అయితే ఐదేళ్ల నిషేధం విధించాలని అతని తరపు న్యాయవాది కుర్షిద్ వాదించారు. తదుపరి విచారణ ఫిబ్రవరి 20న జరుగుతుంది.

ఇండోనేసియాపై ఇండియా రెండో విక్టరీ

జకార్తా: ఇండోనేసియాతో ఫ్రెండ్లీ సిరీస్‌లో ఇండియా మహిళల ఫుట్‌బాల్ జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో 2-0తో గెలిచింది. ఈ మ్యాచ్ ఫస్టాఫ్‌లో సంజు ఇండియా తరఫున తొలి గోల్ చేయగా, మ్యాచ్ ముగియడానికి కొద్ది నిమిషాల ముందు దంగ్‌మే గ్రేస్ మరో గోల్ చేసింది. సంజు గోల్ చేసిన కాసేపటికే ఇండోనేసియాకు లభించిన గోల్ అవకాశాన్ని ఆ జట్టు వృథా చేసుకుంది. కాగా, ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో ఇండియా 3-0తో ఇండోనేసియాను ఓడించింది.



పొలమే ఓ అడవి

దేశంలో విస్తరిస్తున్న ఫుడ్ ఫారెస్ట్ సేద్యం ● ఖర్చు తక్కువ.. రాబడి ఎక్కువ

వర్షాలు బాగా పడాలంటే.. భూవిస్తీర్ణంలో కనీసం 33 శాతం అడవులుండాలి. అట్లయితేనే పర్యావరణం సమతుల్యంగా ఉండి టైంకు వర్షాలు పడి పంటలు బాగా పండుతాయి. అందరికీ తిండి దొరుకుతుంది. రైతుకూ మేలు జరుగుతుంది. కానీ, మనిషి అవసరం అత్యాశై ఆ అడవులన్నీ 'చిన్న'బోతున్నాయి. పర్యావరణం చేజారిపోతోంది. కాలాలకు కాలం లేకుండా పోతోంది. అకాల వర్షాలు, అతి చలి, మంట పుట్టించే వేడి విపరీతమవుతున్నాయి. మరి, పంటలను, అడవులను బ్యాలెన్స్ చేస్తూ చూసే మరో అవకాశమే లేదా? ఆ ప్రశ్నకు సమాధానమే 'పంట అడవి'. అర్థం కాలేదా.. పంటలనే అడవుల్లా పెంచడమన్నమాట. సింపుల్‌గా ఫుడ్‌ఫారెస్ట్స్. ఇప్పుడు దేశంలో చిన్నచిన్నగా అన్ని ప్రాంతాలకూ పాకేస్తోందీ కాన్సెప్ట్ సేద్యం.

ప్రపంచంలో చెక్కుచెదరని అడవులు అని ప్రశ్న వేస్తే వచ్చే సమాధానం అమెజాన్ తడి అడవులు. లేదంటే అమెజాన్ రెయిన్ ఫారెస్ట్స్ అని చెప్పొచ్చు. మరి, మనిషి సృష్టించిన అడవుల్లో అలా చెక్కుచెదరకుండా ఉన్నవేంటి? అంటే తమిళనాడులోని విల్లుపురంలో ఉన్న రైతులు పండిస్తున్న పంటలు. అవే పంట అడవులు. ఇప్పుడు అక్కడ రైతులు ఎంచుకుంటున్న బాట అదే. వాతావరణ మార్పులకు పరిష్కారంగా, ఆహార అవసరాలను తీర్చేలా ఉన్న భూమిలోనే పంటలతో అడవులను సృష్టిస్తున్నారు. మామూలుగా అయితే ఒక పొలంలో ఒక పంటే పండిస్తున్నారిప్పుడు. కొన్ని కొన్ని పంటల్లో అయితే అంతర పంటలను వేస్తున్నారు. ఈ పంట అడవుల్లో మాత్రం ఒక్క పొలంలోనే దాదాపు ఏడెనిమిది రకాల పంటలను వేస్తారు. అందుకు భూమి దున్నాల్సిన అవసరం లేదు. నీళ్లు ఎక్కువ పోయాల్సిన పనిలేదు. కలుపు బెడద ఉండదు. పురుగు పుట్రను చంపేందుకు పురుగుమందుల అవసరం రానే రాదు.

దిగుబడి ఎక్కువే...

తంగవేలు.. 62 ఏళ్ల రైతు. 2008లో సుభాష్ పాలేకర్ నాటిన ఖర్చు లేని పొలానికి ఒకసారి వెళ్లారు. ఆ అడుగులే బహుళ పంటలను వేసే దిశగా మరో అడుగు వేసేలా చేశాయి. విల్లుపురం జిల్లాలోని పూథురై గ్రామంలో 30 సెంట్ల భూమిని కౌలుకు తీసుకుని ప్రయోగాత్మకంగా సరికొత్త ఆలోచనకు నాంది పలికారు. "స్థానిక చెట్లతో చుట్టూ ఓ కంచెలా వేశాం. నేలను పాడు చేయకుండా వర్షం నీటిని మళ్లించేందుకు పైపులతో డ్రిఫ్ట్ పెట్టాం. అరటి, పసుపు వంటి పంటలతో చిన్నపాటి పంట అడవిని నాటాం. దానికి మనుషుల అవసరమూ చాలా తక్కువే" అని తంగవేలు చెప్పుకొచ్చారు. ఎండలు మండినా లోపలి వాతావరణాన్ని చుట్టూ నాటిన చెట్లు చల్లగా ఉంచేందుకు దోహదపడ్డాయి. బొప్పాయి, అరటి, పసుపు, మిరప, చిరుధాన్యాలు, పూలు వంటి వాటిని లోపల పెంచుతున్నారు. మామూలు పంటలో చెట్టుకు 300 గ్రాముల దిగుబడి వస్తే.. ఫుడ్ ఫారెస్ట్‌లో మాత్రం చెట్టుకు కిలో చొప్పున దిగుబడి వస్తోందంటూ తంగవేలు చెప్పారు. ఆలోచన సక్సెస్ కావడంతో 2018లో పుదుచ్చేరిలోని తిరుభువనైలోగల తన సొంత పొలంలోనూ అదే ఫార్ములాను అనుసరించాడు.



- పర్యావరణం, అడవులు, పంటను బ్యాలెన్స్ చేసేలా సాగు
- ఒక్క పొలంలోనే 7 లేయర్లుగా పంటలు
- పురుగు మందులు, నీళ్లు అవసరం లేకుండానే పెంపకం

ప్రాంతాన్ని బట్టి పంటలు

అయితే, ప్రాంతం, అక్కడి వాతావరణాన్ని బట్టి ఫుడ్ ఫారెస్ట్‌లో వేసే పంటలను ఎంచుకోవాల్సి ఉంటుందని మధ్యప్రదేశ్‌లోని అరణ్యానిలో ఇలాంటి ఫార్మ్ లానే అనుసరిస్తున్న సందీప్ సక్సేనా చెబుతున్నారు. ఏడేళ్ల క్రితం ఆయన అక్కడ ఫుడ్ ఫారెస్ట్‌ను స్టార్ట్ చేశారు. అరణ్యానిలో వేసిన ఫుడ్ ఫారెస్ట్‌లో పాడిపశువులు, చేపలు, తేనెటీగల పెంపకాన్నీ చేపడుతున్నారు. దాదాపు 150 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అందులో భాగంగా ముందు కొన్ని పశువులను ఖాళీ స్థలంలో వదిలేశారు. ఆ తర్వాత కొన్ని రకాల పూలు, ఔషధ మొక్కలను నాటారు. అవి మంచిగా పెరుగుతున్నాయని నిర్ధారణకు వచ్చాక వేప వంటి పెద్ద చెట్లను నాటారు. ఓ సంవత్సరం తర్వాత అవి పెరిగి పెద్దయ్యాయి. తర్వాత వాటి లోపల నిమ్మ, క్రాన్‌బెర్రీ వంటి చెట్లను పెంచడం ప్రారంభించారు. నాలుగేళ్ల తర్వాత పసుపు, ఆలుగడ్డ పంటలు వేశారు. ఆ ఫుడ్‌ఫారెస్ట్‌లోనే పశువుల తాగునీటి అవసరాల కోసం ఓ చిన్నపాటి చెరువును తవ్వారు. వాటిలోనే చేపల పెంపకాన్ని ప్రారంభించారు. ఇప్పటికి అందులో 175 రకాల చెట్ల జాతులు, పశువులు ఉన్నాయి. సేంద్రియ వ్యవసాయం కన్నా ఇదే మేలని సక్సేనా అంటున్నారు. పునరుత్పాదక విత్తనాలను పంట కోసం వాడుతున్నామని, పంట కోతకొచ్చాక, భూమిలో మిగిలిపోయిన పంట అవశేషాలతోనే మళ్లీ పంట వస్తుందని చెప్పారు.

పర్యావరణం కంట్రోల్‌లో

ఇలాంటి పంటల వల్ల వర్షం పడినా బెంగ పడాల్సిన అవసరం లేదంటున్నారు సక్సేనా. ఎందుకంటే పెద్ద పెద్ద వర్షాలు వచ్చినా ఆ నీటిని భూమి పీల్చేసుకుంటుందని, వరదలు పారవని చెబుతున్నారు. పొలంలో పెంచుతున్న చెట్లు గాల్లోని తేమనే నీటిగా వాడుకుంటాయని, కాబట్టి బయటి నుంచి నీరు పెట్టాల్సిన అవసరం లేదని చెప్పారు. మొత్తంగా కరువులు అన్న మాటకు ఇలాంటి పంటల్లో తావు లేదన్నారు. మండుటెండలున్నా, విపరీతమైన చలి వాతావరణం ఉన్నా వేప, మల్బరీ లాంటి చెట్లు ఉష్ణోగ్రతలను నియంత్రణలో ఉంచుతాయన్నారు.

అందరికీ...

ఇప్పుడీ ఫుడ్ ఫారెస్ట్ చిన్నచిన్నగా అన్ని చోట్లకు విస్తరిస్తోంది. అసోంలోనూ ఈ తరహా పంటలు వెలుస్తున్నాయి. సమీర్ బోర్డోలోయ్ అనే రైతు తనకున్న మూడు ఎకరాల్లో ఈ తరహాలోనే పంటలు పండిస్తూ మంచి లాభాలు పొందుతున్నాడు. 2016లో ఫుడ్ ఫారెస్ట్ పద్ధతిలో పంటల పెంపకం వైపు మళ్లాడు. యామ్ (దుంపలు), నిమ్మ, మిరప, హెర్బల్ టీ తదితర పంటలు వేస్తున్నాడు. పంట చుట్టూ బొంగు (వెదురు) చెట్లను మొదటి లేయర్‌గా వేస్తున్నట్టు చెప్పాడు. స్థానిక హెర్బల్ టీకి కిలోకు రూ.10 చొప్పున వస్తుంటే.. తాను వేసిన టీ కిలోకు రూ.400 ధర పలుకుతోందన్నాడు. మిరపకాయలైతే కిలోకు రూ.200 పలుకుతున్నాయని, దాదాపు 80 కిలోల పంట చేతికొస్తుందని అంటున్నాడు. ఇప్పుడు 150 స్కూళ్లతో కలిసి పనిచేస్తున్నాడు బోర్డోలోయ్. ఆయా స్కూళ్లలో ఫారెస్ట్ గార్డెన్‌లను ఏర్పాటు చేయిస్తున్నాడు. కాగా, తమిళనాడులో వృథాగా ఉన్న ప్రభుత్వ భూముల్లో ఈ తరహా పంటలను ప్రోత్సహిస్తున్నామని కుమరవేలు చెప్పారు.

సహజమైన అడవుల్లానే...

అడవులు తగ్గుతున్న కొద్దీ పర్యావరణం మరింత క్షీణించి పంటలు నాశనమవుతున్నాయని, దానికి మంచి పరిష్కారమే ఫుడ్‌ఫారెస్ట్స్ అని పుదుచ్చేరి అటవీ, వన్యప్రాణి విభాగం డిప్యూటీ డైరెక్టర్ కుమరవేలు అన్నారు. "అడవులే మనం తినే తిండిని ఇస్తే ఎలా ఉంటుందో ఒక్కసారి ఊహించుకోండి. అదే ఈ ఫుడ్ ఫారెస్ట్ కాన్సెప్ట్" అని కుమరవేలు చెప్పార. మామూలు అడవుల్లా ఉండేందుకు వీటిని ఏడు లేయర్లుగా ఏర్పాటు చేస్తున్నారు.

- ఒకటో లేయర్ కింద కనోపి (పెద్ద చెట్లు, దీన్నే అప్పర్ లేయర్ అని చెప్పొచ్చు) చెట్లు పెంచుతారు. అవి కూడా పండ్లు, పోషకాలు కలిగిన డ్రై ఫ్రూట్స్, ఔషధ గుణాలు కలిగిన చెట్లను నాటుతారు. మామిడి, పనస, బాదం, వేప వంటివి.
- రెండో లేయర్‌లో పండ్లిచ్చే పొట్టి చెట్లు పెడతారు. అరటి, బొప్పాయి వంటి చెట్లు.
- మూడో లేయర్‌లోనూ చిన్నచిన్న ఫలాలిచ్చే పొదలను పెంచుతారు.
- నాలుగో లేయర్‌లో హెర్బల్ (ఔషధ) మొక్కలను పెంచుతారు.
- ఐదో లేయర్‌లో భూమిపై పాకే తీగ పంటలను వేస్తారు. దోసకాయ, పుచ్చకాయ వంటివి.
- ఆరో లేయర్ కింద దుంపలు, వేరు పంటలను పెంచుతారు. వేరుశనగ, పసుపు, ఆలుగడ్డ వంటివి.
- చివరగా ఏడో లేయర్‌లో భాగంగా పైకి పాకే తీగ పంటలు పండిస్తారు. ద్రాక్ష, చిక్కుడు, పొట్లకాయ వంటివన్నమాట.

కాశ్మీర్‌పై సినిమాకు సర్టిఫికెట్ కష్టాలు

'నో ఫాదర్స్ఇన్‌కాశ్మీర్' తీసిన టాప్‌డైరెక్టర్




పవర్ పాలిట్రిక్స్ ముందు కళ నిలబడగలదా? కళాపుత్రుడు అశ్విన్‌కుమార్ ఆరు నెలలుగా ఈ రెండింటి ప్రతాపాన్ని చవి చూస్తున్నారు. అశ్విన్ ప్రముఖ దర్శకుడు. కథ, కథనంతో ప్రేక్షకుల్ని కట్టిపడేసే ఆయన సామర్థ్యం, రెండు జాతీయ స్థాయి అవార్డుల్ని తెచ్చిపెట్టింది. ఆ తర్వాత అశ్విన్ ఎంచుకున్న ప్రాజెక్టు కాశ్మీర్. ఇండియా మొత్తం ఒక ఎత్తయితే, కాశ్మీర్ ఒక్కటి మరో ఎత్తు అనేది చూపించాలనుకున్నారు. అందుకు ఇద్దరు టీనేజర్ల ప్రేమ కథను ఎంచుకున్నారు. 'నో ఫాదర్స్ ఇన్‌కాశ్మీర్' అని సినిమాకు పేరు పెట్టారు. చిత్రీకరణ పూర్తి చేశారు. కానీ సెన్సార్ బోర్డు చిత్ర విడుదలకు అనుమతి ఇవ్వడం లేదు. సినిమాను నిషేధిస్తున్నామనో, లేదనో బోర్డు సభ్యులు చెప్పడం లేదు. దీంతో ఆర్నెల్లుగా సినిమా విడుదలకు నోచుకోవడం లేదు. చిత్రంలో ప్రధాన పాత్రల పోషించిన హీరో, హీరోయిన్లకు కన్న తండ్రి ఎవరో తెలీదు. నాన్నల ఆచూకీ కోసం వెతుకుతూ కలుసుకుంటారు. ఆపై ప్రేమలో పడతారు. తన కథ కాశ్మీర్ యువత సమస్యను ప్రతిబింబిస్తుందని అశ్విన్ పేర్కొన్నారు. ఈ చిత్ర విడుదలను అడ్డుకోవడం వల్ల కాశ్మీర్ గురించి మిగతా దేశం తెలుసుకునే అవకాశం లేకుండా పోతుందని అన్నారు. గత ఏడాది జూలైలో సెంట్రల్‌బోర్డ్ ఆఫ్ ఫిల్మ్‌సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ)కి సినిమాను పంపినట్లు చెప్పారు. నాటి నుంచి ఎన్నో ఈ మెయిళ్లు, రిక్వెస్ట్‌లు చేశానని, రెండు రివ్యూ మీటింగులకూ వెళ్లానని వెల్లడించారు. చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్ ఇస్తామన్నారని, కొన్ని కట్స్‌కూడా సూచించారని తెలిపారు. ప్రస్తుతం సినిమా విడుదలపై అశ్విన్ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. అశ్విన్ తరఫు న్యాయవాది కరుణా నండి మాట్లాడుతూ ఏ సర్టిఫికెట్‌నూ తాము తీసుకోబోమని స్పష్టం చేశారు.

'భర్త వేపుడు' తింటారా?

ఈ వార్త భర్తలకు అంతగా రుచించదేమో! భార్యలను ఈ రెస్టారెంట్‌కు తీసుకెళ్లాలంటే ఓ సారీ ఆలోచించుకుంటారుగా అని రాస్తున్నం. ఎక్కడి నుంచి వచ్చిందో ఏమో.. ఓ ఫొటో బిజినెస్‌మెన్ ఆనంద్‌మహీంద్రా కంటపడింది. అందులో ఏం రాసివుందో చదివి, ఒక్కసారిగా స్టన్ అయిపోయారు. తేరుకుని కాసేపు నవ్వుకున్నారు. ఆపై నెటిజన్లను చక్కిలిగింతలు పెట్టాలనుకున్నారు. ట్విట్టర్‌లో పోస్టు చేశారు. ఇంతకీ అందులో ఏముందో తెలుసా? "డెలిషియస్ రోస్టెడ్ హస్బెండ్ (భర్త వేపుడు)" అని వుంది. ఓ



చైనీస్ రెస్టారెంట్లోని వంటకం పేరది. "నా భార్యను ఈ రెస్టారెంట్‌కు తీసుకెళ్లాలంటే ఓ సారి ఆలోచిస్తా. పొరపాటున ఆమె ఈ మెనూ చదివి, ఊహించని నిర్ణయం తీసుకుంటే నా పని అంతే!" అని పోస్టులో పేర్కొన్నారు. మహీంద్రా హాస్య చతురతకు నెటిజన్లు మనసారా నవ్వుకుని కౌంటర్ సెటైర్లు వేశారు. "అంతేగా.. అంతేగా మన పరిస్థితి ఇంతేగా" అంటూ జోకులు పేల్చారు. చైనా భాష మాండరిన్ నుంచి ఇంగ్లీష్‌కు అనువదించడంలో వచ్చిన తప్పు వల్ల డిష్ ఇలా మారిపోయిందన్నమాట!



ఎగ్‌లో డ్రగ్

రోజుకో గుడ్డు తింటే మనిషి బలంగా తయారవుతాడనే మాట మన దేశంలో బాగా పాపులర్ అయింది. అదే గుడ్డు భవిష్యత్‌లో కేన్సర్ రాకుండా చేయబోతోంది. జన్యు మార్పిడి చేసిన కోళ్లు కేన్సర్ ను నిరోధించే శక్తి గల గుడ్లు పెట్టాయట. బ్రిటన్‌లోని ఎడిన్‌బర్గ్‌వర్సిటీ సైంటిస్టుల బృందం ఈ విషయాన్ని వెల్లడించింది. మనిషిలోని కొన్ని కీలక జన్యువులను, కోళ్లలో ప్రవేశపెట్టినట్లు చెప్పింది. దీని వల్ల అవి మనిషిలో కేన్సర్ కణాలను చంపేసే శక్తిగల రెండు ప్రోటీన్లతో గుడ్లు పెట్టాయని పేర్కొంది. ఈ పద్ధతి ద్వారా అతి చౌకగా కేన్సర్‌తో పోరాడొచ్చని సైంటిస్టులు పేర్కొంటున్నారు. జన్యు మార్పిడి కోళ్ల గుడ్లపై ప్రత్యేక అధ్యయనం చేసిన తర్వాతే ఈ నిర్ధారణకు వచ్చామన్నారు. ఈ గుడ్ల తెల్లసొన తినడం వల్ల చాలా ప్రయోజనం ఉంటుందని చెప్పారు. అయితే ఇప్పట్లో దీన్ని ప్రభుత్వాలు ఆమోదిస్తాయన్న నమ్మకం లేదన్నారు. జన్యు మార్పిడి కోళ్లు వచ్చేందుకు మరో 20 ఏళ్లు పట్టొచ్చన్నారు.



ఢిల్లీలో 7 వింతలూ చూసేద్దాం

- దక్షిణ ఢిల్లీలో వరల్డ్ వండర్ పార్క్
- 'చెత్త'తో ఆకృతుల నిర్మాణం
- రూ.7.5 కోట్ల ఖర్చు
- ఫిబ్రవరి రెండో వారంలో ప్రారంభం

న్యూఢిల్లీ: ప్రపంచ వింతలు ఢిల్లీకొస్తున్నాయి. ఏడు వింతలు ఒకేచోట కనువిందు చేయనున్నాయి. సరై కాలే ఖాన్ బస్ టెర్మినల్ దగ్గర ఈ వండర్ పార్క్‌ను దక్షిణ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తోంది. అచ్చం తాజ్‌మహల్, గిజా గ్రేట్ పిరమిడ్, పిసా లీనింగ్ టవర్స్, క్రీస్ట్ ద రిడీమర్ స్టాట్యూ, రోమ్స్ కొలోజియం, స్టాట్యూ ఆఫ్ లిబర్టీ నకళ్లనే రూపొందిస్తోంది. పైగా ఆ నిర్మాణాలన్నింటినీ ఆటోమొబైల్ చెత్తతోనే చెక్కుతోంది. ఇప్పటికే వాటికి సంబంధించిన పనంతా పూర్తయింది. ప్రతి కట్టడంలోపల సోడియం లైట్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కట్టడాల చుట్టుపక్కల ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దే పనిలో ఉన్నారు. ఇది పూర్తయితే పార్కంతా విద్యుత్ లైట్లలో ధగధగలాడుద్ది. పార్కు కోసం మొత్తంగా రూ.7.5 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇంతకీ పార్కును ఎప్పుడు ప్రారంభిస్తున్నారో తెలుసా? ఫిబ్రవరి రెండో వారంలో.

మొత్తం సోలార్ కరెంటే

పార్కు నిర్వహణకు రెన్యువబుల్ ఎనర్జీ నుంచి ఉత్పత్తి అయిన విద్యుత్‌నే వాడతారంట. అందుకు కార్పొరేషన్ ఏర్పాట్లు కూడా చేస్తోంది. పార్కు దగ్గర ఇప్పటికే 3 సోలార్ చెట్లను సిద్ధం చేసింది. ఒక్కొక్కటీ సుమారు 6 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. సాధారణ 'ఫిక్స్‌డ్-టిల్ట్' సోలార్ పలకల కన్నా 40 శాతం ఎక్కువగా ఇవి కరెంటును ఉత్పత్తి చేయగలవు. అలాగే పాత షిప్పింగ్ కంటెయినర్‌ను వాష్‌రూంగా మార్చి దానిపై సోలార్ ప్యానళ్లను బిగించారు. ఓ విద్యుత్ గాలి మరను కూడా రెడీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇలా ఉత్పత్తి చేసిన కరెంటులో పార్కు నిర్వహణకు తక్కువే ఖర్చవుతుంది కాబట్టి మిగిలే 10-12 కిలోవాట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానిస్తారట. సోలార్ చెట్లకున్న మరో ప్రత్యేకత 'మిస్ట్ కూలింగ్ టెక్నాలజీ'. చెట్లకున్న చిన్న సైజు రంధ్రాల నుంచి నీటిని పంపి నీటివాయువుగా మార్చనున్నారు. వాతావరణంలోని వేడిని తీసుకుని ఈ నీటి అణువులు వాయువుగా మారతాయి. తర్వాత చల్లబడి చుట్టుపక్కల కాలుష్యాన్ని తగ్గిస్తాయి.

రాజస్థాన్‌లోని కోటా పార్కును చూసే

ఇక కట్టడాల విషయానికొస్తే.. నకళ్లు 25 నుంచి 30 అడుగుల వరకు పొడవుంటాయి. ఒక్క ఈఫిల్ టవర్ మాత్రమే 70 అడుగులు ఉంటుంది. సెల్ఫీలు తీసుకోడానికి ప్రత్యేక ప్రాంతాన్ని కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. ప్రతి నిర్మాణం దగ్గర అసలైన కట్టడం పూర్వాపరాలు, ఏయే వస్తువులు, పదార్థాలతో నకళ్లను తయారు చేశారో వివరాలుంటాయి. ఉదాహరణకు క్రీస్ట్ ద రిడీమర్ స్టాట్యూ కోసం పాత ఇనుప బెంచులు వాడారు. తాజ్‌మహల్ కోసం సైకిళ్ల విడి భాగాలను వినియోగించారు. ఢిల్లీ పార్కుకు రాజస్థాన్‌లోని కోటలోని పార్కే ప్రేరణ అని అధికారులంటున్నారు. పార్కు నిర్వహణ కోసం కొద్ది మొత్తంలో ఎంట్రీ ఫీజు వసూలు చేస్తామని చెప్పారు. ఫుడ్ స్టాళ్లు, పార్కింగ్ సౌకర్యం, చిన్నారులకు ఆట స్థలం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

'ఓకే గూగుల్' నన్ను పెళ్లి చేసుకో..!



నేటి కుర్రకారు చేతిలో కనిపించేది స్మార్ట్‌ఫోన్. పొద్దున లేచిన దగ్గర్నుంచి, పడుకునే దాకా దానిలో వందల సార్లు తరచి చూస్తుంటారు. 'ఓకే గూగుల్' ఈ పని చేసి పెట్టు, ఆ పని చేసి పెట్టూ అంటూ గూగుల్‌కు సూచనలిస్తుంటారు. ఈ మధ్య ఓ చిత్రమైన విషయం బయటపడింది. దేశంలో పెళ్లి కాని యువత, గూగుల్‌ను ఓ ప్రశ్నతో తెగ ఇబ్బంది పెట్టేస్తున్నారట. "ఓకే గూగుల్ ప్లీజ్ మ్యారీ మీ" అంటూ ప్రపోజ్ చేస్తున్నారట. ఈ మేరకు గూగుల్, ఇండియన్‌యూత్ తమ యాప్ 'గూగుల్ అసిస్టెంట్'ను పెళ్లి చేసుకోమని అడుగుతున్నారంటూ ట్విట్టర్‌లో పోస్టు చేసింది. నిజంగా..నిజంగా..నిజంగా... ఇలా ఎందుకు అడుగుతున్నారో మాకు తెలుసుకోవాలనుందీ అని గూగుల్ తన పోస్టులో పేర్కొంది. దీనిపై నెటిజన్లు తమదైన శైలిలో చమత్కరించారు. "అందరికంటే అసిస్టెంట్ చాలా బాగా టైమ్‌మేనేజ్ చేస్తుంది. ఉదయాన్నే నిద్ర లేపుతుంది. ఫోన్లు చేస్తుంది. ఏం కావాలంటే అతి సెకన్లలో వెతికిపెడుతుంది. ఇంతకంటే మంచి అమ్మాయి ఎవరికి దొరుకుతుంది. అందుకే అసిస్టెంట్ నా ప్రేమ" అని ఓ యూజర్ తన లవ్‌ను వ్యక్త పరిచారు. "మేం కూడా నిజంగా.. నిజంగా.. నిజంగా... మిమ్మల్ని ఒకటి అడగాలనుకుంటున్నాం. మీరెందుకు మా పర్సనల్ టాక్‌ను చూస్తున్నారు. మాక్కొంచెం ఏకాంతం కావాలి. మమ్మల్ని, మా అసిస్టెంట్‌నూ వదిలేయండి" అంటూ మరో యూజర్ కామెంట్ చేశారు.

మళ్లీ పుట్టింది

పుట్టినోళ్లు చనిపోవడం తప్పదు.. చనిపోయినోళ్లు మళ్లీ పుట్టక తప్పదు.. ఇదీ పెద్దలు చెప్పే మాట. మరి, నిజంగానే పునర్జన్మలుంటాయని మీరు నమ్ముతారా? కానీ, శాంతి దేవి అనే ఓ మహిళ స్టోరీ చదివితే నిజం లాంటి నిజంలాగే అనిపిస్తుంది. అబద్ధం లాంటి మాయ కమ్మేస్తుంది. ఇప్పటిదాకా పునర్జన్మపై డాక్యుమెంట్ చేసిన స్టోరీల్లో ఆమెదే హైలైట్. ప్రపంచ వ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించిందామె. అంతే కాదు, నిజంగా ఆమెది పునర్జన్మేనని మహాత్మా గాంధీ వేసిన కమిటీయే తేల్చడం మరో విశేషం. 1926 డిసెంబర్ 11న ఢిల్లీలోని ఓ మామూలు మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన ఆమె స్టోరీ ఏంటో ఓ సారి చూసేద్దాం..





- అప్పట్లో సంచలనం
- స్వయంగా కమిటీ వేసిన మహాత్మా గాంధీ.. నిజమేనని నివేదిక

అది 1930.. నాలుగేళ్లు అప్పటికామెకు. అంత చిన్న వయసులోనే ఆమె తన అమ్మనాన్నల దగ్గర ఓ పెద్ద బాంబు పేల్చింది. "నాకిది పునర్జన్మ. నా గతం వేరే. నా కుటుంబం ఇది కాదు. నా కుటుంబాన్ని కలవాలి" అంటూ షాక్ ఇచ్చింది. రక్తం పంచుకు పుట్టిన బిడ్డ అలా అనేసరికి ఆ అమ్మానాన్నలు కాస్త ఆశ్చర్యపోయినా.. అదంతా ఒట్టిదేలే అని కొట్టిపారేశారు. అయినా ఆమె మనసులో తన గతం తాలూకు జీవితమే మెదిలింది.

గతంలో లుగ్దీ దేవి.. భర్త కేదార్‌నాథ్

"నేను శాంతి కాదు..నా పేరు లుగ్దీ దేవి. నాది మథుర. నా భర్త కేదార్‌నాథ్"అని ఆమె తన గత జన్మ గురించి చెప్పడం మొదలుపెట్టింది. ప్రసవం తర్వాత పది రోజులకే తాను చనిపోయానని తెలిపింది. ఇలా ప్రతి విషయాన్ని పూస గుచ్చినట్టు ఆమె చెప్పినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో బాధపడిన ఆమె ఆరేళ్ల వయసులో ఇల్లు విడిచి పారిపోయింది. ఎలాగోలా తన ఊరు అనుకుంటున్న మథురకు వెళ్లాలని ప్రయత్నించింది. కానీ, చివరి నిమిషంలో ఆమె ఆశలను ఆవిరిచేస్తూ తల్లిదండ్రులు ఆమెను పట్టుకోగలిగారు. ఆమె బాధను తీర్చడానికి ఆమె చదువుతున్న స్కూల్‌లోని ఓ టీచర్ 'కేదార్‌నాథ్' పేరుతో, మథుర అడ్రస్‌తో లేఖ పంపారు. అందరికీ తెలియని విషయమేంటంటే.. ఆ ఉత్తుత్తి కేదార్‌నాథే అసలైన కేదార్‌నాథ్ అని. తర్వాత ఢిల్లీకి వచ్చాడు. కేదార్‌నాథ్ తమ్ముడిగా పరిచయం చేసుకున్నాడు. తనతో పాటు తన కుమారుడిని తీసుకొచ్చాడు. ఆయన వచ్చీ రాగానే ఆరేళ్ల ఆ చిన్నది.. కేదార్‌నాథ్‌ను గుర్తుపట్టేసింది. వాళ్ల జీవితం గురించి మనసులో దాగిన ఎన్నో ప్రశ్నలను కేదార్‌నాథ్ సంధించాడు. ఆయన అడిగిన ప్రతీ ప్రశ్నకు జవాబు చెప్పింది శాంతి దేవి అలియాస్ లుగ్దీ దేవి.

కార్చిచ్చులా పాకేసింది...

ఆమె పునర్జన్మకు సంబంధించిన విషయం ఆ నోటా ఈ నోటా దావాగ్నిలా వ్యాపించింది. చివరకు గాంధీజీ చెవిన పడింది. ఆయనకూ ఆ కథేంటో తెలుసుకోవాలన్న ఆసక్తి పుట్టింది. వెంటనే ఆమెను కలిశారు. ఆమె నోటి నుంచి విన్న ప్రతి మాటకు ఆయన షాక్ అయ్యారు. వెంటనే కమిషన్ వేసి దర్యాప్తు చేయించారు. 1935 నవంబర్ 15న శాంతిని తీసుకుని దర్యాప్తు బృందం మథురకు వచ్చింది. అక్కడి నుంచి తన జీవితంలో జరిగిన ప్రతీ విషయాన్ని పూస గుచ్చినట్టు దర్యాప్తు అధికారులకు చెప్పింది శాంతి. తన ఇల్లు, తల్లిదండ్రులు, చుట్టపక్కాలు, భర్త, కొడుకు, తాను తిరిగిన ప్రాంతాలన్నింటినీ వివరించింది. తాను మరణశయ్యపై ఉన్నప్పుడు తన చివరి కోరికలేవీ భర్త తీర్చలేదని, అందుకే మళ్లీ జన్మించానని చెప్పింది. దీంతో ఆమెది నిజంగానే పునర్జన్మ అంటూ బాల్‌చంద్ నహతా నేతృత్వంలోని కమిటీ తేలుస్తూ నివేదికిచ్చింది. హిందీలో పుస్తకాన్నీ అచ్చేశారు. దాంతో పాటే మరో రెండు నివేదికలూ ఆమె జీవితంపై వచ్చాయి. పుస్తకాల రూపంలో అచ్చయ్యాయి. నివేదికొచ్చిన తర్వాత పెద్ద రచ్చే జరిగింది. ఇంద్ర సేన్ అనే వ్యక్తి కూడా ఆమె జీవితంపై ఓ నివేదికిచ్చారు. ఆ తర్వాత కొన్నేళ్లకు స్వీడన్‌కు చెందిన ఓ రచయిత ఇండియాకొచ్చారు. ఆమె జీవితంపై ఆరా తీశారు. ఆమెని రెండు సార్లు కలిశారు. ఆమె మాటలు, ఆధారాలు సేకరించి ఇంగ్లిష్, స్థానిక భాషల్లో పుస్తక రూపంలో తీసుకొచ్చారు. శాంతి దేవి ఆజన్మాంతం పెళ్లి చేసుకోకుండా ఉండిపోయింది. తనకు అంతకుముందే పెళ్లయిపోయిందన్నది ఆమె వాదన.



"నేను దాదాపు సంతృప్త స్థాయికి చేరిపోయాను. మోక్షం లభించింది. కానీ, నేను తప్పు చేశాను. మళ్లీ భూమ్మీద పుట్టాలని ఎన్నో కలలుగన్నాను. నా కొడుకును, భర్తను చూడాలనుకున్నాను. నా ప్రేమలో స్వార్థం ఉంది. దు:ఖం ఉంది. నేను చనిపోయినా నన్ను నేను ప్రేమిస్తూనే ఉంటా. అందుకే నేను చనిపోయినా మళ్లీ పుట్టా"
- శాంతి దేవి

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.